PRGI Reg No -“APTEL/26/A1193

# నేటి శుభోదయ

ప్రతి క్షణం – ప్రజల కోసం

తెలుగు దినపత్రిక

చదవండి.... చదివించండి...



ప్రతిక్షణం... ప్రజల కోసం...

www.netishubhodaya.com

96965 71571

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్, సంపుటి 01, సంచిక 94, సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -8, సోమవారం - 25 - మే - 2026 , వెల రూ.5/-

## బలూచిస్థాన్‌లో రక్తపాతం.. పాక్ సైనికులు వెళుతున్న రైలుపై ఉగ్రదాడి.. 24 మంది మృతి



క్వెట్టాలో జరిగిన ఉగ్రదాడిలో 24 మంది మృతి

మృతుల్లో సైనిక సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు

కారు బాంబుతో దాడి చేసినట్లు వెల్లడి

## విజయ్ గెలుపు ఒక ‘సినిమా సునామీ’.. ఆ ప్రభుత్వం ఎప్పుడైనా కూలిపోవచ్చు: స్టాలిన్



తమిళనాడులో అధికార, విపక్ష పార్టీల మధ్య మొదలైన మాటల యుద్ధం

విజయ్ ప్రభుత్వం ఐదేళ్ల పాటు కొనసాగలేదన్న స్టాలిన్

టీవీకే పార్టీ మేజిక్ ఫిగర్ మార్కును కూడా దాటలేక పోయిందని ఎద్దేవా

## మూర్ఖులు ఎక్కడైనా ఉంటారు: మార్కో రూబియో

భారత పర్యటనలో ఉన్న రూబియో



అమెరికాలో భారతీయ సమాజం గొప్పగా రాణిస్తోందని వ్యాఖ్య

కొన్ని గంటల్లో ప్రపంచానికి ఒక శుభవార్త అందే అవకాశం ఉందన్న రూబియో



## జగన్ రక్తచరిత్ర అందరికీ తెలుసు.. వచ్చే ఎన్నికల్లో వైసీపీకి ‘జీరో’నే

- వైఎస్ కుటుంబ రక్త చరిత్ర తెలిసే.. ప్రజలు వైసీపీని 11 సీట్లకు పరిమితం చేశారన్న నారాయణ
- స్వచ్ఛ భారత్ నిధులను కూడా గత వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించిందని ఆరోపణ
- ఈసారి హైబ్రిడ్ విధానంలో మహానాడు కార్యక్రమం జరుగుతుందన్న మంత్రి

అమరావతి: వైసీపీ అధినేత జగన్ లక్ష్యంగా మంత్రి పి. నారాయణ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో రక్తచరిత్ర ఎవరిదో మిగతా 2 లో




## విశాఖలో ఘనంగా బండారు దత్తాత్రేయ ఆత్మకథ పుస్తకం ఆవిష్కరణ

- బండారు దత్తాత్రేయ ఆత్మకథ ‘ప్రజల కథే నా ఆత్మకథ’ పుస్తకం ఆవిష్కరణ
- ముఖ్య అతిథిగా హాజరైన ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు
- ప్రజల ఆశీర్వాదాలే తన బలమన్న దత్తాత్రేయ

## ఏఐ సాయంతో వైద్యం.. ‘సంజీవని’ సేవలను ప్రత్యక్షంగా వీక్షించిన చంద్రబాబు


చిత్తూరు జిల్లా యాదమరిలోని ‘సంజీవని’ పీహెచ్‌సీని సందర్శించిన సీఎం చంద్రబాబు

- ★ రోగి నమోదు నుంచి మందుల పంపిణీ వరకు డిజిటల్ ప్రక్రియను పరిశీలన
- ★ ఏఐ ఆధారిత వైద్యం, వర్చువల్ కన్సల్టేషన్ విధానాలను ప్రత్యక్షంగా వీక్షించిన సీఎం
- ★ సాంకేతికతతో వైద్యులకు డాక్యుమెంటేషన్ భారం తగ్గి రోగులపై శ్రద్ధ పెరిగిందని వెల్లడి
- ★ కుప్పం, బెంగళూరు నిపుణులతో వర్చువల్ కాన్ఫరెన్స్ నిర్వహణ



ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్తూరు జిల్లాలో పర్యటించారు. యాదమరి మండలంలోని ‘సంజీవని’ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పీహెచ్‌సీ) ఆయన సందర్శించి, అక్కడ అందుతున్న డిజిటల్ వైద్య సేవల పనితీరును స్వయంగా సమీక్షించారు. టెక్నాలజీని అనుసంధానించి సామాన్యులకు ఎలాంటి వైద్యం అందిస్తున్నారనే అంశాన్ని క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో భాగంగా, ఒక రోగి

అమరావతి: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అత్యాధునిక సాంకేతికతతో వైద్య సేవలు అందించే ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు పీహెచ్‌సీకి వచ్చినప్పటి నుంచి వైద్య పరీక్షలు చేయించుకుని, మందులు తీసుకుని వెళ్లేంత వరకు జరిగే మిగతా 2 లో



## ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా వ్యవహరించవద్దు ఉత్తమ్‌కుమార్ రెడ్డి

### 51 లక్షల టన్నుల ధాన్యం కొని రైతులకు చెల్లింపులు చేశాం

హైదరాబాద్: రాష్ట్రంలో 8,575 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఉన్నాయని తెలంగాణ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. 51 లక్షల టన్నుల ధాన్యం కొని రైతులకు చెల్లింపులు చేశామని చెప్పారు. ఈ ఒక్క ఏడాదిలోనే వరి రైతులకు రూ.45వేల కోట్లు చెల్లించామన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఉత్తమ్ మాట్లాడారు. “తరుగు పేరుతో రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా అధికారులు వ్యవహరించవద్దు. వర్షాలతో ధాన్యం తడిచినా కొనాల్సిందే. ఫీల్డ్‌లో 21 కోట్ల గన్నీ బ్యాగులు ఉన్నాయి.. వాటికి కొరత లేదు” అని ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు.

# క్యూర్ పరిధిలో పేదలకు లక్ష గృహాలు

## గోదావరి పుష్కరాలకు రూ.వేయి కోట్లు




- ➤ వేగంగా పాలమూరు-రంగారెడ్డి భూసేకరణ
- ➤ 2.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు..

### పాలమూరుకు రూ.587 కోట్లు

హైదరాబాద్: తెలంగాణలో పేదల ఇళ్ల నిర్మాణానికి పెద్దపీట వేయాలని రాష్ట్ర మంత్రి మండలి నిర్ణయించింది. పూరిగుడిసెలు లేని ఆదర్శ రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దాలని మిగతా 2 లో

## హర్మూజ్ జలసంధి తెరుస్తాం.. ఆంక్షలు ఎత్తివేయండి

: అమెరికాతో ఇరాన్ డీల్?

అమెరికా, ఇరాన్ మధ్య 60 రోజుల కాల్పుల విరమణ ఒప్పందానికి చర్చలు

హర్మూజ్ జలసంధిని తిరిగి తెరిచేందుకు ఇరాన్ సుముఖత

ఇరాన్ చమురు అమ్మకాలపై ఆంక్షల ఎత్తివేతకు అమెరికా అంగీకారం

అణు కార్యక్రమంపై ఇరు దేశాల మధ్య కొనసాగుతున్న భిన్నాభిప్రాయాలు

ఒప్పందంపై త్వరలోనే శుభవార్త ఉండొచ్చన్న అమెరికా విదేశాంగ మంత్రి

ఢిల్లీ: అంతర్జాతీయంగా తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసిన అమెరికా, ఇరాన్ మధ్య వివాదానికి తెరపడే సూచనలు కనిపిస్తున్నాయి. ఇరు దేశాలు 60 రోజుల కాల్పుల విరమణ ఒప్పందం కుదుర్చుకోవడానికి మిగతా 2 లో





## ప్రొఫెసర్ నాగేశ్వర్ పై కేసులు తక్షణమే ఎత్తివేయండి

ఏపీ ప్రభుత్వానికి హరీశ్ రావు విజ్ఞప్తి

జగన్ తో స్నేహంగా ఉండాలని పవన్ కు అమిత్ షా చెప్పారన్న ప్రొఫెసర్ నాగేశ్వర్

ఈ విషయాన్ని పవన్ జనసేన నేతలతో చెప్పారని వెల్లడి

ప్రొఫెసర్ నాగేశ్వర్ వైసీపీ తొత్తు అంటూ జనసైనికుల మండిపాటు

పలు పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు.. కేసులు నమోదు

హైదరాబాద్: జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, కూటమి ప్రభుత్వంపై ప్రముఖ రాజనీతి విశ్లేషకుడు ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ మిగతా 2 లో

## తమిళనాడులో ఈ నెల నుంచే 200 యూనిట్ల ఉచిత విద్యుత్..


### కోటి కుటుంబాలకు సున్నా బిల్లు!

తమిళనాడులో 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం అమలుకు రంగం సిద్ధం

వచ్చే బిల్లింగ్ సైకిల్ నుంచే ఈ పథకాన్ని వర్తింపజేయనున్న ప్రభుత్వం

కొత్త స్కీమ్‌తో సుమారు 1.2 కోట్ల కుటుంబాలకు సున్నా బిల్లు

500 యూనిట్ల లోపు వాడే వారందరికీ 200 యూనిట్లు ఉచితం



తమిళనాడు: తమిళనాడులో గృహ విద్యుత్ వినియోగదారులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రాష్ట్రంలో ఉచిత విద్యుత్ పథకాన్ని మిగతా 2 లో


## రష్యా భీకరదాడులు.. నలుగురి మృతి, 50 మందికి గాయాలు

### ఉక్రెయిన్‌పై రష్యా పెద్ద ఎత్తున దాడులు

ఇళ్లకు, పాఠశాలలకు నష్టం వాటిల్లినట్లు సమాచారం

ఒరెష్నిక్ హైపర్‌సోనిక్ క్షిపణి శబ్ద వేగం కన్నా 10 రెట్లు ఎక్కువ వేగంతో ప్రయాణిస్తుంది

కీవ్ బయట చెర్కాసీ, ఖార్కివ్, క్రోపీవ్నిట్స్కీ, ఒడెసా, పోల్టావా, సుమీ, జైటోమిర్ ప్రాంతాలపైనా దాడులు



కీవ్: ఉక్రెయిన్‌పై రష్యా పెద్ద ఎత్తున దాడులు చేసింది. కొన్ని వందల డ్రోన్లు, డజన్లకొద్దీ క్షిపణులను ప్రయోగించింది. కీవ్ నగరంతో పాటు దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో నలుగురు మృతిచెందగా, మరో 50 మందికిపైగా మిగతా 2 లో

# బలూచిస్థాన్‌లో రక్తపాతం.. పాక్ సైనికులు వెళుతున్న రైలుపై ఉగ్రదాడి.. 24 మంది మృతి

ఢిల్లీ: పాకిస్థాన్‌లో ఘోర ఉగ్రదాడి జరిగింది. బలూచిస్థాన్ ప్రావిన్స్‌లో సైనిక సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు ప్రయాణిస్తున్న రైలును లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో కనీసం 24 మంది మరణించగా, 50 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో సైనికులు కూడా ఉన్నట్లు ఓ సీనియర్ అధికారి వెల్లడించారు. బలూచిస్థాన్ రాజధాని క్వెట్టాలో ఆదివారం ఈ దాడి జరిగింది. క్వెట్టా నుంచి పెషావర్‌కు వెళుతున్న ఈ రైలులో సైనికులు, వారి కుటుంబసభ్యులు ఉన్నారు. మంగళవారం నుంచి ప్రారంభం కానున్న బక్రీద్ పండుగ కోసం వీరంతా తమ స్వస్థలాలకు పయనమయ్యారు. రైలు క్వెట్టాలోని చమన్ పట్టక్ వద్ద సిగ్నల్ దాటుతున్న సమయంలో పేలుడు పదార్థాలతో నింపిన కారుతో ఒక బోగీని ఉగ్రవాదులు ఢీకొట్టారు. దీంతో భారీ పేలుడు సంభవించిందని అధికారులు తెలిపారు. ఈ పేలుడు తీవ్రతకు రైలు బోగీ నుజ్జునుజ్జయి పక్కకు ఒరిగిపోయింది. పలు కోచ్‌లు పట్టాలు తప్పాయి. ఘటనా స్థలంలో సహాయక చర్యలు చేపట్టారు. రక్తంతో తడిసిన బాధితులను స్ట్రెచర్లపై తరలిస్తున్న దృశ్యాలు హృదయవిదారకంగా ఉన్నాయి. భద్రతా దళాలు ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని దర్యాప్తు ప్రారంభించాయి. విస్తీర్ణంలో పాకిస్థాన్‌లోనే అతిపెద్ద ప్రావిన్స్ అయినప్పటికీ, బలూచిస్థాన్ అభివృద్ధిలో చాలా వెనుకబడి ఉంది. ఈ ప్రావిన్స్‌లోని సహజ వనరులను కేంద్ర ప్రభుత్వం దోచుకుంటోందని, స్థానిక ప్రజలకు ప్రయోజనాలు కల్పించడం లేదని బలూచ్ వేర్పాటువాద గ్రూపులు చాలాకాలంగా ఆరోపిస్తున్నాయి.

# మూర్ఖులు ఎక్కడైనా ఉంటారు: మార్కో రూబియో

ఢిల్లీ: భారత పర్యటనలో ఉన్న అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో, భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌తో కలిసి న్యూఢిల్లీలో నిర్వహించిన సంయుక్త మీడియా సమావేశంలో పలు విషయాలను పంచుకున్నారు. అమెరికాలో భారతీయులపై జరుగుతున్న జాత్యహంకార దాడులపై రూబియో స్పందించారు. అమెరికా సమాజంలోని జాత్యహంకారమే ఈ దాడులకు కారణమనే వాదనను తోసిపుచ్చారు. "ప్రపంచంలోని ప్రతి దేశంలోనూ మూర్ఖులు ఉంటారు, కొన్ని సంఘటనల ఆధారంగా మొత్తం దేశాన్ని అంచనా వేయలేము" అని వ్యాఖ్యానించారు. అమెరికాలో భారతీయ సమాజం అత్యంత విజయవంతమైన, గౌరవప్రదమైన సమాజంగా ఉందని, వ్యాపారం, సాంకేతికత, వైద్య రంగాల్లో అద్భుతంగా రాణిస్తోందని కొనియాడారు. మరోవైపు, ఇరాన్‌తో శాంతి ఒప్పందానికి సంబంధించి రాబోయే కొన్ని గంటల్లో ప్రపంచానికి ఒక శుభవార్త అందే అవకాశం ఉందని రూబియో వెల్లడించారు. అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త దాడికి ప్రతిస్పందనగా ఇరాన్ చాలా వరకు దిగ్బంధించిన హోర్ముజ్ జలసంధిపై ఉన్న ఆందోళనలను ఈ కుదురుతున్న శాంతి ఒప్పందం పరిష్కరిస్తుందన్నారు. ఇరాన్ అణ్వాయుధం గురించి ఇకపై భయపడాల్సిన అవసరం లేని ప్రపంచంలోకి మనం అడుగుపెట్టబోతున్నామని చెప్పారు. డొనాల్డ్ ట్రంప్ కూడా ఇరాన్‌తో శాంతి చర్చలపై పాజిటివ్ పోస్ట్ చేసిన నేపథ్యంలో రూబియో వ్యాఖ్యలు ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.

# విజయ్ గెలుపు ఒక 'సినిమా సునామీ'.. ఆ ప్రభుత్వం ఎప్పుడైనా కూలిపోవచ్చు: స్టాలిన్

తమిళనాడు : తమిళనాడు రాజకీయాల్లో అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత సరికొత్త యుద్ధం మొదలైంది. డీఎంకే అధినేత, మాజీ సీఎం ఎం.కె.స్టాలిన్ ప్రస్తుత ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని టీవీకే ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. చెన్నైలో జరిగిన పార్టీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... ప్రస్తుతం అధికారంలో ఉన్న విజయ్ ప్రభుత్వం ఐదేళ్లపాటు పూర్తి కాలం కొనసాగలేదని, అది డీఎంకే దయాదాక్షిణ్యాలపైనే నడుస్తోందంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. తమిళనాడు ఎన్నికల ఫలితాలను ఒక రాజకీయ ప్రభంజనంగా తాను భావించడం లేదని, ఇదొక 'సినిమా సునామీ' మాత్రమేనని స్టాలిన్ అభివర్ణించారు. ఓటర్లు ఎలాంటి రాజకీయ విశ్వాసం లేదా సిద్ధాంతాలను చూసి టీవీకే పార్టీకి ఓటు వేయలేదని, కేవలం ఒక ప్రముఖ స్టార్ నటుడు పార్టీ పెట్టాడనే ఉత్సాహంతోనే విజయ్‌కు మద్దతు తెలిపారని అన్నారు. పిల్లలకు కొత్తగా ఆడుకునేందుకు ఒక ఆటవస్తువు దొరికితే ఎంత ఉత్సాహం చూపిస్తారో, ఇదీ అలాంటిదేనని... కొన్ని రోజుల్లోనే ఆ ఆటవస్తువుపై ప్రజలకు ఆసక్తి తగ్గిపోతుందని వ్యాఖ్యానించారు. ఒక బిడ్డ తన తల్లి కోసం వెతికినట్టు, తమిళనాడు ఓటర్లు త్వరలోనే మళ్లీ డీఎంకే కోసం వెతకడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మేజిక్ ఫిగర్ అంశాన్ని స్టాలిన్ ప్రధానంగా ప్రస్తావించారు. టీవీకే పార్టీ సొంతంగా మేజిక్ ఫిగర్ అయిన 118 సీట్ల మార్కును దాటడంలో పూర్తిగా విఫలమైందని గుర్తుచేశారు. కనీస మెజారిటీ కూడా సాధించలేకపోయిన ఆ ప్రభుత్వం, ఈ రోజు డీఎంకే కూటమిలోని పార్టీల మద్దతు వల్లే మనుగడ సాగిస్తోందని, ఏ క్షణమైనా ఈ ప్రభుత్వం కూలిపోవచ్చని హెచ్చరించారు. డీఎంకేను చీల్చేందుకు తెరవెనుక తీవ్ర ప్రయత్నాలు జరిగాయని, కానీ అవి విఫలమయ్యాయని చెప్పారు. కమ్యూనిస్ట్ పార్టీలు, వీసీకే, ఐయూఎంఎల్ వంటి పార్టీలు మొదట టీవీకే ప్రభుత్వానికి బయటి నుంచి మాత్రమే మద్దతు ఇస్తామని చెప్పి, ఆ తర్వాత క్యాబినెట్‌లో చేరడాన్ని ఆయన తప్పుపట్టారు. రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితి అత్యంత అస్థిరంగా ఉందని వ్యాఖ్యానించారు.

# విశాఖలో ఘనంగా బండారు దత్తాత్రేయ ఆత్మకథ పుస్తకం ఆవిష్కరణ

అమరావతి: మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ జీవిత ప్రస్థానాన్ని ఆవిష్కరించే 'ప్రజల కథే నా ఆత్మకథ' పుస్తకావిష్కరణ సభ విశాఖపట్నంలో అత్యంత వైభవంగా జరిగింది. విశాఖ మద్దిలపాలెంలోని కాకతీయ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన ఈ ఆత్మీయ అవలోకన కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరయ్యారు. దత్తాత్రేయ రాజకీయ జీవితం, ఆయన చేసిన ప్రజా సేవ, సామాన్య ప్రజలతో ఆయనకు ఉన్న బలమైన అనుబంధాన్ని ప్రతిబింబించేలా ఈ పుస్తకాన్ని రూపొందించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ వేడుకకు ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయనతో పాటు ఎమ్మెల్సీ సోము వీర్రాజు, మాజీ ఎంపీ జీవీఎల్ నర్సింహారావు సహా పలువురు ముఖ్య నాయకులు పాల్గొని 'ప్రజల కథే నా ఆత్మకథ' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కంభంపాటి హరిబాబు మాట్లాడుతూ... సామాన్య ప్రజల మధ్య నుంచి ఎదిగి, గవర్నర్ వంటి అత్యున్నత పదవిని అధిరోహించిన బండారు దత్తాత్రేయ జీవిత ప్రయాణం నేటి యువతకు ఎంతో ఆదర్శప్రాయమని కొనియాడారు. బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ... తన సుదీర్ఘ రాజకీయ ప్రయాణంలో ఎదురైన క్షేత్రస్థాయి అనుభవాలు, ప్రజలు అందించిన ఆశీర్వాదాలే తన జీవితానికి అసలైన బలమని భావోద్వేగానికి లోనయ్యారు. ప్రజలతో ఉన్న ఆ బంధం వల్లే ఈ పుస్తకానికి 'ప్రజల కథే నా ఆత్మకథ' అనే పేరును ఖరారు చేసినట్లు ఆయన ఈ సందర్భంగా వెల్లడించారు. ఒక నిబద్ధత కలిగిన నాయకుడి ఐదు దశాబ్దాల రాజకీయ ప్రస్థానం ఈ పుస్తకం ద్వారా రాబోయే తరాలకు అందుబాటులోకి రానుంది.

# జగన్ రక్తచరిత్ర అందరికీ తెలుసు.. వచ్చే ఎన్నికల్లో వైసీపీకి 'జీరో'నే

అమరావతి: వైసీపీ అధినేత జగన్ లక్ష్యంగా మంత్రి పి. నారాయణ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో రక్తచరిత్ర ఎవరిదో ఆంధ్రప్రదేశ్ ప్రజలందరికీ బాగా తెలుసని, జగన్ అండ్ కో ఎన్ని అసత్యాలు మాట్లాడినా జనం నమ్మే పరిస్థితిలో లేరని మండిపడ్డారు. వైఎస్ కుటుంబం, వైసీపీ రక్తచరిత్ర ప్రజలకు తెలుసు కాబట్టే... గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీని కేవలం 11 సీట్లకే పరిమితం చేశారని, వచ్చే ఎన్నికల్లో వారికి సున్నా (జీరో) సీట్లు రావడం ఖాయమని జోస్యం చెప్పారు. ఈరోజు నెల్లూరు జిల్లాలో నారాయణ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. గత వైసీపీ హయాంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు కేటాయించిన నిధులను ఎందుకు వినియోగించలేదో జగన్ సమాధానం చెప్పాలని నారాయణ డిమాండ్ చేశారు. చివరకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన స్వచ్ఛ భారత్ నిధులను కూడా జగన్ సర్కార్ దారి మళ్లించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా డీఎస్సీ పరీక్షలను నిర్వహించి, ఎలాంటి అవినీతి లేకుండా నిజాయతీగా ఉద్యోగాలను కేటాయించిందని స్పష్టం చేశారు. ఇంత మంచి జరుగుతుంటే ఉద్దేశపూర్వకంగానే ప్రభుత్వంపై జగన్ అండ్ కో అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే 'మహానాడు' వేడుకలకు ఏర్పాట్లు జరుగుతున్నాయని మంత్రి వెల్లడించారు. ఈసారి హైబ్రిడ్ విధానంలో (ప్రత్యక్షంగా, వర్చువల్ గా) మహానాడు ఉంటుందని... గతంలో మాదిరే రాజకీయ తీర్మానాలు, ఆమోదాలు ఉంటాయని తెలిపారు. ముఖ్యంగా పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు ఈ వేదికపై మాట్లాడే పూర్తి అవకాశం కల్పిస్తామన్నారు. తన పర్యటనలో భాగంగా నెల్లూరు పరమేశ్వరనగర్ వక్ఫ్ బోర్డు స్థలంలో నిర్మిస్తున్న మున్సిపల్ కార్పొరేట్ స్కూల్ ప్రాంతాన్ని నారాయణ సందర్శించారు. సామాన్య ముస్లిం విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించడమే ధ్యేయంగా, స్విమ్మింగ్ పూల్‌తో సహా అన్ని రకాల ఆధునిక వసతులతో ఈ పాఠశాలను నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు. దాతల సహకారంతో నగరంలోని పలు మున్సిపల్ స్కూళ్లను కార్పొరేట్ స్థాయికి మారుస్తున్నామని, అలాగే ఏపీలోని 123 మున్సిపాలిటీల్లో రూ. 1,400 కోట్లతో డ్రైనేజీ పనులు శరవేగంగా జరుగుతున్నాయని మంత్రి నారాయణ వివరించారు. మంత్రి పర్యటనలో వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, నెల్లూరు మేయర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

# ప్రొఫెసర్ నాగేశ్వర్ పై కేసులు తక్షణమే ఎత్తివేయండి

హైదరాబాద్: జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, కూటమి ప్రభుత్వంపై ప్రముఖ రాజనీతి విశ్లేషకుడు ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ చేసిన వ్యాఖ్యలు రెండు తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర రాజకీయ దుమారం రేపిన సంగతి తెలిసిందే. వైసీపీ అధినేత జగన్‌ను అరెస్ట్ చేయాలంటూ పవన్ కల్యాణ్ కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కోరినట్టు... జగన్ మనకు లాంగ్ టైమ్ ఫ్రెండ్, ఆయనతో స్నేహంగా ఉండాలని పవన్ కు అమిత్ షా చెప్పినట్టు ప్రొఫెసర్ నాగేశ్వర్ చేసిన కామెంట్స్‌ను జనసేన పార్టీ తీవ్రంగా తప్పుబట్టింది. ఆయన వైసీపీకి తొత్తుగా మారి అవాస్తవాలు మాట్లాడుతున్నారంటూ సోషల్ మీడియాలో జనసైనికులు పెద్ద ఎత్తున విమర్శలు గుప్పించడమే కాకుండా, ఏపీలోని పలు పోలీస్ స్టేషన్లలో ఆయనపై ఫిర్యాదులు చేయడంతో కేసులు కూడా నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో, తీవ్ర ఒత్తిడి ఎదుర్కొన్న ప్రొఫెసర్ నాగేశ్వర్, తాను చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు బేషరతుగా ప్రకటించారు. అయినప్పటికీ ఆయనపై నమోదైన కేసులను ఏపీ పోలీసులు ఇంకా కొనసాగిస్తుండడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై తాజాగా తెలంగాణ మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు స్పందించారు. ఎక్స్ వేదికగా ఆయన ఏపీ ప్రభుత్వ తీరును తప్పుబడుతూ ఒక పోస్ట్ చేశారు. ప్రొఫెసర్ నాగేశ్వర్ తన వ్యాఖ్యలను బేషరతుగా ఉపసంహరించుకున్నట్లు ప్రకటించిన తర్వాత కూడా, కక్షపూరిత ధోరణితో ఆయనపై కేసులు నమోదు చేసి వేధించడం ఎంతమాత్రం సరికాదని హరీశ్ రావు హితవు పలికారు. భావప్రకటనా స్వేచ్ఛను గౌరవించాలని, ప్రొఫెసర్‌పై పెట్టిన అన్ని కేసులను ఏపీ ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. హరీశ్ రావు చేసిన ఈ ట్వీట్‌పై ఏపీ ప్రభుత్వం, జనసేన శ్రేణులు ఎలా స్పందిస్తాయో వేచి చూడాలి.

# క్యూర్ పరిధిలో పేదలకు లక్ష గృహాలు

మొదటి పేజి తరువాయి

ఆదర్శ రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దాలని తీర్మానించింది. జూన్ 1 నుంచి ఇందిరమ్మ పథకం రెండో విడత కింద పేద కుటుంబాలకు 2.5 లక్షల ఇళ్ల మంజూరుకు ఆమోదం తెలిపింది. ప్రతి నియోజకవర్గానికి 2 వేల చొప్పున మంజూరుకు అనుమతించింది. తొలి విడతలో నిర్మాణం ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్లలో జూన్ 2వ తేదీ నాటికి దాదాపు లక్ష గృహ ప్రవేశాలు జరగాలని నిర్ణయించింది. సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రి మండలి సమావేశం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. హైదరాబాద్ మహానగరం క్యూర్ పరిధిలోని 24 నియోజకవర్గాల్లో అల్పాదాయ వర్గాల వారి కోసం లక్ష ఇళ్లు నిర్మించి ఇవ్వాలని తీర్మానించింది. వివరాలను రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి.. మంత్రులు వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌లతో కలిసి వెల్లడించారు. "కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం కొఠారి గ్రామంలో కొలాం ఆదివాసీలకు ప్రభుత్వం కట్టించిన 28 ఇందిరమ్మ ఇళ్లను జూన్ 1న ప్రారంభిస్తాం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులందరం అక్కడికి వెళ్లి ఈ కార్యక్రమంలో పాల్గొంటాం. వివిధ దఫాలుగా చేసిన సర్వేల ప్రకారం రాష్ట్రంలో 15 వేల కుటుంబాలు గుడిసెల్లో నివాసం ఉంటున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. వెంటనే ఆ కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందించాలని నిర్ణయించాం. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభించి గోడలు, శ్లాబు దశలో నిలిచిపోయిన వాటిని కూడా పూర్తి చేయాలని సూచించింది. పునాదులు పూర్తయి గోడలు, శ్లాబు పడని ఇళ్లకు రూ.3 లక్షలు; గోడలు పూర్తయి శ్లాబు నిలిచిపోయిన ఇళ్లకు రూ.2 లక్షలు చొప్పున అందిస్తాం. అసంపూర్తిగా ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పూర్తి చేసేందుకు నియోజకవర్గానికి 500 ఇళ్లకు త్వరలోనే నిధులు కేటాయిస్తాం. సొంత స్థలాలున్న వారికి రూ.ఐదేసి లక్షలు ఇస్తాం.

### లైఫ్ సైన్సెస్ విధానానికి ఆమోదం

తెలంగాణను 2030 నాటికి ఐదు ప్రపంచ శ్రేణి లైఫ్ సైన్సెస్ కేంద్రాల్లో ఒకటిగా అభివృద్ధి చేయాలన్నది రాష్ట్ర ప్రభుత్వ సంకల్పం. అందుకే నెక్ట్స్ జనరేషన్ లైఫ్ సైన్సెస్ పాలసీ 2026-30ని మంత్రిమండలి ఆమోదించింది. దావోస్‌లో సీఎం ఈ విధానాన్ని లాంఛనంగా ఆవిష్కరించారు. లైఫ్ సైన్సెస్, ఫార్మా, బయోటెక్, మెడికల్ ఇన్నోవేషన్ రంగాల్లో భారీ పెట్టుబడులకు గమ్యస్థానంగా మారుస్తాం. యువతకు పరిశోధన, తయారీ, డిజిటల్ హెల్త్, గ్లోబల్ ఇన్నోవేషన్ రంగాల్లో మంచి అవకాశాలు కల్పిస్తాం. ఇప్పటివరకు ఎక్కువగా తయారీ మీద దృష్టి ఉంటే, ఇక నుంచి విలువైన ఆవిష్కరణలపై దృష్టి సారిస్తాం. పరిశోధన, అభివృద్ధి యూనిట్లను కూడా పరిశ్రమలుగా గుర్తించే విధంగా ఈ విధానంలో మార్పు తెచ్చాం. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు, గ్లోబల్ ఇన్నోవేషన్ సెంటర్లు తెలంగాణకు రావడానికి ఈ విధానం ఉపయోగపడుతుంది.

### ఇతర ముఖ్య నిర్ణయాలు..

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పూర్తి చేసేందుకు అవసరమైన భూ సేకరణ, పునరావాసం, మౌలిక వసతుల సదుపాయాల కల్పనకు రూ.587 కోట్ల కేటాయింపు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం అమలు. వచ్చే ఏడాది జూన్ 26 నుంచి జులై 7వ తేదీ వరకు జరగనున్న గోదావరి పుష్కరాలకు సంబంధించి వివిధ పనులు చేపట్టేందుకు రూ.1,000 కోట్ల కేటాయింపు. ఇందులో తొలి విడతగా రూ.300 కోట్ల మంజూరు.

రాష్ట్రంలోని డీసీఎంఎస్‌లు మార్క్‌ఫెడ్‌లో విలీనం. రాష్ట్ర సహకార గ్రామీణ నీటిపారుదల సంస్థ హాకాలో విలీనం. కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గంలోని గంగాధరలోని నూతన డిగ్రీ కళాశాలలో 20 శాశ్వత బోధన, 6 బోధనేతర, 3 పోస్టులు పొరుగు సేవల కేటగిరీలో మంజూరు. కేసముద్రం అగ్నిమాపక కేంద్రానికి 18 పోస్టులు మంజూరు. అస్సాం రైఫిల్స్, బీఆర్ఎఫ్, సీఐఎస్ఎఫ్ గ్రూప్ సెంటర్ల ఏర్పాటుకు కరీంనగర్ జిల్లా వెల్దిలో 4, రుక్మాపూర్‌లో 5, గన్నేరువరం మండలంలో 5 ఎకరాల కేటాయింపు. పంట ఉత్పత్తుల కొనుగోలు...: మొక్కజొన్న, జొన్న, పొద్దుతిరుగుడు పంట ఉత్పత్తుల కొనుగోళ్లకు రాష్ట్ర మంత్రి మండలి శనివారం ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో ఇప్పటికే 14.89 లక్షల టన్నుల మొక్కజొన్న కొనుగోళ్లకు ప్రభుత్వం అనుమతించింది. ఇంకా నిల్వలున్నందున అదనంగా 6,53,817 టన్నుల కొనుగోళ్లకు రూ.1,677 కోట్ల రుణం అవసరమని, దానికి బ్యాంకు గ్యారంటీ ఇవ్వాలని మార్క్‌ఫెడ్ ప్రతిపాదించగా ఆమోదం లభించింది. 2,76,277 టన్నుల జొన్న కొనుగోళ్లకు రూ.1,154.76 కోట్ల రుణం కోసం, 10,175 టన్నుల పొద్దుతిరుగుడు కొనుగోళ్లకు రూ.86.37 కోట్ల రుణం కోసం ప్రభుత్వ బ్యాంకు గ్యారంటీలకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది" అని మంత్రి పొంగులేటి వివరించారు.

### ఆర్డీఎస్ఎస్‌లో చేరేందుకు...

విద్యుత్ పంపిణీ, మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రీవ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్ (ఆర్డీఎస్ఎస్)లో చేరేందుకు తెలంగాణ డిస్కంలు తయారు చేసిన ప్రతిపాదనలను ఆమోదించాం. ఇది కొత్తగా తీసుకున్న నిర్ణయం కాదు. గత ప్రభుత్వం 2017 జనవరి 2న అప్పట్లో కేంద్ర ప్రభుత్వంతో త్రైపాక్షిక ఒప్పందం చేసుకుంది. దీనిని అమలు చేయలేదు. దీనిపై రాష్ట్ర శాసనసభలో సుదీర్ఘంగా చర్చించాం. ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి దీనిపై వివరంగా మాట్లాడారు. విద్యుత్‌రంగానికి పరిశ్రమలు, గృహాలు, రైతులకు మేలు చేసే ఈ పథకంలో ఇప్పటికే అన్ని రాష్ట్రాలు చేరాయి. దీనిని అమలు చేయాలని నిర్ణయించాం.

# ఏఐ సాయంతో వైద్యం.. 'సంజీవని' సేవలను ప్రత్యక్షంగా వీక్షించిన చంద్రబాబు

మొదటి పేజి తరువాయి

పూర్తి ప్రక్రియను సీఎం చంద్రబాబు ప్రత్యక్షంగా వీక్షించారు. ముందుగా, పేషెంట్ కేర్ కోఆర్డినేటర్ (పీసీసీ) డెస్క్ వద్ద డిజిటల్ పద్ధతిలో రోగి వివరాల నమోదు ప్రక్రియను పరిశీలించారు. డిజిటల్ క్యూ మేనేజ్‌మెంట్ సిస్టమ్, విజిట్ రికార్డుల జనరేషన్, రోగుల సేవల మ్యాపింగ్ వంటి అంశాలను అక్కడి సిబ్బంది సీఎంకు వివరించారు. అనంతరం పీహెచ్‌సీ డ్యాష్‌బోర్డును పరిశీలించి, రోజువారీగా నమోదవుతున్న మొత్తం రిజిస్ట్రేషన్లు, కన్సల్టేషన్ల వివరాలు, గర్భిణులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను ట్రాక్ చేస్తున్న విధానంపై అధికారులతో చర్చించారు. ఆ తర్వాత స్టాఫ్ నర్స్ స్టేషన్‌కు వెళ్లి, రోగుల బీపీ, ఎత్తు, బరువు, శరీర ఉష్ణోగ్రత, హార్ట్ బీట్, పల్స్ రేట్ వంటి కీలక వివరాలను డిజిటల్ పద్ధతిలో నమోదు చేస్తున్న తీరును పరిశీలించారు. ఇక్కడి నుంచి అత్యంత కీలకమైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) అసిస్టెడ్ కన్సల్టేషన్ విధానాన్ని వీక్షించారు. మెడికల్ ఆఫీసర్ ఒక రోగి పాత ఆరోగ్య చరిత్రను సేకరించడం, నర్సులు నమోదు చేసిన వివరాలను తనిఖీ చేయడం, ఏఐ సపోర్ట్‌తో వ్యాధి నిర్ధారణకు సహకారం తీసుకోవడం వంటివి లైవ్‌లో ప్రదర్శించారు. ఈ టెక్నాలజీ వల్ల డాక్యుమెంటేషన్ భారం గణనీయంగా తగ్గి, రోగులపై ఎక్కువ సమయం కేటాయించేందుకు వీలవుతుందని వైద్యులు ముఖ్యమంత్రికి వివరించారు. ఆటోమేటెడ్ డాక్యుమెంటేషన్, డిజిటల్ ప్రిస్క్రిప్షన్ జనరేషన్ ప్రక్రియలను కూడా సీఎంకు చూపించారు. అనంతరం ఫార్మసీ విభాగాన్ని సందర్శించిన చంద్రబాబు, డిజిటల్ ప్రిస్క్రిప్షన్ ఆధారంగా రోగులకు వేగంగా మందులు పంపిణీ చేస్తున్న విధానాన్ని చూశారు. చివరిగా, పీహెచ్‌సీలోని వర్చువల్ రూమ్ నుంచి 'సంజీవని' ప్లాట్‌ఫామ్ ద్వారా కుప్పం ఏరియా ఆసుపత్రి, బెంగళూరులోని టాటాఎండీకి చెందిన నిపుణులైన వైద్యులతో వర్చువల్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య వైద్య అంతరాలను తగ్గించడంలో టెక్నాలజీ కీలక పాత్ర పోషిస్తోందని సీఎం అభిప్రాయపడ్డారు. ఆరోగ్య కేంద్రంలోని సిబ్బంది పనితీరును అభినందించారు.

# తమిళనాడులో ఈ నెల నుంచే 200 యూనిట్ల ఉచిత విద్యుత్..

మొదటి పేజి తరువాయి

రాష్ట్రంలో ఉచిత విద్యుత్ పథకాన్ని విస్తరిస్తూ తీసుకున్న నిర్ణయం వచ్చే బిల్లింగ్ సైకిల్ నుంచి అమల్లోకి రానుంది. ఈ కొత్త విధానంతో రాష్ట్రంలోని కోటికి పైగా కుటుంబాలకు విద్యుత్ బిల్లు సున్నాకు చేరనుంది. ముఖ్యమంత్రిగా సి.జోసెఫ్ విజయ్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత తీసుకున్న ఈ తొలి కీలక నిర్ణయం లక్షలాది కుటుంబాలకు ఊరటనిస్తుందని భావిస్తున్నారు. ఈ పథకం అమలు కోసం తమిళనాడు పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీఎన్‌పీడీసీఎల్) తమ బిల్లింగ్ సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేస్తోంది. ప్రభుత్వ నూతన విధానానికి అనుగుణంగా అర్హుల గుర్తింపు, సబ్సిడీ లెక్కింపు, బిల్లుల జారీ వంటి మార్పులను సాఫ్ట్‌వేర్‌లో పొందుపరిచినట్లు టీఎన్‌పీడీసీఎల్ అకౌంట్స్ విభాగం వెల్లడించింది. క్షేత్రస్థాయి సిబ్బందికి దీనిపై పూర్తి అవగాహన కల్పించి, అర్హులైన వినియోగదారులకు ఎలాంటి జాప్యం లేకుండా లబ్ధి చేకూరేలా చూడాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ తాజా నిర్ణయం ప్రకారం రెండు నెలలకు 500 యూనిట్ల లోపు విద్యుత్ వాడే గృహ వినియోగదారులకు 200 యూనిట్ల వరకు ఉచితంగా సరఫరా చేస్తారు. రాష్ట్రంలో మొత్తం 2.46 కోట్ల గృహ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇప్పటివరకు 100 యూనిట్ల లోపు వాడే 67 లక్షల కుటుంబాలు సున్నా బిల్లు పొందుతున్నాయి. తాజా విస్తరణతో ఈ సంఖ్య ఏకంగా 1.2 కోట్లకు పెరగనుంది. మరో 85.83 లక్షల మంది వినియోగదారుల బిల్లులు ప్రతి రెండు నెలలకు సుమారు రూ. 235 వరకు తగ్గే అవకాశం ఉంది. అయితే, 500 యూనిట్లకు మించి వాడే 34.24 లక్షల మందికి మాత్రం పాత పద్ధతిలోనే 100 యూనిట్ల ఉచిత విద్యుత్ ప్రయోజనం కొనసాగుతుంది. ఈ పథకం ద్వారా అయ్యే అదనపు ఆర్థిక భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని అధికారులు స్పష్టం చేశారు. మే 10న ప్రభుత్వం ఈ ప్రకటన చేసిన వెంటనే సాఫ్ట్‌వేర్ అప్‌గ్రేడ్ ప్రక్రియను ప్రారంభించారు. సామాన్య, మధ్యతరగతి కుటుంబాల ఖర్చు తగ్గించడమే లక్ష్యంగా ఈ సంక్షేమ పథకాన్ని అమలు చేస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది.

# హర్మూజ్ జలసంధి తెరుస్తాం.. ఆంక్షలు ఎత్తివేయండి

మొదటి పేజి తరువాయి

దగ్గరగా ఉన్నాయని, దీనికి సంబంధించిన చర్చలు తుది దశకు చేరుకున్నాయని తెలుస్తోంది. ఈ ఒప్పందంలో భాగంగా ఇరాన్ తన చమురును అమ్ముకోవడానికి అనుమతించడం, కీలకమైన హర్మూజ్ జలసంధిని తిరిగి తెరవడం, వివాదాస్పద అణు కార్యక్రమాన్ని నిలువరించడం వంటి అంశాలు ఉన్నట్లు సమాచారం. ఆక్సియోస్ కథనం ప్రకారం ఈ 60 రోజుల ఒప్పందంలో భాగంగా హర్మూజ్ జలసంధిని ఎలాంటి సుంకాలు లేకుండా తిరిగి తెరవడానికి ఇరాన్ అంగీకరించింది. నౌకల స్వేచ్ఛా రాకపోకల కోసం అక్కడ ఏర్పాటు చేసిన మైన్‌లను తొలగించనుంది. దీనికి బదులుగా, అమెరికా ఇరాన్ ఓడరేవులపై దిగ్బంధనాన్ని ఎత్తివేయనుంది. ఇరాన్ చమురు అమ్మకాలకు వీలుగా కొన్ని ఆంక్షలను సడలించడంతో పాటు స్తంభింపజేసిన ఇరాన్ నిధులను కూడా విడుదల చేయనుంది. అయితే, ఈ ఒప్పందంలో అత్యంత కీలకమైన ఇరాన్ అణు కార్యక్రమంపై మాత్రం ఇరు దేశాల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అణ్వాయుధాలను తయారు చేయబోమని, యురేనియం శుద్ధిని నిలిపివేస్తామని ఇరాన్ హామీ ఇవ్వాలని ఒప్పంద ముసాయిదాలో ఉన్నట్లు 'ఆక్సియోస్' పేర్కొంది. కానీ, ప్రాథమిక చర్చల్లో అణు కార్యక్రమం అంశం ఉండదని ఇరాన్ అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఇరుపక్షాలు ఒక ప్రాథమిక అవగాహనకు వచ్చిన తర్వాతే ఈ క్లిష్టమైన అంశంపై చర్చిస్తారని 'న్యూయార్క్ టైమ్స్' కూడా నివేదించింది. భారత్ పర్యటనలో ఉన్న అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో, ఈ ఒప్పందంపై కొన్ని గంటల్లో ప్రపంచం ఒక శుభవార్త వినే అవకాశం ఉందని ఆదివారం ఢిల్లీలో వ్యాఖ్యానించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా ఒప్పందం చాలావరకు కొలిక్కి వచ్చిందని, అయితే తుదిరూపు రావాల్సి ఉందని తెలిపారు. మరోవైపు ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఖాయీ మాట్లాడుతూ.. అమెరికాతో సానుకూల వాతావరణం ఏర్పడుతున్నప్పటికీ, కీలక అంశాలపై ఒప్పందం కుదురుతుందని చెప్పలేమన్నారు. ఈ చర్చలకు మధ్యవర్తిత్వం వహించిన పాకిస్థాన్, త్వరలోనే మరో విడత చర్చలు నిర్వహించాలని ఆశిస్తున్నట్లు ప్రధాని షెహబాజ్ షరీఫ్ తెలిపారు. శాంతి చర్చలు జరుగుతున్నప్పటికీ ఒకవేళ అమెరికా మళ్లీ యుద్ధాన్ని ప్రారంభిస్తే ఇదివరకటి కంటే తీవ్రమైన పరిణామాలు ఉంటాయని ఇరాన్ చీఫ్ నెగోషియేటర్ మహమ్మద్ బఖేర్ ఘలీబాఫ్ హెచ్చరించడం ఉద్రిక్తతల తీవ్రతకు అద్దం పడుతోంది.

# రష్యా భీకరదాడులు.. నలుగురి మృతి, 50 మందికి గాయాలు

మొదటి పేజి తరువాయి

నలుగురు మృతిచెందగా, మరో 50 మందికిపైగా గాయపడ్డారు. ఆదివారం తెల్లవారుజామున ఆ ప్రాంతమంతా పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. ఇళ్లకు, పాఠశాలలకు నష్టం వాటిల్లినట్లు సమాచారం. బిలా సెర్క్వా నగరంపై జరిగిన దాడిలో ఒరెష్నిక్ హైపర్‌సోనిక్ క్షిపణి వాడినట్టు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ చెప్పారు. ఆ నగరం కీవ్ ప్రాంతంలో ఉంది. ఒరెష్నిక్ హైపర్‌సోనిక్ క్షిపణి శబ్ద వేగం కన్నా 10 రెట్లు ఎక్కువ వేగంతో ప్రయాణిస్తుంది. ఉక్రెయిన్ శుక్రవారం స్టారోబిల్స్క్ పట్టణంలోని విద్యార్థుల వసతి గృహంపై దాడి చేసిందని ఆరోపించిన రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రతీకారం తీర్చుకుంటామని ప్రకటించారు. చెప్పినట్లే ఆదివారం దాడులు చేశారు. రష్యా దాడులు చేయడానికి ముందే జెలెన్ స్కీ మాట్లాడుతూ.. తమ దేశంపై దాడి చేసే సూచనలు కనిపిస్తున్నాయని అన్నారు. రష్యా ఒరెష్నిక్ క్షిపణి వాడే అవకాశం ఉందని ఉక్రెయిన్ నిఘా సంస్థలకు సమాచారం వచ్చినట్టు కూడా ఆయన చెప్పారు. ఆ క్షిపణిని అడ్డుకోవడం అసాధ్యమని చెబుతున్నారు. ఉక్రెయిన్ జాతీయ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కీవ్ ప్రాంతంలో 50కు పైగా చోట్ల దాడి జరిగింది. ఇళ్లు, షాపింగ్ కేంద్రాలు, అత్యవసర సేవల భవనాలు, పోలీస్ భవనాలు దెబ్బతిన్నట్టు సమాచారం. నీటి సరఫరా కేంద్రంపై కూడా దాడి జరిగినట్టు జెలెన్‌స్కీ చెప్పారు. "రాజధానిపై భారీ బాలిస్టిక్ దాడి జరిగింది. ఇంకా దాడులు జరిగే అవకాశం ఉంది" అని కీవ్ సైనిక పరిపాలన అధిపతి టిమూర్ ట్కాచెంకో టెలిగ్రామ్‌లో గత అర్ధరాత్రి తర్వాత పోస్ట్ చేశారు. కీవ్ మేయర్ విటలి తెలిపిన వివరాల ప్రకారం నగరంలో ఇద్దరు చనిపోయారు. ఇద్దరు చిన్నారులు సహా 30 మంది ఆసుపత్రిలో చేరారు. మధ్య షెవ్చెంకో జిల్లాలో 9 అంతస్తుల భవనంపై దాడి జరిగింది. పై అంతస్తుల్లో మంటలు చెలరేగాయి. ఒకరు చనిపోయారు. అదే జిల్లాలో పాఠశాల వద్ద ఉన్న ఎయిర్ రైడ్ షెల్టర్ సమీపంలో దాడి జరిగింది. శిథిలాలు పడటంతో ప్రవేశ ద్వారం మూసుకుపోయింది. పలువురు లోపల చిక్కుకున్నారు. ఎమర్జెన్సీ సిబ్బంది నగరంలోని పలు ప్రాంతాలకు చేరుకుని మంటలు ఆర్పారు. శిథిలాలను తొలగించారు. గాయపడిన వారికి చికిత్స అందించారు. రాజధాని చుట్టూ ఉన్న కీవ్ ప్రాంతంలో మరో ఇద్దరు చనిపోయినట్టు ప్రాంతీయ అధిపతి మైకోలా కలాష్నిక్ తెలిపారు. కీవ్ బయట చెర్కాసీ, ఖార్కివ్, క్రోపీవ్నిట్స్కీ, ఒడెసా, పోల్టావా, సుమీ, జైటోమిర్ ప్రాంతాలపైనా దాడులు జరిగాయని ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి ఆండ్రీ సిబియా తెలిపారు.

# కర్ణాటకపై సీఎం విజయ్ చూపు.. బెంగళూరు మున్సిపల్ ఎన్నికల్లో 'టీవీకే' పోటీకి సిద్ధం?

తమిళనాడు: తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభంజనం సృష్టించి అధికార పగ్గాలు చేపట్టిన నటుడు, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ ఇప్పుడు పొరుగు రాష్ట్రాలపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. తన పార్టీ టీవీకే విస్తరణలో భాగంగా ఆయన కర్ణాటక రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చేందుకు వ్యూహాలు రచిస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా, త్వరలో జరగబోయే బెంగళూరు మున్సిపల్ కార్పొరేషన్ (దీదీపీ) ఎన్నికల్లో పోటీ చేయడం ద్వారా కర్ణాటకలో పార్టీ జెండా పాతాలని విజయ్ గట్టి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఐటీ హబ్ బెంగళూరు నగరంలో స్థానిక కన్నడిగులతో పాటు లక్షలాది మంది తమిళ ప్రజలు దశాబ్దాలుగా నివసిస్తున్నారు. అంతేకాకుండా, నటుడిగా విజయ్‌కు కర్ణాటక వ్యాప్తంగా, ముఖ్యంగా బెంగళూరులో భారీ సంఖ్యలో అభిమాన సంఘాలు, బలమైన ఫాలోయింగ్ ఉంది. ఇటీవల తమిళనాడు ఎన్నికల్లో టీవీకే సాధించిన చారిత్రాత్మక విజయాన్ని బెంగళూరులోని విజయ్ అభిమానులు పెద్ద ఎత్తున వేడుకలు జరుపుకుని తమ మద్దతును చాటుకున్నారు. ఈ సానుకూలతలను ఓట్లుగా మార్చుకుని, అక్కడి స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాలని టీవీకే అధిష్ఠానం భావిస్తున్నట్లు ఇన్‌సైడ్ టాక్ నడుస్తోంది. కర్ణాటక రాజకీయాల్లోకి టీవీకే ఎంట్రీ ఇస్తుందనే వార్తలు బెంగళూరు రాజకీయ వర్గాల్లో ఇప్పుడే ప్రకంపనలు సృష్టిస్తున్నప్పటికీ... దీనిపై విజయ్ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. పార్టీని ఇతర దక్షిణాది రాష్ట్రాలకు విస్తరించే వ్యూహంలో భాగంగానే ఈ ముందడుగు ఉండబోతోందని, త్వరలోనే బెంగళూరు ఎన్నికల పోటీపై టీవీకే స్పష్టత ఇచ్చే అవకాశం ఉందని పరిశీలకులు అంచనా వేస్తున్నారు.

# తెలుగు రాష్ట్రాలలో భానుడి భగభగలు

హైదరాబాద్/అమరావతి: రాష్ట్రంలో మరో మూడు రోజులపాటు వడగాలుల తీవ్రత ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ప్రస్తుతం రాష్ట్రంలో సాధారణంకంటే అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా... దీనికితోడు వడగాలులతో ప్రజలు అక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఈనెల 26 వరకు కుమ్రంభీం ఆసిఫాబాద్ మంచి ర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, నల్లగొండ, సూర్యాపేట, మహబూబా బాద్, వరంగల్, హనుమకొండ, రంగారెడ్డి,హైదరాబాద్ జిల్లాల్లో తీవ్ర వడగాలుల ప్రభావం ఉంటుందని వాతావరణ శాఖ చెరిపింది. ఈ మేరకు ఈ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. రాత్రిపూట కూడా కనిష్ట ఉష్ణోగ్రతలు దాదాపు 30 డిగ్రీల మేర ఉంటాయని వివరించింది. రాష్ట్రంలో అత్యధికంగా ధర్మపురి మండలం బుద్ధిశపల్లిలో 48.3 డిగ్రీల సెల్సియస్ ఇష్ణోగ్రత నమోదైంది. రాష్ట్రం. లోని ప్రధాన నగరాల్లో ఉష్ణోగ్రతలు చురుకుగా నైరుతి రుతుపవనాలు నైరుతి రుతుపవనాలు చురుకుగా కదులు శీలిస్తే గరిష్ఠ ఉష్ణోగ్రత అమ్మంలో 44.8 డిగ్రీలుగా నమోదైంది. మరో రెండ్రోజుల్లో నైరుతి రుతుపవనాలు ఆగ్నేయ అరేబియా సముద్రంలోని దాదాపు అన్ని ప్రాంతాలు, కొమరిన్ ప్రాంతం, నైరుతి, ఆగ్నేయ బంగాళాఖాతం, అండమాన్ సముద్రంలోని మిగిలిన భాగాలు, తూర్పు-మధ్య బంగాళాఖాతంలోని మరిన్ని ప్రాంతాలలోకి విస్తరించమన్నాయి. ఈనెల 26న కేరళలోకి ప్రవేశించేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నట్లు వాతా వరణ శాఖ తెలిపింది. నైరుతి బిహార్, దాని పరిసరాల్లో ఏర్పడిన ఉపరితల చక్ర వాహత ఆవర్తనం శనివారం జార్ఖండ్ ఉత్తర రత్తీస్ గఢ్, ఒడిశాల మీదుగా ఉత్తర కోస్తా ఆంధ్ర తీరం వరకు కొనసాగుతోంది. ఇది సముద్ర మట్టం నుంచి సగటున 0.8 కిలోమీటర్ల ఎత్తులో కొనసాగుతోంది. అది, సోమవారాల్లో రాష్ట్రంలోని తూర్పు ఉత్తర జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ వివరించింది.

రాష్ట్రంలో ఎండ తీవ్రత కొనసాగుతోంది. రాష్ట్రంలోని 95 మండలాల్లో 42 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. కృష్ణా జిల్లా కానుమోలులో 45.8 డిగ్రీలు, అనకాపల్లి జిల్లా మాకవరపాలెంలో 45.5 డిగ్రీలు అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఏలూరు జిల్లా కుక్కునూరు, పోలవరం జిల్లా కూనవరం, పల్నాడు జిల్లా శ్రీనగర్‌లో 45 డిగ్రీలు, ఎన?టీఆర్ జిల్లా తొర్రగుడిపాడులో 44.6, తూర్పుగోదావరి జిల్లా చిట్యాలలో 44.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కాగా, నేడు (ఆదివారం) 21 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు వీచే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల శాఖ వెల్లడించింది. రాష్ట్రంలోని 214 మండలాల్లో వడగాడ్పుల ప్రభావం అధికంగా ఉండే అవకాశం ఉందని తెలిపింది. ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 45, 46 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. మన్యం, అల్లూరి, పోలవరం, కాకినాడ, అనకాపల్లి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పు గోదావరి, పశ?చమ గోదావరి, తిరుపతి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 42--44 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్ కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 40--42 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. మరోవైపు ఛత్తీస్‌గఢ్, ఒడిశా మీదుగా ఉత్తరాంధ్ర వరకు ద్రోణి కొనసాగుతోందని విపత్తుల శాఖ తెలిపింది. దీని ప్రభావంతో నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్ కడప,

## పంట కాలువలను పరిరక్షించుకోవలసిన బాధ్యత మనపై ఉంది ఎమ్మెల్యే బొలిశెట్టి"



తాడేపల్లిగూడెం మే 24 (అవినాష్ మారంపూడి నేటి శుభోదయ):::పంటకాలువల పరిరక్షణకు ప్రతిఒక్కరూ సహకరించాలని శాసన సభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గం పెంటపాడు మండలం పడమర విప్పర్రు గ్రామంలో బక్లిస్ డ్రైన్ పూడిక తీత పనులకు ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరికి వారు పంట కాలువలు, మురుగు బోదెలు తదితరాలను ఆక్రమిస్తే నీటి పారుదల వ్యవస్థ నాశనమవు తుందని అన్నారు.వందల ఎకరాలు మునిగి పోయి రైతులు తీవ్రంగా నష్ట పోతారని అన్నారు. తాత్కాలిక పరిహారం ఇవ్వటంకంటే సమస్య ను శాశ్వతంగా పరిష్కరించడానికి కృషి చేస్తున్నామని అన్నారు.ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతతో ఉండాలని,పంట కాలువల వ్యవస్థ ను పరిరక్షించుకోవాలని అన్నారు.ఈ కాలువలను ఆక్రమిస్తే ఎవరినీ ఉపేక్షించేది లేదన్నారు.అక్రమణలను పూర్తి స్థాయిలో తొలగించాలని అధికారులను ఆదేశించారు.తాడేపల్లిగూడెం నియోజకవర్గ చివరి ప్రాంతంలో ఉన్న పడమర విప్పర్రు గ్రామం పంట కాల్వల అక్రమణల కారణంగా తరచుగా ముంపునకు గురవుతుందని అన్నారు. ఈ సమస్య పరిష్కారంలో భాగంగా రూ.40 లక్షల అంచనా వ్యయంతో 7కిలోమీటర్ల పొడవున బక్లిస్ డ్రైన్ లో పూడిక తొలగింపు పనులను ఈరోజు ప్రారంభించామని అన్నారు.అత్యంత వేగంగా ఈపనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.వర్షాలు ప్రారంభమయ్యే లోపు పూడిక తీత పూర్తి కాకపోతే ప్రయోజనం ఉండదని అన్నారు.పూడిక తీత ద్వారా తవ్విన మట్టిని ఎవరికి అవసరమైనా తీసుకువెళ్ళవచ్చని ఆయన తెలియజేశారు.గ్రామంలో పూర్తిస్థాయిలో ముంపు నివారణకు పంది కోడు డ్రైన్ కూడా బాగుచేయవలసి ఉందని అన్నారు. ఈ అంశంపై పొరుగున ఉన్న ఉంగుటూరు శాసన సభ్యులు పత్సమట్ల ధర్మ రాజు, మంత్రి నిమ్మల రామానాయుడు, పశ్చిమ గోదావరి జిల్లా ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ మురళికృష్ణంరాజు లతో చర్చించామని తెలిపారు.త్వరలోనే నిధులు మంజూరవుతాయని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ కట్టుబోయిన వెంకటలక్ష్మి,పసల అచ్యుతం, మైలవరపు పెదబాబు, పాలూరు వెంకటేశ్వరరావు, పసల చంటి, పసల కొండ, మద్దాల మణికుమార్, గట్టెం నాని, పాతూరి రాంప్రసాద్ చౌదరి, పసుమర్తి రామ్ లక్ష్మణ్, వాడపల్లి సుబ్బరాజు, కట్టుబోయిన కృష్ణ ప్రసాద్, శంకు హరి, పసల శ్రీకృష్ణ, కందులపాటి బాలకృష్ణ,శాఖ అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## దిన్నెపాడు గ్రామం యువతతో మమేకం


**వైఎస్ఆర్ సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి**



లక్కిరెడ్డిపల్లి నేటి శుభోదయ దినపత్రిక మే 24,: లక్కిరెడ్డిపల్లె మండలం దిన్నెపాడు గ్రామంలోని పర్వతరెడ్డిగారిపల్లె లలో ఆదివారం ప్రజలు,యువత వైఎస్ఆర్ సిపి కార్యకర్తలు,నాయకులతో వైఎస్ఆర్ సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి మమేకమయ్యారు. సమిష్టి కృషితో పార్టీని బలోపేతం చేసుకుందామని శ్రీకాంత్ రెడ్డి తెలిపారు.పార్టీ కార్యకర్తలపై పోలీసులు అక్రమ కేసులు పెట్టి, వేధించారని దూదేకుల పల్లె, వడ్డెపల్లె లకు చెందిన వారు శ్రీకాంత్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు.అక్రమ కేసులకు భయపడవద్దని, న్యాయపోరాటం చేద్దామని , ధైర్యంగా ఉండాలని వారికి శ్రీకాంత్ రెడ్డి భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో దిన్నెపాడు ఇంచార్జ్ దిన్నెపాటి గజేందర్ రెడ్డి మాజీ ఉపసర్పంచ్ మహ్మద్ రఫీ, మాజీ ఎంపీటీసీ సుబ్బరాయుడు, నరసరాజు ,యువత, తదితరులు పాల్గొన్నారు.

## విఆర్ ఓల సంఘ రాష్ట్ర నాయకుడిని పరామర్శించిన

**రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డిలి**



గాలివీడు నేటి శుభోదయ దినపత్రిక మే,24: వి ఆర్ ఓల సంఘ రాష్ట్ర నాయకుడు మద్దిరాల హేమానాధ రెడ్డి ఇటీవల రెండు మోకాలి చిప్పల మార్పిడి శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రం గాలివీడులో ఆయనను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి పరామర్శించారు.ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ సిపి రాష్ట్ర లీగల్ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ జల్లా సుదర్శన్ రెడ్డి, వైఎస్ఆర్ సిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల నాగభూషణ రెడ్డి, నాయకులు గుమ్మా అమరనాధ రెడ్డి,మాజీ సర్పంచ్ చెన్నకేశవ రెడ్డి, చీపాటి చిన్నపు రెడ్డి, హనుమాన్ నాయక్, రామాంజులు రెడ్డి, వల్లపు నగేష్, రమణా రెడ్డి, నాగిరెడ్డి,బట్టీ రమణ,మద్దిరాల శివ శంకర రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## చిన్ననాటి స్మృతులను గుర్తు చేసుకుంటూ ఉల్లాసంగా

**ఉత్సాహంగా కోరుకొండలో 97 – 98 పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక..!!**



కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె); తూర్పుగోదావరి జిల్లా మండల కేంద్రమైన కోరుకొండ శ్రీ రాజబాబు ప్రభుత్వ హై స్కూల్ జూనియర్ కాలేజీ నందు 1997 – 1998 ఏడాది పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక ఆదివారం కోరుకొండలోని శ్రీ శ్రీదేవి ఫంక్షన్ హాల్ లో ఉత్సాహంగా ఉల్లాసంగా ఆహ్లాదభరితంగా జరిగింది... ప్రస్తుతం ఎక్కడెక్కడో ఉద్యోగాలు వ్యాపారాలలో తమ కుటుంబాలతో స్థిరపడిన ఆనాటి విద్యార్థులు ఈనాడు అందరూ ఒక్కటిగా కలిసి మెలిసి ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. ఆనాటి సంగతులను నెమరు వేసుకుంటూ నాటి నాటి చిరుతిళ్ళు సైతం ఒక స్టాల్ గా ఏర్పాటు చేసి నాటి మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో సాంస్కృతిక కార్యక్రమాలతో ఆత్మీయంగా గడిపి సహా పంక్తి భోజనాలు చేశారు. అంతేకాకుండా నాడు తమకు చదువు చెప్పిన గురువులను ఆహ్వానించి విద్యార్థులందరూ వారికి సాలువాలతో పూలమాలతో సత్కరించి నూతన వస్త్రాలను బహుకరించారు. ఆనాటి ఉపాధ్యాయులు వల్లభరావు, బ్రహ్మానందం, వీరభద్రరావు, పాలాక్షి రావు, సుబ్రహ్మణ్యం, సీతామహాలక్ష్మి, ధనలక్ష్మి, ఈశ్వరి ఘన సత్కారాలు చేశారు. నూతన వస్త్రాల బహుకరించి వారి ఆశీస్సులు పొందారు. అదేవిధంగా తమకు ట్యూషన్లు చెప్పిన టీచర్లను కూడా మర్చిపోకుండా వారిని ఆహ్వానించి సత్కరించడం గమనార్హం.. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆత్మీయ అనురాగాలతో తమ చిన్ననాటి సంగతులను జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనంద ఉత్సాహాలతో గడిపారు. అనంతరం వివిధ సాంస్కృతిక పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. డ్యాన్సులు, పాటలు, క్యాట్ వాక్కులతో.. పూర్వ విద్యార్థుల కార్యక్రమం ఆద్యంతం అలరించింది. ఈ కార్యక్రమంలో పసుపులేటి చిరంజీవి, గోకర కొండ సత్యనారాయణమూర్తి (సతీష్), పసుపులేటి సురేష్, బొరుసు బద్రి, తెలగంశెట్టి మధు, సూర్య కుమారి, దూబాసి అరుణ, వీణ, సాయి లక్ష్మి, బీబీ, సుమారు 100 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

# చతిస్గడ్ సరిహద్దు అడవుల్లో భద్రతా దళాల భారీ చర్య

**కాంకేర్– నారాయణ్‌పూర్ సరిహద్దులో నక్సలైట్ ఆయుధాలు, పేలుడు పదార్థాల నిల్వల స్వాధీనం**



చింతూరు, నేటి శుభోదయ ::: భారతదేశంలో ఈ ఏడాది మార్చి 31 కి మావోయిస్టు రహితంగా దేశాన్ని తీర్చిదిద్దుతామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. అనంతరం చతిస్గడ్ రాష్ట్రంలో అనేక లొంగుబాటు చర్యలు జరిగాయి. నిరంతర గాలింపు చర్యలతో మావోయిస్టు నెట్‌వర్క్‌లో ఆందోళన పెరిగింది. తాజాగా నారాయణ్‌పూర్. , నారాయణ్‌పూర్ జిల్లాల సరిహద్దుల్లోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో సంయుక్త భద్రతా దళాలు ఒక భారీ డంపును కనుగొన్నాయి . జిల్లా పోలీసులు, డీఆర్‌జీ, బీఎస్ఎఫ్, బీడీఎస్ బృందం సంయుక్తంగా నిర్వహించిన రెండు వేర్వేరు ఆపరేషన్లలో, నక్సల్స్ వద్ద ఉన్న భారీ పరిమాణంలో డంప్ మెటీరియల్, ఆయుధాలు, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. మావోయిస్టు నెట్‌వర్క్‌పై కొనసాగుతున్న పోరాటంలో భద్రతా దళాల ఈ చర్యను ఒక ప్రధాన విజయంగా పరిగణిస్తున్నారు.

### అందిన సమాచారం

ప్రకారం, కోయిలిబెడ, ఛోటేబెతియా పోలీస్ స్టేషన్ల పరిధిలోని దట్టమైన అడవులు, కొండ ప్రాంతాలలో భద్రతా దళాలు విస్తృత గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ ఆపరేషన్‌లో భాగంగా అడవిలో దాచి ఉంచిన మావోయిస్టు సామగ్రిని భద్రత దళాలు స్వాధీనం చేసుకున్నారు.స్వాధీనం చేసుకున్న వస్తువులలో దేశీయంగా తయారు చేసిన బీజీఎల్ లాంచర్, 12–బోర్ రైఫిల్, బీజీఎల్ సెల్స్, ఎలక్ట్రిక్, నాన్–ఎలక్ట్రిక్ డిటోనేటర్లు, గన్‌పౌడర్, కాటన్ బాంబులు, నక్సలైట్ యూనిఫాంలు, ఇతర పేలుడు పదార్థాలు ఉన్నాయి. భద్రతా దళాలు ఈ సామాగ్రి మొత్తాన్ని తమ అదుపులోకి తీసుకుని, నిబంధనల ప్రకారం తగిన చర్యలు ప్రారంభించాయి.ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ సంయుక్త ఆపరేషన్‌లో, భద్రతా దళాలు కఠిన పరిస్థితులు, దట్టమైన అడవుల గుండా అనేక కిలోమీటర్ల మేర కాలినడన గాలించాయి. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో నిరంతర ఒత్తిడిని కొనసాగించేందుకు ఈ గాలింపు చర్యలు కొనసాగుతాయని అధికారులు చెబుతున్నారు. అడవుల్లో నక్సలైట్లు ఆయుధాలు, మావోయిస్టు లు దాచి ఉంచిన పేలుడు పదార్థాలు, భారీ మొత్తంలో నగదు దాచిపెట్టిన ఇలాంటి అనేక రహస్య స్థావరాలు ఇప్పటికీ ఉన్నాయని భద్రతా సంస్థలు భావిస్తున్నాయి.ఇటీవల నారాయణ్‌పూర్, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో భద్రతను పర్యవేక్షించారు. సరిహద్దు ప్రాంతాలలో భద్రతా దళాలు కోట్ల రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నాయి. భద్రతా దళాల కంట పడకుండా ఉండేందుకు మావోయిస్టు సంస్థలు చాలాకాలంగా అడవులలోని రహస్య ప్రదేశాలలో డబ్బు, బంగారం, ఆయుధాలను దాచిపెడుతున్నాయని దర్యాప్తు సంస్థలు భావిస్తున్నాయి. భద్రతా దళాలు కొనసాగుతున్న గాలింపు చర్యలు నిఘా సమాచారం ద్వారా ఇప్పుడు అలాంటి అనేక రహస్య స్థావరాలు వెలుగులోకి వస్తున్నాయి.భద్రతా అధికారుల ప్రకారం, మావోయిస్టు నెట్‌వర్క్ బలహీనపడటంతో ఇప్పుడు వారి పాత నిల్వలు, రహస్య వనరులు బయటపడ్డాయి. భద్రతా కారణాల వల్ల గతంలో చేరుకోవడం కష్టంగా భావించిన ప్రాంతాలలో సైనికులు నిరంతరం ఆపరేషన్లు నిర్వహిస్తున్నారు. ఇప్పుడు, రోడ్లు, శిబిరాలు, మెరుగైన భద్రతతో సైనికులు లోపలి ప్రాంతాలకు చేరుకుని నక్సలైట్ నెట్‌వర్క్‌ను బలహీనపరుస్తున్నారు. మావోయిస్టుల ఆయుధాలు, ఆర్థిక వనరులపై చర్యలు కొనసాగించడం వారి సంస్థాగత నిర్మాణాన్ని బలహీనపరుస్తుందని నిపుణులు భావిస్తున్నారు. పేలుడు పదార్థాలు, ఆయుధాలను స్వాధీనం చేసుకోవడం ద్వారా సంభావ్య పెద్ద సంఘటనలను కూడా నివారించవచ్చు. అదే సమయంలో, సరిహద్దు ప్రాంతాల్లో పెరిగిన భద్రతా కార్యకలాపాలు భద్రతపై స్థానిక గ్రామస్తుల విశ్వాసాన్ని బలపరుస్తున్నాయి.

### మావోయిస్టు

ప్రభావిత ప్రాంతాల్లో సంయుక్త గాలింపు చర్యలు కొనసాగుతాయని కాంకేర్, నారాయణ్‌పూర్ పోలీసులు స్పష్టం చేశారు. అడవుల్లో దాగి ఉన్న నక్సలైట్ స్థావరాలను పూర్తిగా నిర్మూలించి, ఆ ప్రాంతంలో శాంతి, అభివృద్ధి వాతావరణాన్ని నెలకొల్పడమే భద్రతా దళాల లక్ష్యం. కొనసాగుతున్న ఆపరేషన్లను బట్టి, భద్రతా సంస్థలు మావోయిస్టు నెట్‌వర్క్‌లు, వనరులు, స్థావరాలపై వేగంగా పట్టు సాధిస్తున్నాయని తెలుస్తోంది.

## నేడు జేసీ ప్రభాకర్ రెడ్డి జన్మదినం సందర్భంగా క్రికెట్ పోటీల తుది సమరం



యాడికి మే 24 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక: తాడిపత్రి మాజీ శాసనసభ్యులు జేసీ ప్రభాకర్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న క్రీడా పోటీలు ముగింపు దశకు చేరుకున్నాయి. ఆదివారం హోరాహోరీగా సాగిన ఉప అంత్యపోటీలలో గెలుపొందిన జట్లు తుది సమరానికి చేరుకున్నాయి. పెద్దల విభాగంలో జరిగిన మొదటి ఉప అంత్యపోటీలో యాడికి హనుమాన్ స్ట్రైకర్స్, తుఫాన్ జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన హనుమాన్ స్ట్రైకర్స్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 91 పరుగులు చేయగా, తుఫాన్ జట్టు కేవలం 7.1 ఓవర్లలోనే 93 పరుగులు సాధించి ఘన విజయం సాధించింది. రెండవ ఉప అంత్యపోటీలో రాయలచెరువు, ఉప్పలపాడు జట్లు తలపడగా.. మొదట బ్యాటింగ్ చేసిన రాయలచెరువు జట్టు 10 ఓవర్లలో 111 పరుగుల భారీ స్కోరు చేసింది. అనంతరం లక్ష్యచేధనలో ఉప్పలపాడు జట్టు 97 పరుగులకే పరిమితమై ఓటమిపాలైంది.



దీంతో పెద్దల విభాగంలో యాడికి తుఫాన్ జట్టు, రాయలచెరువు జట్లు తుది పోరాటానికి అర్హత సాధించాయి.మరోవైపు చిన్నల విభాగంలో జరిగిన ఉప అంత్యపోటీలలో పవన్ జట్టుపై యాడికి విజన్ జట్టు విజయం సాధించి తుది సమరానికి చేరగా, మరొక పోరులో యాడికి, రాయలచెరువు జట్ల మధ్య జరిగిన పోటీలో రాయలచెరువు జట్టు విజయం సాధించి తుది పోరుకు అర్హత సాధించింది. కాగా, నేడు (మే 25) ఉదయం మూడవ బహుమతి కోసం పోటీ జరగనుంది. అనంతరం ఉదయం పూట చిన్నల విభాగం తుది పోటీ, మధ్యాహ్నం 2 గంటలకు పెద్దల విభాగం తుది పోటీ అత్యంత ఉత్కంఠభరితంగా నిర్వహించనున్నారు. ఈ పోటీలు పూర్తయిన వెంటనే విజేతలకు ఘనంగా బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ముగింపు వేడుకలకు క్రీడాభిమానులు, యువకులు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

## రాయలచెరువు రైల్వే స్టేషన్‌లో పలు రైళ్లను నిలపాలని వినతి



యాడికి మే 24 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక: మండలంలోని రాయలచెరువు గ్రామంలో ఆదివారం స్థానిక ప్రజలు, మేధావులు, వివిధ పార్టీల నాయకులతో కలిసి ఒక ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. రాయలచెరువు రైల్వే స్టేషన్‌లో ధర్మవరం – మచిలీపట్నం మరియు ఎగ్మోర్ రైళ్లకు నిలుపుదల సౌకర్యం కల్పించాలనే ముఖ్య ఉద్దేశంతో ఈ సమావేశం జరిగింది. గతంలో కరోనా మహమ్మారి రాకకంటే ముందు ఈ రైళ్లు రాయలచెరువు రైల్వే స్టేషన్‌లో ఆగేవని, అయితే కరోనా సమయంలో భద్రతా కారణాల దృష్ట్యా ఇక్కడ రైళ్ల నిలుపుదలను రద్దు చేశారని సమావేశంలో నాయకులు గుర్తుచేశారు. ప్రస్తుతం పరిస్థితులు సాధారణ స్థితికి వచ్చినప్పటికీ, ఇంకా ఇక్కడ రైళ్లను నిలపకపోవడం వల్ల చుట్టుపక్కల ప్రాంతాల ప్రయాణికులు, రైతులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాబట్టి ప్రయాణికుల సౌకర్యార్థం గతంలో ఉన్న నిలుపుదల సౌకర్యాన్ని వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఈ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని రాయలచెరువు రైల్వే స్టేషన్ అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అట్టహాసంగా కంటే వినయ తేజ చిన్న కుమార్తె అన్విక పుట్టినరోజు వేడుకలు..!!

**– ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా..**



కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె);రాజమండ్రి సమీపంలోని ఫార్మహౌస్ లో జిల్లా వ్యవసాయ సలహా మండలి మాజీ సభ్యులు కంటే వినయ్ తేజ చిన్న కుమార్తె అన్విక పుట్టినరోజు వేడుకలు ఆదివారం అట్టహాసంగా నిర్వహించారు. కేకులు కట్ చేసి ఘనంగా అన్విక జన్మదినోత్సవ వేడుకలు జరిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వైస్సార్సీపీ యువజన విభాగం అధ్యకులు,మాజీ శాసనసభ్యులు జక్కంపూడి రాజా ముఖ్యఅతిథిగా హాజరై వినయ్ తేజ కూతురు అన్వికకు శుభాశీస్సులు అందజేశారు. అదేవిధంగా పలువురు ముఖ్యులు, ప్రముఖులు తేజ శ్రేయోభిలాషులు ఈ వేడుకల్లో పాల్గొని చిరంజీవి అన్వికను ఆశీర్వదించారు. అదేవిధంగా అన్విక పుట్టినరోజు సందర్భంగా కంటే వినయ్ తేజ దంపతులు ఆధ్వర్యంలో పలువురు వృద్ధులు, నిరుపేదలకు ఫ్రూట్స్, బిస్కెట్స్, స్వీట్స్ పంపిణీ చేశారు.

## ఇంద్రకీలాద్రిపై పోటెత్తిన భక్తులు



విజయవాడ, మే 24 (నేటి శుభోదయ):– శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. తెల్లవారుజామున 5 గంటల నుంచే భక్తుల రాక విపరీతంగా పెరిగింది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు ఉదయం 9 గంటల నుండి అంతరాలయ దర్శనాలను తాత్కాలికంగా నిలిపివేశారు. అలాగే ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు అన్ని రకాల వీఐపీ దర్శనాలను రద్దు చేశారు. దీనివల్ల క్యూ లైన్లలోని సామాన్య భక్తులకు అమ్మవారి దర్శనం సులభంగా లభించింది.కొత్త ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఆలయ ఈఓ సీనా నాయక్ సరికొత్త నీటి సరఫరా విధానాన్ని ప్రవేశపెట్టారు. క్యూ లైన్లలో వేచి ఉన్న భక్తుల వద్దకే నేరుగా సరికొత్త మొబైల్ వాటర్ క్యాన్ల (సంచార నీటి డబ్బాల) ద్వారా చల్లని తాగునీటిని అందించారు. ఈ వినూత్న ప్రయోగం పట్ల భక్తులు హర్షం వ్యక్తం చేశారు. ఆలయ పరిసరాల్లో ఉచిత ప్రసాదం, అన్నదానం పంపిణీ చేశారు.మధ్యాహ్నం ఎండ వేడిమి తీవ్రమవ్వడంతో 2 గంటల తర్వాత భక్తుల రద్దీ క్రమంగా తగ్గింది. అంతవరకు ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ధర్మకర్తల మండలి సభ్యులతో కలిసి స్వయంగా క్యూ లైన్లలో పర్యటించి భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు. మరోవైపు అసిస్టెంట్ కమిషనర్ రంగా రావు, ఇన్‌చార్జ్ ఈఓ, సిబ్బందితో కలిసి క్యూ లైన్లను క్రమబద్ధీకరించారు.పాలకమండలి, అధికారుల సమన్వయంతో భారీ రద్దీలోనూ భక్తులకు ఎక్కడా ఎటువంటి ఇబ్బంది కలగకుండా అమ్మవారి దర్శనం ప్రశాంతంగా జరిగింది. ఆలయ యంత్రాంగం చేసిన ఏర్పాట్లపై భక్తులు సంతృప్తిని వ్యక్తం చేశారు.

## పేద మహిళ జీవితంలో వెలుగులు నింపిన మార్గదర్శి బొండా రవితేజ




విజయవాడ, మే 24 (నేటి శుభోదయ):– అజిత్ సింగ్‌నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయం వద్ద హృదయాలను హత్తుకునే సేవా కార్యక్రమం జరిగింది.ఆదివారం 29వ డివిజన్ మధురానగర్ కొబ్బరితోట ప్రాంతానికి చెందిన నిరుపేద మహిళ కనకాల కుమారి కి తెలుగుదేశం పార్టీ యువ నాయకులు, ప్రజాసేవలో ఎప్పుడూ ముందుండే మార్గదర్శి బొండా రవితేజ ా4 పథకం స్ఫూర్తితో తన సొంత నిధులతో 25 వేల విలువైన నూతన టిఫిన్ బండిని అందజేయడమే కాకుండా, వ్యాపారానికి అవసరమైన సరుకుల కొనుగోలుకు అదనంగా5 వేల నగదును కూడా అందించి అండగా నిలిచారు.కుటుంబ పోషణ కోసం ప్రతిరోజూ అద్దె టిఫిన్ బండిపై వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్న కనకాల కుమారి, శుక్రవారం నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బందిని కలిసి తన ఆవేదనను వ్యక్తం చేశారు. రోజువారీ అద్దె భారం కారణంగా సంపాదించిన డబ్బంతా ఖర్చైపోతుందని, కుటుంబాన్ని పోషించడం కష్టంగా మారిందని, ఒక సొంత టిఫిన్ బండి ఉంటే తన పిల్లల భవిష్యత్తుకు భరోసా కలుగుతుందని కన్నీటి పర్యంతమై వివరించారు.ఈ విషయాన్ని వెంటనే ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లగా, పేదల కష్టాలను తన కష్టాలుగా భావించే బొండా ఉమా వెంటనే స్పందించి, యువ నాయకులు బొండా రవితేజ మార్గదర్శకత్వంలో కేవలం 48 గంటలు కూడా గడవకముందే కొత్త టిఫిన్ బండిని అందజేయడం విశేషం, దీంతో ఇకపై అద్దె భారం లేకుండా స్వంత టిఫిన్ బండితో గౌరవప్రదంగా జీవనం కొనసాగించుకునే అవకాశం కనకాల కుమారికి లభించింది.ఈ సందర్భంగా రవితేజ మాట్లాడుతూ ప్రజల సమస్యలు విని ఊరుకోవడం కాదు, వాటికి వెంటనే పరిష్కారం చూపించడమే బొండా కుటుంబ రాజకీయాల లక్ష్యమని, ఎమ్మెల్యే బొండా ఉమా 15 సంవత్సరాలుగా రాజకీయాల్లో ప్రజాసేవనే ధ్యేయంగా తీసుకుని వేలాది నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తూ వస్తున్నామని, టిఫిన్ బండ్లు, తోపుడు బండ్లు, ఇస్త్రీ బండ్లు, కుట్టు మిషన్లు అందించడం ద్వారా ఎన్నో కుటుంబాలకు స్వయం ఉపాధి కల్పించడంతో పాటు, విద్యార్థులకు ఫీజులు చెల్లించడం, వైద్య సహాయం అందించడం, ప్రమాదాలు లేదా అత్యవసర పరిస్థితుల్లో ఆర్థిక చేయూతనివ్వడం, బాధలో ఉన్న కుటుంబాలకు ధైర్యం చెప్పి అండగా నిలవడం వంటి ఎన్నో సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తున్నామని.పేద ప్రజల ముఖాల్లో చిరునవ్వు చూడడమే తమకు నిజమైన సంతృప్తి అని, రాజకీయాలు పదవుల కోసం కాదు, ప్రజలకు సేవ చేయడానికి అనే సిద్ధాంతంతో ముందుకు సాగుతున్నామని,యువత కూడా సమాజ సేవలో భాగస్వాములు కావాలని, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చేయూతనివ్వాలని రవితేజ పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన ా4 పథకం సమాజంలో పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో భరోసా కల్పిస్తోందని, అదే స్ఫూర్తితో భవిష్యత్తులో కూడా మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని రవితేజ తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి, రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ సింగం వెంకన్న, 29వ డివిజన్ అధ్యక్షులు పెద్దిరెడ్డి వెంకటేశ్వరరావు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, మహిళలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఈదురు గాలులు, వర్షాల నేపథ్యంలో
# అప్రమత్తంగా పనిచేసిన వి.యం.సి



విజయవాడ, మే 24 (నేటి శుభోదయ):- విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదివారం సాయంత్రం నగరంలో కురిసిన వర్షాలు, ఈదురు గాలుల పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని అన్ని శాఖాధిపతులతో వైర్లెస్ సెట్ ద్వారా నిరంతరం సమన్వయం చేసుకుంటూ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.వర్షాల కారణంగా నగరంలోని పలు ప్రాంతాలలో రోడ్లపై నీరు నిల్వ ఉండే పరిస్థితులు ఏర్పడిన నేపథ్యంలో ఇంజినీరింగ్, పారిశుద్ధ్య విభాగాల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ నీరు నిల్వ లేకుండా తక్షణ చర్యలు చేపట్టారు. ప్రధాన రహదారులు, లోతట్టు ప్రాంతాలు, ట్రాఫిక్ ఎక్కువగా ఉండే కూడళ్ల వద్ద ప్రత్యేక దృష్టి సారించి మోటార్లు, డ్రైనేజీ వ్యవస్థలను వినియోగించి నీటిని తొలగించే చర్యలు కొనసాగించారు.మరోవైపు ఈదురు గాలుల ప్రభావంతో నగరంలోని కొన్ని ప్రాంతాల్లో హోర్డింగులు, ఫ్లెక్సీలు, చెట్ల కొమ్మలు కూలిన ఘటనలను అధికారులు వెంటనే గుర్తించి, ప్రజల రాకపోకలకు అంతరాయం కలగకుండా తొలగింపు చర్యలు చేపట్టారు. ప్రమాదకర పరిస్థితులు ఏర్పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కమిషనర్ అధికారులను అప్రమత్తం చేశారు.నగరంలో పడిపోయిన చెట్లు, విరిగిన కొమ్మలను తొలగించేందుకు వీఎంసీకి చెందిన జేసీబీలతో పాటు అదనంగా ప్రైవేటు జేసీబీలను కూడా వినియోగంలోకి తీసుకువచ్చి, ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం కలగకుండా వేగంగా తొలగింపు పనులు చేపట్టాలని కమిషనర్ ధ్యానచంద్ర సూచించారు.అత్యవసర పరిస్థితులపై అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులకు వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని కమిషనర్ ఆదేశించారు. నగర ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని ఆయన తెలిపారు.

# నైపుణ్యాలు పెంచుకుంటే ఉజ్వల భవిష్యత్తు
### 'పిల్లల వేసవి శిక్షణ శిబిరం'లో మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్యే గద్దె



విజయవాడ, మే 24 (నేటి శుభోదయ):- పిల్లలు తమలోని నైపుణ్యాలను చిన్నతనం నుంచే పెంపొందించుకోవడం ద్వారా ఉజ్వల భవిష్యత్తును సొంతం చేసుకోవచ్చునని రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్, తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు.ఆదివారం ఉదయం తూర్పు లోని 13వ డివిజన్ న్యూ ఆర్టీసీ కాలనీలో రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్‌తో కలిసి ఎమ్మెల్యే గద్దె రామమోహన్ పర్యటించారు. పార్కు ఆవరణలో లయన్స్ క్లబ్ ఆఫ్ పేరాల అంకినీడు (316-హెచ్) ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహిస్తున్న ఉచిత వేసవి క్యాంపు 2026 ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ పిల్లలకు విద్యా పరంగా, రిక్రియేషన్ పరంగా ఇలాంటి సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లను నిర్వహించడం అభినందనీయమన్నారు. పిల్లలలో నైపుణ్యాలు పెంపొందించడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయన్నారు. తాను ఇటీవలే సింగపూర్‌ను సందర్శించానని అక్కడ ఆర్థికంగా వెనకబడిన వారు, బలంగా ఉన్న వారు అన్ని సామాజిక వర్గాల వారు అందరూ కలిసి మెలిసి ఒకే ప్రాంతంలో నివాసం ఉంటారన్నారు. ఇక్కడ కూడా అదే విధంగా అందరం కలిసి మెలిసి జీవనం సాగించడం అభినందనీయమన్నారు. విద్య ద్వారానే జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోగలరని చెప్పారు. పిల్లలు, యువత భవిష్యత్తు కోసం తమ కూటమి ప్రభుత్వం నిత్యం పనిచేస్తోందని అన్నారు. పిల్లల్లో ఉన్న ఆసక్తిని గురించి ఆయా రంగాల్లో వారిని తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. ఎమ్మెల్యే గద్దె మాట్లాడుతూ వేసవి సెలవుల్లో ఈ విధంగా పిల్లలకు ఉచిత క్యాంప్‌లను నిర్వహించి పిల్లల్లో నైపుణ్యాలను పెంపొందించడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు మంత్రి అనగాని సత్యప్రసాద్ చేదోడు-వాదోడుగా ఉంటూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ముమ్మనేని ప్రసాద్, టీడీపీ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు చలసాని రమణ, పేరేపి ఈశ్వర్, నూతి శ్రీను, సొంఠి నాగేశ్వరరావు, గద్దె సత్యనారాయణ ప్రసాద్, తిమ్మాపురం సరోజ, దొంతినేని శ్రీనివాసన్, గూడురు తేజశ్విని, విజయలక్ష్మి, పెదశింగు అను, గద్దె జానకిరాణి, చరితశ్రీ, ప్రశాంతి, కీర్తి చంద్ర, ఉమ, కమల తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి సమస్యను పరిష్కరించే దిశగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక




విజయవాడ, మే 24 (నేటి శుభోదయ):- ప్రజల సమస్యలను తెలుసుకొని వాటిని వెంటనే పరిష్కరించే దిశగా ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను విజయవాడ నగరపాలక సంస్థ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంతో పాటు జోనల్ కార్యాలయంలో కూడా నిర్వహిస్తున్నట్లు విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు.విజయవాడ నగరపాలక సంస్థ కు సంబంధించిన సమస్యలన్నీ ప్రజలు తమ దగ్గరలోని కార్యాలయంలో సంప్రదించవచ్చని ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం 1:00 వరకు ఫిర్యాదులను స్వీకరిస్తారని అధికారులందరూ జోనల్ కార్యాలయలతో పాటు ప్రధాన కార్యాలయంలో కూడా అందుబాటులో ఉంటారని, కావున ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

# ప్రజల సహకారంతో విజయవంతంగా కొనసాగుతున్న "ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమం



విజయవాడ, మే 24 (నేటి శుభోదయ):- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 23 నుండి జూన్ 20, వరకు నిర్వహిస్తున్న "ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమాన్ని విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో విస్తృత స్థాయిలో నిర్వహిస్తున్నారని, ప్రజల భాగస్వామ్యంతో నగర పరిశుభ్రతను మరింత మెరుగుపరచడం, పారిశుద్ధ్య కార్మికులపై భారం తగ్గించడం మరియు శుభ్రమైన నగర నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యత వహించేలా అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యంగా కొనసాగుతోందని విజయవాడ నగరపాలక సంస్థ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. అర్జునరావు అన్నారు.విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ ఎం ఆదేశాల మేరకు నగరంలోని 64 డివిజన్లలో ఈ కార్యక్రమాన్ని సమన్వయపూర్వకంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా చీఫ్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. అర్జునరావు ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం భవానీపురం, విద్యార్థరపురం ప్రాంతాలలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. ఆయా ప్రాంతాలలో ప్రజలతో కలిసి శుభ్రత కార్యక్రమాల్లో పాల్గొని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన అవసరాన్ని వివరించారు.ఈ సందర్భంగా చీఫ్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. అర్జునరావు మాట్లాడుతూ, ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమానికి నగర ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, స్వచ్ఛంద సంస్థలు, యువత, మహిళా సంఘాలు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని నగరాన్ని పరిశుభ్రంగా మార్చేందుకు ముందుకు రావడం ఆనందదాయకం మని, ప్రతి రోజు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాల ద్వారా పారిశుద్ధ్యంపై ప్రజల్లో బాధ్యత పెరుగుతోందిని, ప్రజల సహకారంతో పారిశుద్ధ్య కార్మికులపై పని భారం తగ్గడమే కాకుండా, నగర పరిశుభ్రత మరింత మెరుగుపడుతోందని, పరిశుభ్రమైన విజయవాడ నిర్మాణంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని పేర్కొన్నారు.అదేవిధంగా ప్రజలు తమ ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం, చెత్తను నిర్దేశిత ప్రదేశాల్లో మాత్రమే వేయడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, పారిశుద్ధ్య సిబ్బందికి సహకరించడం ద్వారా నగరాన్ని ఆదర్శవంతమైన పరిశుభ్ర నగరంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్లు డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ గోపాల్ నాయక్, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, స్థానిక ప్రజలు, పారిశుద్ధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గద్దె చోరవతో త్వరలోనే 22 వేల మందికి ఇళ్ల పట్టాలు అందనున్నాయి
### సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీలో మంత్రి అనగాని సత్యప్రసాద్



విజయవాడ, మే 24 (నేటి శుభోదయ):- రాష్ట్రంలోని పేదల ఆరోగ్యానికి తమ కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ తెలిపారు.ఆదివారం ఉదయం తూర్పు లోని 8వ డివిజన్ పిట్టింగేల్ పేట మోడల్ డైయిరీ దగ్గర 63 మందికి వైద్య చికిత్సల సహాయ కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన 87 లక్షల రూపాయల విలువైన చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్యే గద్దె లు చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. 4వ డివిజన్ కు చెందిన భూపూడి ప్రభుకి చిరువ్యాపారం చేసుకునే నిమిత్తం10 వేల ఆర్థిక సహాయాన్ని తన వ్యక్తిగత నిధులు నుంచి గద్దె అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి అనిగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ఏ ఒక్కరు అనారోగ్యంతో ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయాలను అందజేస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే గద్దె నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ వారికి అవసరమైన ఆర్థిక సహాయాలతో అందజేయడంతో పాటు వారికి అండగా ఉంటున్నారని చెప్పారు. 20 సంవత్సరాల నుంచి ఎమ్మెల్యే గద్దె స్థానికంగా ఉన్న పేదల జవనోపాధికి అవసరమైన టిఫిన్ బండ్లు, తోపుడు బండ్లు, ఇస్త్రీ పెట్టెలు, బడ్డీకొట్లు అందజేసి వారికి జీవనోపాధి కల్పిస్తూ అండగా ఉంటున్నారని చెప్పారు. 20 సంవత్సరాలుగా ఎన్నో సేవ కార్యక్రమాలు చేస్తూ మా లాంటి వారికి గద్దె రామమోహన్ మార్గదర్శిగా ఉన్నారని చెప్పారు. గద్దె ఎమ్మెల్యే గా ఉండడం ఈ ప్రాంత వాసుల అదృష్టమని సత్యప్రసాద్ అన్నారు. తాము ప్రతిపక్షంలో ఉన్న సమయంలో కూడా గద్దె ఎన్నో కార్యక్రమాలు నిర్వహించి తమలాంటి నాయకులకు దిక్సూచిగా నిలిచారని చెప్పారు. గద్దె ఇప్పటికే సుమారు 8 కోట్ల రూపాయల విలువైన సీఎంఆర్ చెక్కులను లబ్ధిదారులకు అందజేయడం అభినందనీయమని అన్నారు. ఎలాంటి సమస్యను అయినా ఎమ్మెల్యే గద్దె స్వయంగా పరిశీలించి వాటిని పరిష్కరించడానికి చర్యలను తీసుకుంటున్నారని చెప్పారు. సమస్య తీవ్రతను బట్టి అవసరమైతే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించేలా ఎమ్మెల్యే చేస్తున్నారని అన్నారు. అందులో భాగంగానే నియోజకవర్గంలోని ఇళ్ల పట్టాల సమస్యను గద్దె ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకు వెళ్ళారని, ముఖ్యమంత్రి వెంటనే స్పందించి ఆ సమస్యను పరిష్కరించాల్సిందిగా మంత్రిగా ఉన్న తనను ఆదేశించారని చెప్పారు. విజయవాడ నగరంలోని 22 వేల మంది ఇళ్ల పట్టాలు అందుకోనున్నారంటే, అది గద్దె చొరవ వల్లనేనని మంత్రి అనగాని సత్యప్రసాద్ చెప్పారు. ఎమ్మెల్యే గద్దె మాట్లాడుతూ తమ ప్రభుత్వం పేదల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. అత్యవసర వైద్య చికిత్సల కోసం అప్పులు చేసి పేదలు ఆర్థికంగా ఇబ్బందులు పడకూడదని ఉద్దేశంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేదలకు ఆరోగ్యానికి అయిన వైద్య ఖర్చులను సీఎంఆర్ ఎఫ్ చెక్కుల ద్వారా అందజేస్తున్నారని చెప్పారు. పేదలకు మెరుగైన వైద్య సేవలను అందజేయడానికి తమ ప్రభుత్వం అన్ని రకాల చర్యలను తీసుకుంటుందన్నారు. అత్యవసరంగా వైద్య సేవలు చేయించుకునే పేదలపై ఆర్థిక భారం పడకూడదని ఈ విధంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సీఎంఆర్ఎఫ్ ద్వారా చెక్కులను అందజేస్తూ వారికి అండగా నిలుస్తున్నామని చెప్పారు. గత వైఎస్ఆర్సీపీ ప్రభుత్వం ఐదు సంవత్సరాల కాలంలో ఒక్కరికి కూడా ఈ సీఎంఆర్ఎఫ్ ద్వారా చెక్కులను అందజేయలేదన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ సీ.ఎం.ఆర్.ఎఫ్ ద్వారా చెక్కులను మంజూరు చేస్తున్నామని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాల వ్యవధిలోనే నియోజకవర్గంలోని పేదలకు 8 కోట్ల రూపాయలకు పైగా విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశామని అన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా సహాయం పొందాలనుకునేవారు తన కార్యాలయంలో నేరుగా సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని గద్దె చెప్పారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి రమేష్, మల్లెల రామకృష్ణ, మమ్మునేని ప్రసాద్, జాస్తి సాంబశివరావు, టీడీపీ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు చలసాని రమణ, పేరేపి ఈశ్వర్, సుగసాని రత్నశ్రీ, నారు రామారావు, తాడి బాబురావు, గుత్తికొండ కృష్ణమోహన్, జాస్తి సురేష్, అబ్దుల్ కరీం, బచ్చులకూరి అజయ్ కుమార్, మేదరమెట్ల నారాయణ, పడాల గంగాధర్ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సెన్సస్--2027లో 99% గృహ గణన పూర్తి. త్వరలోనే జనగణనను కూడా 100% పూర్తి చేస్తాం
### : వీఎంసి కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ యం



విజయవాడ, మే 24 (నేటి శుభోదయ):- సెన్సస్--2027 కార్యక్రమంలో భాగంగా విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో నిర్వహిస్తున్న గృహ గణన కార్యక్రమం 99 శాతం విజయవంతంగా పూర్తి చేసినట్లు విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్.ఎం. ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, నగరంలోని ప్రతి గృహాన్ని గుర్తించి వివరాలను నమోదు చేసే ప్రక్రియను అధికారులు, ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లు సమన్వయంతో నిర్వహిస్తున్నారని తెలిపారు. ఇప్పటివరకు గృహ గణనను 99 శాతం పూర్తి చేయగలిగామని, అయితే జనగణన ప్రక్రియ ప్రస్తుతం 67 శాతం వరకు మాత్రమే పూర్తైందని పేర్కొన్నారు.వేసవి సెలవుల నేపథ్యంలో అనేక కుటుంబాలు ఇతర ప్రాంతాలకు వెళ్లడం, కొన్ని ఇళ్లు తాళాలు వేసి ఉండడం వంటి కారణాల వల్ల జనగణన ప్రక్రియలో కొంత ఆలస్యం జరిగిందని ఆయన వివరించారు. అయినప్పటికీ, ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లు ప్రతిరోజూ డోర్‌లాక్ ఇళ్లను ప్రత్యేకంగా గుర్తించి పర్యవేక్షిస్తూ, ఆయా కుటుంబాలు తిరిగి వచ్చిన వెంటనే వారి వివరాలను నమోదు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.సెన్సస్ కార్యక్రమం అత్యంత ప్రాధాన్యమైన జాతీయ కార్యక్రమమని, ప్రజలు తమ వివరాలను సక్రమంగా అందించి సహకరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు. ఖచ్చితమైన గణాంకాలు ప్రభుత్వ సంక్షేమ పథకాల రూపకల్పనకు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి, భవిష్యత్ ప్రణాళికలకు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.ప్రస్తుతం గృహ గణన విజయవంతంగా పూర్తికావడానికి నగర ప్రజలు అందించిన సహకారం అభినందనీయమని, అదే విధంగా జనగణన కార్యక్రమంలో కూడా ప్రతి ఒక్కరూ చురుకుగా పాల్గొని సహకరించాలని కోరారు. త్వరలోనే జనగణనను కూడా 100 శాతం పూర్తి చేస్తామని కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు.

## ఒకే కుటుంబానికి చెందిన నలుగురు గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించడం సెంట్రల్ నియోజకవర్గానికి గర్వకారణం
### --ఎమ్మెల్యే బొండా ఉమా




విజయవాడ, మే 24 (నేటి శుభోదయ):-బిఆర్ టిఎస్ రోడ్డు లోని సెంట్రల్ ఎమ్మెల్యే కార్యాలయంలో ఆదివారం 30వ డివిజన్ మధ్యకట్ట ప్రాంతానికి చెందిన తాతపూడి కుటుంబ సభ్యులను ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అభినందించి సన్మానించారు. ఫిబ్రవరి 2వ తేదీన హైదరాబాదులో ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ కీబోర్డ్ సంగీత కార్యక్రమంలో ప్రపంచంలోని 22 దేశాలకు చెందిన సుమారు 2,000 మంది కీబోర్డ్ వాయిద్యకారులు పాల్గొని గంటసేపు నిరంతరాయంగా కీబోర్డ్ వాయించి విశేష ప్రతిభ కనబరిచారు. ఈ కార్యక్రమంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 777 మంది విద్యార్థులు ప్రతిష్టాత్మకమైన స్థానం సంపాదించగా, విజయవాడ హల్లెల్ మ్యూజిక్ స్కూల్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన ప్రత్యేక అభినందన సభలో ప్రశంసాపత్రాలు అందజేయడం జరిగింది.ఈ గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో ఒకే కుటుంబానికి చెందిన తాతపూడి ఆరాధన, తాతపూడి అభిషేక్, తాతపూడి జీవన్ జాయ్, తాతపూడి వరలక్ష్మీ స్థానం సంపాదించడం అత్యంత అరుదైన విషయం అని బొండా ఉమా కొనియాడారు. ఒకే ఇంటి నుంచి నలుగురు అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరచడం ప్రతి తల్లిదండ్రికి, ప్రతి విద్యార్థికి ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు.సంగీతం వంటి కళారూపాలు క్రమశిక్షణ, ఏకాగ్రత, మానసిక వికాసాన్ని పెంపొందిస్తాయని, చిన్నప్పటి నుంచే పిల్లలను కళల వైపు ప్రోత్సహించడం ఎంతో అవసరమని తెలిపారు. విజయవాడ నగరానికి, ముఖ్యంగా సెంట్రల్ నియోజకవర్గానికి తాతపూడి కుటుంబం మంచి గుర్తింపు తీసుకువచ్చిందని అభినందించారు.అనంతరం తాతపూడి కుటుంబ సభ్యులను శాలువాలతో సత్కరించి, మెడల్స్, గిన్నిస్ వరల్డ్ రికార్డ్ ప్రశంసాపత్రాలను అందజేశారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి దేశానికి, రాష్ట్రానికి, నియోజకవర్గానికి మరిన్ని అంతర్జాతీయ గుర్తింపులు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఘంటా కృష్ణమోహన్, గొట్టుముక్కల వెంకటేశ్వరరాజు, 30 డివిజన్ అధ్యక్షులు లక్కం రాజ్ శ్రీనివాసరాజు, డివిజన్ ఇంచార్జ్ కరణం వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి చొక్కాకుల వీరభద్ర హనుమాన్, లక్కిశెట్టి సాయి, గాతలవలస మురళి, అక్కం లక్ష్మణ, రమణ తదితరులు పాల్గొన్నారు.

# వడదెబ్బ తో యామన పుల్లమ్మ మృతి



ఖమ్మం, నేటి శుభోదయ ::: ఖమ్మం జిల్లా, ఖమ్మం రూరల్ మండలం ఎం వెంకటాయపాలెం గ్రామానికి చెందిన యామన పుల్లమ్మ ( 70) ఆదివారం వడదెబ్బ తో మృతి చెందారు. మృతిరాలికి కుమారులు, కుమార్తె లు ఉన్నారు. ఆమె మృతి పట్ల పలువురు ప్రముఖులు, రాజకీయ నాయకులు, బంధువులు, స్నేహితులు తదితరులు సంతాపం, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆమె అంత్యక్రియలు సోమవారం ఎం వెంకటాయపాలెం గ్రామంలో జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

# కార్పొరేట్ కళాశాలల్లో ప్రవేశానికి దరఖాస్తులు



ఖమ్మం, నేటి శుభోదయ ::: ఎస్సెస్సీలో 400 మార్కులకు పైగా సాధించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన విద్యార్థులు కార్పొరేట్ కాలేజీల్లో ప్రవేశానికి జూన్ 5 వ తేదీ లోగా ఒఒఒ.[illegible] 35 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఎస్సీ అభివృద్ధి శాఖ డీడీ జ్యోతి సూచించారు. ప్రభుత్వ, ఎయిడెడ్, అనుబంధ విద్యా లయాల్లో చదివిన వారే అర్హులని తెలిపారు.

# చిరస్మరణీయుడు నల్లమల గిరి ప్రసాద్
### - సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవి బాబు



మధిర, నేటి శుభోదయ :: కార్మిక,కర్షక,పేద ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడిన నల్లమల గిరిప్రసాద్ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా మిగిలిపోయాడని, భూపోరాటాలకు నాయకత్వం వహించి లక్షలాది ఎకరాలను పేదలకు పంచిన ఘనత గిరిప్రసాద్ కు దక్కుతుందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవి బాబు అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు సిపిఐ మాజీ జాతీయ ఉప ప్రధాన కార్యదర్శి, మాజీ రాజ్యసభ సభ్యులు నల్లమల గిరిప్రసాద్ వర్ధంతిని ఆదివారం తొండలగోపవరంలో పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. తొలుత గిరిప్రసాద్ స్మారక స్థూపాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు.అనంతరం జరిగిన సభలో రవిబాబు మాట్లాడుతూ, అప్పటి ఉమ్మడి ఖమ్మం జిల్లా కమ్యూనిస్టు ఉద్యమ ధృవతారగా వెలుగొందిన గిరిప్రసాద్ జీవితం, ఆయన జిల్లాకు చేసిన త్యాగం నేటి తరం కార్యకర్తలకు,నాయకులకు స్పూర్తిదాయకమని అన్నారు.కమ్యూనిస్టు ఉద్యమాలను నడిపించడంలో కీలకపాత్ర పోషించిన గిరిప్రసాద్ లేని లోటును పరిపూర్తి చేయాల్సిన భాద్యత అందరిపై ఉందన్నారు. నిజాం నిరంకుశపాలనకు వ్యతిరేఖంగా ఆంధ్ర మహాసభ సాగించిన ఉద్యమం గురించి అద్యయనం చేశారన్నారు. ఉన్నత విద్యను, ఆస్తులను సైతం వదిలివేసి ఉద్యమబాట పట్టిన నల్లమల సాయుధ పోరాటాన్ని బలోపేతం చేశాడన్నారు. ఆయా ప్రాంతాల్లో దళాలు జరిపిన దాడుల్లో గిరి ప్రసాద్ నాయకత్వం వహించిన గొప్ప ఆదర్శ నాయకుడు అని, సీపీఐ పార్టీ రాష్ట్ర ,జాతీయ ఉప కార్యదర్శి గా, యంయల్ఏ, యంపీగా ప్రజలకు సేవలను అందించారు అని ఆయన కొనియాడినారు. అప్పటి ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి రాజ్యసభ సభ్యుడిగా పనిచేసిన గిరిప్రసాద్ జిల్లా అభివృద్ధికి, పేదల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేశాడన్నారు. ఆయన చూపిన పోరాట మార్గంలో పయనిస్తూ నమ్మిన సిద్ధాంతాలను నెరవేర్చినప్పుడే నిజమైన నివాళి అర్పించిన వాళ్లమవుతామని అన్నారు.ఈ కార్యక్రంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఎమ్ ఏ రహీం,బోనకల్ సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, జిల్లా సమితి సభ్యులు పెరుమాళ్ళపల్లి ప్రకాశరావు,ఏఐటీయూసీ డివిజన్ కార్యదర్శి చెరుకూరి వెంకటేశ్వరరావు, కొండూరి నాగేశ్వరావు, తొండలగోపారం గ్రామపెద్దలు వాసిరెడ్డి సత్యం,తదితరులు పాల్గొన్నారు.

# ఫాల్టా రీపోలింగ్ భారీ మెజారిటీతో బీజేపీ విజయం




పశ్చిమబెంగాల్, నేటి శుభోదయ ::: పశ్చిమ బెంగాల్‌లోని దక్షిణ 24 పరగణాల జిల్లా పరిధిలోకి వచ్చే ఫాల్టా అసెంబ్లీ నియోజకవర్గ రీ-పోలింగ్ ఫలితాల్లో భారతీయ జనతా పార్టీ అసాధారణ రీతిలో భారీ విజయాన్ని నమోదు చేసింది.ఆదివారం వెల్లడైన ఈ ఫలితాల్లో బీజేపీ అభ్యర్థి దేబాంగ్షు పాండా తన సమీప ప్రత్యర్థిపై ఏకంగా 1,09,021 ఓట్ల రికార్డు మెజారిటీతో ఘనవిజయం సాధించారు. మొత్తం 22 రౌండ్ల ఓట్ల లెక్కింపు ముగిసేసరికి బీజేపీ అభ్యర్థికి 1,49,666 ఓట్లు రాగా, రెండో స్థానంలో నిలిచిన సీపీఐ(ఎం) అభ్యర్థి శంభునాథ్ కుర్మీకి 40,645 ఓట్లు లభించాయి. కాంగ్రెస్ అభ్యర్థి అబ్దుర్ రజాక్ మొల్లా 10,084 ఓట్లతో మూడో స్థానంలో నిలవగా, అధికార తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) అభ్యర్థి జహంగీర్ ఖాన్ కేవలం 7,783 ఓట్లతో నాలుగో స్థానానికి పడిపోయి డిపాజిట్ కోల్పోవడం గమనార్హం. 1998లో టీఎంసీ పార్టీ స్థాపించిన తర్వాత ఆ పార్టీ అభ్యర్థి ఒకరు నాల్గో స్థానానికి పడిపోవడం, అలాగే 2011 తర్వాత తొలిసారి డిపాజిట్ కోల్పోవడం ఇదే మొదటిసారి కావడంతో ఈ ఫలితం బెంగాల్ రాజకీయాల్లో సంచలనంగా మారింది.

## పాలేరు అద్భుతాల మేరీ మాత పుణ్యక్షేత్ర మహోత్సవాలు ప్రారంభం




ఖమ్మం, కూసుమంచి, నేటి శుభోదయ ::: కూసుమంచి మండల పరిధిలోని పాలేరు అద్భుతాల మేరీ మాత పుణ్యక్షేత్ర ద్వితీయ మహోత్సవాలు ఆదివారం వేడుకగా ప్రారంభమయ్యాయి. పాలేరు విచారణ గురువు ఫాదర్ కొమ్ము ఆంతోనీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ మహోత్సవాలలో తొలిరోజు ఖమ్మం మేత్రాసనం కోశాధికారి ఫాదర్ సురేపల్లి ఐజక్ ప్రత్యేక ప్రార్థనలతో పతాకావిష్కరణ చేసి మహోత్సవాలను ప్రారంభించారు. తొలుత పుణ్యక్షేత్రంలో మేత్రాసనం కోశాధికారి ఫాదర్ సురేపల్లి ఐజక్ జ్యోతి ప్రజ్వలన చేశారు.ఈ కార్యక్రమంలో పుణ్యక్షేత్ర డైరెక్టర్ రెవ. ఫాదర్ కొమ్ము అంతోని, రెవ. ఫాదర్ విజయ్, రెవ.ఫాదర్ నవీన్, సిస్టర్లు, బ్రదర్లు, భక్తులు, సంఘ పెద్దలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా రెవ. ఫాదర్ సూరెపల్లి ఐజక్ మాట్లాడుతూ, పాలేరు ప్రాంతంలో ఫాదర్ కొమ్ము అంతోని ఆధ్వర్యంలో నిర్మితమైన ఆసియా ఖండంలోనే అతిపెద్ద 76 అడుగుల అద్భుతాల మేరీ మాత స్వరూపం భక్తులకు ఆధ్యాత్మికంగా ఎంతో ప్రేరణనిస్తోందని తెలిపారు. దేవుని మహాకృపతో ఈ పుణ్యక్షేత్రం ద్వారా అనేక అద్భుతాలు, స్వస్థతలు జరుగుతున్నాయని, భక్తులు తమ అనుభవాలను సాక్ష్యాల రూపంలో తెలియజేస్తున్నారని పేర్కొన్నారు.ఈ నెల 30వ తేదీ వరకు జరిగే ప్రార్థన కార్యక్రమాల్లో భక్తులు భక్తి, విశ్వాసాలతో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.పాలేరు విచారణ గురువు ఫాదర్ కొమ్ము ఆంతోనీ మాట్లాడుతూ పాలేరు పుణ్యక్షేత్ర మహోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయని , ఈ వేడుకలు ఈనెల 30వ తేదీ వరకు జరుగుతాయి అన్నారు. చివరి రోజు 30వ తేదీన జరిగే ముగింపు ఉత్సవానికి ఉమ్మడి ఖమ్మం జిల్లా ఆర్ సీఎం బిషప్ డాక్టర్ సగిలి ప్రకాష్ ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారని తెలియజేశారు.అనంతరం ప్రత్యేక ప్రార్థనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు.



సంపాదకీయం

## సూపర్ 'పవర్‌గేమ్'లో భారత్ డైలమా!

డామిట్, కథ అడ్డం తిరిగింది. ట్రంపూ, నెతన్యాహూ కలిసి రాసుకున్న స్క్రిప్టులో లేని సన్నివేశం ఎదురైంది. ఈ యాంటీ క్లైమాక్స్ వాళ్లు ఊహించింది కాకపోవచ్చు. వ్యూహం ప్రకారమే దాడులు జరిగిన తొలిరోజున ఇరాన్ ఆధ్యాత్మిక అధినేత అలీ ఖమేనీని హతం చేశారు. ఈ దెబ్బకు ఇరాన్ జావకారిపోయి ఉండాలి. మత పాలనను వ్యతిరేకించే ఇరాన్ ప్రజలు లక్షల సంఖ్యలో వీధుల్లోకి వచ్చి ట్రంపు మహాశయునికి జైకొట్టి ఉండాలి. మహా అయితే నాలుగు రోజుల్లో ఇరాన్ సర్కార్‌ను పీక పట్టుకొని మోకాళ్ల మీద కూర్చోబెట్టి అవమానకరమైన షరతుల మీద సంతకం పెట్టించి ఉండాలి. ఇదీ వ్యూహం. నాలుగు రోజులు కాదు. నాలుగు వారాలు గడిచిపోయాయి. ఏమైంది? హొర్మూజ్ అనే ఒక సముద్రపు ఇరుకు సందులో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ పీకను దొరకబుచ్చుకొని దాని కణత మీద తుపాకీ గురిపెట్టి కూర్చున్న ఇరాన్ దృశ్యం ఇప్పుడు స్పష్టంగా కనిపి స్తున్నది. నాలుగున్నర దశాబ్దాలుగా ఇరాన్ మీద ఆర్థిక ఆంక్ష లను అమెరికా అమలు చేస్తున్నది. దాని చమురు అమ్మకాలను నిషేధించింది. తాజా పరిణామాలతో, చమురు నౌకల రవా ణాకు ఆటంకాలను తొలగించాలని విజ్ఞప్తి చేయడంతోపాటు ఇరాన్ కూడా అమ్ముకోవచ్చంటూ తాత్కాలిక 'అనుమతి'ని ప్రసాదించింది. ఇదేమీ ట్రంప్ 'కరుణ' కాదు, కాళ్ల బేరమని అర్థమవుతూనే ఉన్నది. ఇరాన్‌పై యుద్ధం కారణంగా తలెత్తిన ఇంధన సంక్షోభంపై ప్రపంచ దేశాలు తనను వేలెత్తి చూపకుండా ఓ నెలరోజుల సడలింపును ఆయన ప్రకటించారు. గతంలో చాటుమాటుగా చైనాకు చమురు సరఫరా చేసి, దాన్నుంచి వస్తు--సేవలను పొందుతున్న ఇరాన్ ఇప్పుడు రైట్ రాయల్‌గా రోజుకు 140 మిలియన్ డాలర్ల విలువైన చమురు అమ్మకాలను ప్రారంభించింది. దాడుల్లో ఇరాన్‌కు జరిగిన ఆస్తి నష్టంపై స్పష్టమైన అంచనాలు ఇంకా రాలేదు గానీ, చమురు విక్రయం ద్వారా బహిరంగంగా రోజుకు సుమారు 1400 కోట్ల రూపాయలను (ఇండియన్ కరెన్సీలో) ఇరాన్ ఆర్జిస్తున్నది. అమె రికా మాత్రం చేతి చమురును బాగానే వదిలించుకుంటున్నదని ఆ దేశంలోనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటివరకు రోజుకు సగటున ఒకటిన్నర బిలియన్ డాలర్ల చొప్పున యుద్ధ జ్వాలలకు అమెరికా ఆహుతిస్తున్నదని లెక్కలు తేలుతున్నాయి. మొదటి మూడు వారాల్లో 30 బిలియన్ డాలర్లను అర్పించు కోవలసి వచ్చింది. ఇరాన్ దాడుల్లో గల్ఫ్ ప్రాంతంలోని అమె రికా సైనిక స్థావరాలు భారీగా ధ్వంసమయ్యాయి. వాటి పున రుద్ధరణ పేరుతో ఇంకో 200 బిలియన్ డాలర్లను కేటాయించాలని అమెరికా కాంగ్రెస్‌ను పెంటగన్ (రక్షణ శాఖ కేంద్రం) కోరుతున్నది. పెంటగన్ అభ్యర్థనపై ప్రతిపక్ష డెమోక్రాట్లే కాదు, కొందరు పాలక రిపబ్లికన్లు కూడా దుమ్మెత్తిపోస్తున్నారు. అమెరికా ప్రజల జీవన ప్రమాణాలను ఫణంగా పెట్టి ఏం సాధించాలని ఇరాన్ యుద్ధంలో ఇంత పెద్దమొత్తంలో తగలేస్తున్నారని వారు ట్రంప్ సర్కార్‌ను నిగ్గదీస్తున్నారు. ఇప్పటికే 39 ట్రిలియన్ డాలర్ల అప్పులతో సతమతమవుతున్న అమెరికా ఆర్థిక వ్యవస్థపై ఈ నిరర్థక యుద్ధ ఖర్చు మోయలేని భారాన్ని మోపుతుందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇరాన్‌పై హఠాత్తుగా ఇజ్రాయె ల్‌తో కలిసి దాడులకు తెగబడటానికి స్పష్టమైన కారణాన్ని కూడా ట్రంప్ ప్రభుత్వం చెప్పలేకపోయింది. అణ్వస్త్ర బూచీ అనే అరిగిపోయిన రికార్డునే అది ఇప్పటికీ ప్లే చేస్తున్నది. ఇరాన్ అణ్వస్త్ర కార్యక్రమం ఆరోపణలపై ఇప్పటికే అంత ర్జాతీయ అణుశక్తి ఏజెన్సీ (ఏఐఈఏ) అక్కడ తనిఖీలు చేసింది. అణ్వాయుధాలను తయారుచేయడానికి ఇరాన్ ప్రయత్నిస్తున్న దనేందుకు ఎటువంటి ఆధారాలు లభించలేదని ఆ సంస్థ డైరెక్టర్ జనరల్ రఫేల్ గ్రాసీ స్పష్టంగా ప్రకటించారు. అయినప్పటికీ అమెరికాకు, ఇజ్రాయెల్‌కు మాత్రం ఇరాన్ అణుబూచీ కనిపి స్తూనే ఉన్నది. ఇరాన్‌ను నిర్వీర్యం చేస్తే పశ్చిమాసియాలో పెత్తనం చేసే అవకాశం ఇజ్రాయెల్‌కు లభిస్తుంది. ఇరాన్ దన్నుతో ఆ ప్రాంతంలో ప్రమాదకరంగా తయారైన టెర్రరిస్టు గ్రూపులు హెజ్బుల్లా (లెబనాన్), హూతీ (యెమెన్), హమాస్ (పాలస్తీనా)లు కూడా తోక ముడుస్తాయి. ఇదీ ఇజ్రాయెల్ ఆలోచన. మరి అమెరికాకు ఒనగూడే ప్రయోజనం ఏమిటి? 1979లో జరిగిన ఇస్లామిక్ రివల్యూషన్‌లో పదవీ చ్యుతుడైన రాజు రెజా పహ్లవీ. ఆయన అమెరికా కీలుబొమ్మ. ఆ కాలంలో ఇరాన్ నుంచి కారుచౌకగా అమెరికా చమురు కొనుగోలు చేసేది. ఇప్పుడింకో కీలుబొమ్మను కూర్చోబెడితే మళ్లీ ఆ అవకాశం ఉండొచ్చు. కానీ, యుద్ధానికి అదేమంత పెద్ద కారణం కాదు. అమెరికా ఇంధన భద్రతకు అంత ప్రమాదమేమీ లేదు. పైగా ప్రపంచంలోనే అత్యధిక చమురు నిల్వలున్న వెను జువేలా దేశం అమెరికాకు కూతవేటు దూరంలోనే ఉన్నది. దాని అధ్యక్షుడు మదురో, ఆయన సతీమణిని కిడ్నాప్ చేసి ఆ దేశాన్ని అమెరికా తన చెప్పుచేతుల్లోకి తీసుకున్నది. వెనుజువేలా కూడా ఇరాన్‌లాగే చైనాకు మిత్రదేశం కావడం ఇక్కడ గమనార్హం. భారత్ లాగే చైనా కూడా ఇంధన భద్రత గల దేశం కాదు. పైగా దాని ఇంధనావసరాలు చాలా ఎక్కువ. వెనుజువేలా, ఇరాన్ దేశాలు అమెరికా ఆంక్షల నేపథ్యంలో మలేసియా, రష్యా వంటి దేశాల ద్వారా క్రూడ్ ఆయిల్‌ను శుద్ధి చేసి చైనాకు పంపి స్తాయి. చైనాకు ప్రధాన చమురు సరఫరాదారైన రష్యా కూడా అమెరికా ఆంక్షలను ఎదుర్కొంటున్నదే కావడం విశేషం. ప్రపంచ చమురు రవాణాలో ఇరవై శాతానికి పైగా సాగే హొర్మూజ్ జలసంధిని యుద్ధ నేపథ్యంలో ఇరాన్ తన పూర్తి నియంత్రణలోకి తీసుకున్నది. అక్కడి నుంచి చమురు రవాణా చేసే నౌకలపై టోల్ ఫీజు వసూలు చేయాలని ఆలోచిస్తున్నట్టు ఒక లీక్‌ను ఇరాన్ వదిలింది. అంతేకాదు, ఆ ఫీజు అమెరికా డాలర్లలో కాకుండా చైనా యువాన్‌లలో వసూలు చేయాలని ఆలోచిస్తున్నట్టు కూడా వార్తలు వచ్చాయి. ఈ వార్తలు వచ్చిన మరుసటి రోజే ట్రంప్ ఐదు రోజుల దాడుల విరామాన్ని ప్రకటించాడు. దాన్ని తర్వాత ఏప్రిల్ 6 దాకా పొడిగించాడు. ఇజ్రాయెల్ దాడులు మాత్రం ఆగలేదు. డాలర్‌కు సవాల్ ఎదురైతే అమెరికా తట్టుకోలేదు. అందు లోనూ డాలర్ ఆధిపత్యానికి ఊపిరిపోసిన చమురు రంగంలో పోటీ ఎదురైతే చేటుకాలం దాపురించినట్టే. యాభయ్యేళ్ల కింద చమురు ఎగుమతి చేసే గల్ఫ్ దేశాల రక్షణ బాధ్యతను అమెరికా తీసుకున్నది. ప్రతిగా చమురు కొనుగోలు చేసే దేశాలు అందుకు చెల్లించాల్సిన సొమ్మును అమెరికా డాలర్లలో చెల్లించాలి. ఇంధన అవసరాలు అన్ని దేశాలకూ ఉంటాయి కనుక డాలర్ డిమాండ్ పెరిగింది. ఇప్పుడు ఇరాన్ యుద్ధం నుంచి వెనక్కు తగ్గి అమె రికా తోక ముడిస్తే, ఇరాన్ దాడుల్లో తీవ్రంగా నష్టపోతున్న అరబ్ దేశాల రక్షణ బాధ్యత నుంచి అమెరికా వైదొలగి నట్టవుతుంది. అప్పుడు చమురు అమ్మకాన్ని డాలర్లలోనే కొనసాగించవలసిన అవసరం ఈ దేశాలకు ఉండదు. యువాన్, రూబుల్, యెన్ దేన్నయినా వాళ్లు అంగీకరించే అవకాశం ఉంటుంది. ఇటువంటి పరిణామం సంభవిస్తే అమెరికా శిరస్సు మీద నుంచి అగ్రరాజ్యం అనే కిరీటం ఊడి కిందపడ్డట్టే! విరామం తాత్కాలికమే. ఇరాన్ పూర్తిగా లొంగిపోయి, తమ అనుకూల ప్రభుత్వాన్ని అక్కడ ప్రతిష్ఠించే దాకా దాడులు చేయాలని అమెరికా తొలుత భావించింది. అలా జరగాలంటే ఇరాన్ గడ్డమీద తన సేనలను దించాల్సి ఉంటుంది. ఇరాన్ భౌగోళిక స్వరూపం దృష్ట్యా దాంతో భూతల యుద్ధం సాధ్యం కాదని రక్షణ నిపుణులు చెబుతారు. ఉత్తర దక్షిణ సరిహద్దుల్లో సహజమైన కోట గోడగా ఉన్న పర్వత శ్రేణులే ఇందుకు కారణం. మధ్యేమార్గంగా ఇరాన్ చమురు నిల్వచేసే ఖార్గ్ దీవినో, పర్షియన్ గల్ఫ్‌లో ఉన్న దీవుల్లో మరోదాన్నో ఆక్రమించాలని అమెరికా భావిస్తున్నది. ఆ దీవి ద్వారా హొర్మూజ్ నుంచి చమురు కంటెయినర్లు సజావుగా వెళ్లేలా పర్యవేక్షించి యుద్ధంలో విజయం సాధించినట్లు ప్రకటించుకోవాలని భావిస్తున్నది. పర్షియన్ గల్ఫ్ దీవుల ఆక్రమణ కూడా అమెరికా -- ఇజ్రాయెల్ ఊహిస్తున్నంత సులభం కాదు. ఇరాన్ నుంచి తీవ్రమైన ప్రతిఘటననే ఎదుర్కోవలసి ఉంటుంది. నాలుగు వేల కిలోమీటర్ల దూరంలోని డిగో గార్షియా దీవులపైకే క్షిపణులను ప్రయోగించిన ఇరాన్ పట్టుమని పది కిలోమీటర్ల దూరం లేని దీవుల్లో అమెరికా సైన్యం దిగితే మిన్నకుంటుందా? పర్షియల్ గల్ఫ్‌లో పెనుమంటలు చెలరేగవచ్చు. దుబాయ్, అబుధాబీ, దోహా, రియాద్ నగరాల వైభవోజ్వల కాంతులు మసక బారవచ్చు. అన్నిటినీ మించి ప్రపంచ ఆర్థిక గమనం తీవ్రమైన ఒడిదుడుకులకు లోనుకావచ్చు. మన దేశం సంగతి సరేసరి. ఇరాన్ మన దేశం పట్ల కొంత ఉదారంగా ఉన్నప్పటికీ నాలుగు వారాల ఘర్షణే దేశంలో తీవ్రమైన ప్రభావాన్ని చూపెడుతున్నది. ఈ ఘర్షణ వారాల్లోంచి నెలల్లోకి మారితే తీవ్ర సంక్షో భాన్ని చవిచూడవలసి రావచ్చు. మన రాజకీయ నాయకత్వ దీక్షా దక్షతలకు, ప్రజా సమూహాల సమైక్యతకు ఇది పరీక్షా కాలం. ప్రపంచాన్ని ఆందోళనకరమైన పరిస్థితుల్లోకి నెట్టివేస్తున్న ఈ అంతర్జాతీయ పరిణామాల్లో ఒక ప్రముఖ దేశంగా, అత్యధిక జనాభా గల దేశంగా ఉన్న భారత్ పోషించవలసిన పాత్ర ఏమిటన్నది కూడా చర్చించుకోవలసిన సందర్భం. తన సూపర్ పవర్ హోదాను, తన ఆధిపత్యంలోని ఏకధ్రువ ప్రపంచ గమనాన్ని నిలబెట్టుకునేందుకు అమెరికా ప్రయత్నిస్తున్నది. ఆర్థికంగా -- సాంకేతిక పరంగా అనూహ్యమైన ప్రగతిని సాధించిన చైనా ఈ తరహా ప్రపంచ గమనపు దిశను మార్చాలని సహజంగానే భావిస్తుంది.

# భారీ జీతంతో సమ్మతృప్తే!

## ఐటీ జాబ్ మార్కెట్లో భిన్నమైన పరిస్థితి ఆసక్తి కలిగిస్తున్న 'బ్లైండ్'యాప్ నివేదిక




భారీ జీతం అందుకోవాలి. వృత్తిపరంగా ఎదగాలి. ప్రపంచస్థాయిలో గుర్తింపు రావాలి. ఇదీ ఓ సగటు భారతీయ టెకీ మనసులో మాట. ఇందుకోసం అంతర్జాతీయ దిగ్గజ టెక్ కంపెనీల్లో పనిచేయాలని ఆకాంక్షిస్తుంటారు. అయితే అధిక వేతనం ఎల్లప్పుడూ పని ప్రదేశంలో సంతృప్తిని, వృత్తిపరమైన ఎదుగుదలను అందించలేదని ఒక నివేదిక వెల్లడించింది. ప్రధాన సంస్థలలో పని వాతావరణాన్ని అంచనా వేయడానికి 40,686 మంది ఉద్యోగుల రేటింగ్స్, జీతాల డేటాను విశ్లేషించిన అమెరికాకు చెందిన ప్రొఫెషనల్ కమ్యూనిటీ యాప్ 'బ్లైండ్'ఓ నివేదికను రూపొందించింది. పని ప్రదేశంలో సంతృప్తి, వృత్తిపరమైన ఎదుగుదల అవకాశాలు, మేనేజ్‌మెంట్ పనితీరును విశ్లేంచింది. మన దేశంలో టెకీలు కోరుకుంటున్న ప్రధాన కంపెనీల జాబితా ఒకటైతే.. భారత్‌లో పనిచేయడానికి ఉత్తమ సంస్థలుగా పేరొందిన సంస్థల జాబితా వేర్వేరుగా ఉండటం ఆసక్తికరం.

### భారీ వేతనం ఉంటే..

పోటీతత్వంతో కూడిన నేటి ఉద్యోగ మార్కెట్‌లో సరైన పని ప్రదేశాన్ని ఎంచుకోవడం మునుపటి కంటే ఇప్పుడు చాలా కీలకంగా మారింది. చాలామంది నిపుణులు కేవలం జీతంపైనే కాకుండా వృత్తిపరమైన ఎదుగుదల, పని సంస్కృతి, దీర్ఘకాలిక స్థిరత్వంపై కూడా దృష్టి సారిస్తున్నారు. పని--జీవిత సమతుల్యత ఉద్యోగుల సంతోషాన్ని గణనీయంగా ప్రభావితం చేస్తుందని తేలింది. కెరీర్‌ను మార్చుకోవాలనుకునే నిపుణులకు జీతం ఇప్పటికీ ప్రధాన ఆకర్షణగా ఉంది. అంటే భారీ వేతనం ఉంటే కెరీర్ మారేందుకు సిద్ధం అన్నమాట.

### టాప్--15లో లేవు..

భారత్‌లో టెకీలు, జాబ్ మార్కెట్లోకి అడుగుపెట్టేవారు అత్యధికంగా కోరుకునే సంస్థల జాబితాను బ్లైండ్ రూపొందించింది. ఇందులో అమెజాన్, గూగుల్, మైక్రోసాఫ్ట్, అట్లాసియన్, ఫ్లిప్‌కార్ట్, జీటా, ఇన్‌మోబి, టెకియన్ కార్ప్, ఊబర్, వాల్‌మార్ట్, సేల్స్‌ఫోర్స్, ఎడోబ్, మెటా, ఒరాకిల్, షేర్‌చాట్ ముందు వరుసలో ఉన్నాయి. బ్లైండ్ బెస్ట్ వర్క్‌ప్లేసెస్ జాబితాలో అత్యుత్తమ రేటింగ్ పొందిన టాప్--10 కంపెనీల్లో ఎన్విడియా, గూగుల్, యాపిల్, అకామాయ్ టెక్నాలజీస్, వీఎమ్‌వేర్, ఎడోబ్, టార్గెట్, క్రెడ్, నోకియా, థాట్‌వర్క్స్ ఉన్నాయి. గూగుల్, ఎడోబ్ మాత్రమే ఈ రెండు జాబితాల్లోనూ నిలిచాయి. అమెజాన్, మైక్రోసాఫ్ట్, మెటా వంటి భారీ వేతనాలు ఇచ్చే కంపెనీలు టాప్--15 బెస్ట్ వర్క్‌ప్లేసెస్‌లో చోటు సంపాదించుకోలేకపోయాయి. ఎన్విడియా, యాపిల్, అకామాయ్ టెక్నాలజీస్ వంటి అత్యుత్తమ రేటింగ్ పొందిన సంస్థలకు అత్యధికంగా కోరుకునే కంపెనీల జాబితాలో స్థానం దక్కలేదు.

### ఉద్యోగుల సెంటిమెంట్..

అధిక జీతాలు ఎల్లప్పుడూ ఉద్యోగ సంతృప్తితో సంబంధం కలిగి ఉండవని ఈ అధ్యయనం ద్వారా వెల్లడైంది. అత్యధిక జీతాలు ఇచ్చే కంపెనీలలో మూడో వంతు కంటే తక్కువ మాత్రమే అత్యుత్తమ రేటింగ్ పొందిన పని ప్రదేశాల జాబితాలో ఉన్నాయి. ఆర్థిక ప్రోత్సాహకాలు ప్రతిభను ఆకర్షించినప్పటికీ ఉద్యోగులను నిలుపుకోవడంలో, వారిని ఉత్సాహపరచడంలో పని సంస్కృతి, నాయకత్వం కీలక పాత్ర పోషిస్తాయని నిరూపితమైంది. ఉద్యోగుల సంతృప్తి అనేది కేవలం జీతంపై మాత్రమే కాకుండా ఇతర అంశాలపై ఆధారపడి ఉంటుందని నివేదిక స్పష్టం చేసింది. ఉద్యోగి ఏదేని కంపెనీలో దీర్ఘకాలం కొనసాగాలంటే నాయకత్వ నాణ్యత, వృత్తిపరమైన అభివృద్ధి, పని సంస్కృతి ఇప్పటికీ కీలకమైనవి. ఆర్థిక ప్రోత్సాహకాలతోపాటు సహాయక వాతావరణాన్ని సమతుల్యం చేసే సంస్థలు మాత్రమే నైపుణ్యం కలిగిన నిపుణులను నిలుపుకోగలవు, బలమైన ఖ్యాతిని నిర్మించుకోగలవని తెలిపింది.

### ఏడాదిలో భారత్‌లోని నిపుణులు వెతికిన కంపెనీలు, పదాలు...

అత్యధికంగా వెతికిన కంపెనీల పేర్లు: మైక్రోసాఫ్ట్, గూగుల్, ఊబర్, అమెజాన్, సేల్స్‌ఫోర్స్, మెటా, అట్లాసియన్, యాపిల్, క్వాల్‌కామ్, ఈబే. తరచూ సెర్చ్ చేసిన పదాలు: లేఆఫ్, ఆఫర్, హెచ్--1బీ, మెటా ఇండియా, గూగుల్ ఇండియా, మెటా లండన్.

# వేదకాలం నుంచి నేటి కాలం వరకు.. విదుషీమణులు



ప్రాచీన కాలంలో, అంటే క్రీ.పూ.3000 సంవత్సరాల ముందు కాలం నుండీ కూడా మన దేశం 'స్త్రీ విద్య' ను ప్రోత్సహించి, గౌరవించింది. ఆనాటి నుండీ స్త్రీలు లౌకిక, అలౌకిక విద్యలలో పురుషులతో సమానంగా నిలుస్తున్నారు. వేదకాలంలోనే మహిళలు ఉపనయన సంస్కారాలు పొంది, వేదాధ్యయనం చేశారు. వేద మంత్రాలు దర్శించారు. తపస్వినులు, ఆధ్యాత్మికవేత్తలైన స్త్రీలను 'ఋషికలు' అంటారు. రోమశ, గార్గి వాచక్నవి, విశ్వవర, ఆత్రేయి, లోపాముద్ర, ఇంద్రాణి, మైత్రేయి, అపాల, యామి, పౌలోమి, ఘోష, ఖోన, జుహు, వాగంభ్రణి, సావిత్రి, దేవజామి, కక్షివతి, దక్షిణ ప్రజాపత్య, విశ్వావతి, పశుక్రపత్ని, దేవసూని, శాశ్వతి, అంగిరసి, శ్రీ లక్ష్మి, నోధ, శిఖతన్వరి, గౌపాయన, ఉభయభారతి, విజ్జిక, కామాక్షి వంటి స్త్రీలందరూ ఋషికలే. గృహజీవనానికి స్త్రీయే పునాది అని ఋగ్వేదం చెప్పింది. శక్తిస్వరూపిణి అయిన స్త్రీని గౌరవించి, ఆరాధించే సంస్కృతి మనది. పరబ్రహ్మలోని స్త్రీ పరమైన గుణాలు, శక్తులు కలిసి 'స్త్రీ దేవతలు' అవతరించారు. వారి గురించి తెలుసుకుందాం.

లోపాముద్ర: అగస్త్య మహర్షి భార్య లోపాముద్ర సంస్కృత, తమిళ భాషలలో నిష్ణాతురాలు. లోపాముద్ర అంటే తనలో తానే లీనమైన ఆత్మనిష్ఠాపరురాలు అని అర్థం. అగస్త్యునికి, లోపాముద్రకు మధ్య జరిగిన సంవాదం, లోపాముద్ర పాండిత్యం, గెలుపును ఋగ్వేదం ప్రశంసించింది. అగస్త్యుడు, లోపాముద్ర సాహచర్యంలో సంవాదాలలో భౌతిక, ఆధ్యాత్మిక జీవితంలోని పవిత్రతను, పూర్ణత్వాన్ని గ్రహించాడని చెబుతారు.

ఘోష: ఆమె దుర్గతమసుని మనుమరాలు. కక్షివంతుని కూతురు. దేవ వైద్యులైన అశ్వనీ కు మారులను స్తుతిస్తూ ఆ తండ్రీ కుమా రులు అనేక శ్లోకాలు రచించారు. పదవ ప్రకరణంలోని కొన్ని శ్లోకాలను తండ్రి, తాతగార్లతో సమానంగా ఘోష రచించింది. వాటిలోని ఒక శ్లోకంలో ఆమె అశ్వినులను వివాహం చేసుకోవాలనే ఆకాంక్షను వెల్లడిస్తుంది. కుష్ఠువ్యాధిచే కురూపి అయిన ఆమెను అశ్వనీ దే వతలు తమ వైద్యంతో ఆరోగ్యవంతు రాలిని, అందగత్తెను చేసి పెండ్లి చేసు కొంటారు.

ఋగ్వేద మంత్ర ద్రష్ట మైత్రేయి: గొప్ప తాత్వికురాలు, ఋషిక అయిన మైత్రేయి కూడా ఋగ్వేద మంత్రాలను దర్శించింది. ఆమె తన భర్త అయిన యాజ్ఞవల్క్యుని వ్యక్తిత్వ, ఆధ్యాత్మిక ఆలోచనలను పరిణితి చెంచేలా చేయడంలో ప్రధానపాత్ర వహించింది. యాజ్ఞవల్క్యునికి కాత్యాయని అనే రెండవ భార్య కూడా ఉంది. ధర్మశాస్త్రాలు, వేదాలు బాగా చదివి, బ్రహ్మవాదినిగా మైత్రేయి ఘనత వహిస్తే, కాత్యాయని ఒక సాధారణ ఇల్లాలిగానే ఉండింది. ప్రాపంచిక చింతనలు విడిచి, సన్యాసికి అనువైన స్వీయ నియంత్రణ, సన్యాసి ప్రతిజ్ఞా పాలన చేయదలచి యాజ్ఞవల్క్యుడు ఒకరోజు తన ప్రాపంచిక ఆస్తిపాస్తులను తన ఇద్దరు భార్యలకు పంచదలిచాడు. ప్రపంచ సంపద తనకు శాశ్వతత్వాన్ని, ముక్తిని ఇవ్వలేదని భావించి మైత్రేయి తన భర్త నుండి కేవలం ఆధ్యాత్మిక జ్ఞానాన్ని, ముముక్షత్వానికి కావలసిన శిక్షణను కోరుకొని మరీ పొందింది.

బ్రహ్మజ్ఞాని గార్గి: వాచక్న మహర్షి కూతురు, వైదిక ప్రవక్త గార్గి. మానవ అస్తిత్వానికి, ఉనికికి, జీవితానికి మూలమేమిటి అనే అంశంపై గార్గి అనేక వేదమంత్రాలను దర్శించింది. ఎందరో వేదాంత వేత్తలను వాదంలో గెలిచిన యాజ్ఞవల్క్యునికి ఆత్మానాత్మల విచారం గురించి, బ్రహ్మ జ్ఞానం గురించి అనేక ప్రశ్నలను సంధించి గార్గి ఆయనను ముప్పుతిప్పలు పెట్టింది.

గొప్ప విజ్ఞాని ఉభయభారతి: మధ్యయుగంలో తత్వవేత్త, మీమాంస, అద్వైత దర్శనాలలో ప్రవీణుడైన మండనమిశ్రుని భార్య అయిన ఉభయభారతి ఒక గొప్ప విజ్ఞాని. శ్రీ ఆదిశంకరాచార్యులకు, మండనమిశ్రునికి మధ్య జరిగిన అద్వైత సిద్ధాంత సంబంధిత వాదోపవాదాలకు ఆమె న్యాయనిర్ణేతగా వ్యవహరించింది. పక్షపాత రహితంగా ఆ వాదనలలో తన భర్తను కాక, ఆదిశంకరులనే విజేతగా ప్రకటించిన విదుషీమణి ఆమె.

ఆళ్వార్ ఆండాళ్: ఇంకా ఆ యుగంలో 'తిరుప్పావై' అనే భక్తి గీతాలను వ్రాసిన మొదటి మహిళా ఆళ్వార్ అండాళ్. స్త్రీ స్వేచ్ఛ, వ్యక్తిత్వంపై కవితలు వ్రాసిన కర్నాటకలోని శివ భక్తురాలు అక్క మహాదేవి. రాజస్థాన్ లోని కృష్ణ భక్తురాలు, సాంఘిక దురాచారాలను ప్రతిఘటించిన కవయిత్రి మీరాబాయి, సరళ భాషలో వేదాంతపరమైన నిగూఢార్థాలు చాటిచెప్పిన తత్వవేత్త లాలాదేవి, గ్రామీణుల సాధారణ జ్ఞానాన్ని వేదాంత విజ్ఞానంతో అనుసంధిస్తూ రచనలు చేసిన తమిళ కవయిత్రి అవ్వయ్యార్, ఇంకా సక్కుబాయి, ముక్తాబాయి, మదాలస, ఈ మధ్యకాలంలో తరిగొండ వెంగమాంబ, ఆదోని లక్షమ్మ, జిల్లెళ్ళమూడి అనసూయమ్మ మొదలైన యోగినులు, అంతర్బుద్ధి సిద్ధులైన మహిళలు ఎందరో ఉన్నారు.

విజ్జిక: దండి మహాకవి తన ఒక రచనలో సరస్వతీ దేవిని తెలుపు దేహరంగు ఛ్చాయ కలదిగా వర్ణించాడు. విజయాంబిక (విజ్జిక) అనే కవయిత్రి నలుపురంగుతో ఉండేది. ఆమె దండి అభిప్రాయాన్ని ప్రతిఘటించింది. నల్లని దేహకాంతిగల అపర సరస్వతినైన నా గురించి తెలుసుకోకుండా సరస్వతి ధవళవర్ణిని అని దండికవి ఎలా అంటాడని ఆమె ప్రశ్నించింది. స్త్రీల ఆత్మవిశ్వాసానికి విజ్జిక ఒక ప్రతీక. ఇంకా గంగాదేవి, తాళ్ళపాక తిమ్మక్క, మొల్ల వంటి కవయిత్రులు రసవత్తర కావ్యాలు వెలువరించి పురుషులతో సమానంగా నిలిచినవారే.

ఆధ్యాత్మిక వేత్త గౌతమి: బౌద్ధయుగంలో గౌతమ బుద్ధుని పెంపుడు తల్లి అయిన మహా ప్రజావతి గౌతమి ఒక ఆధ్యాత్మికవేత్త. ఆమె కాక బౌద్ధ వేదాంత ధ్యాన సన్యాసినులు ఖేమ, ఉప్పలావన, రెండవ భాస్కరుని కూతురైన లీలావతి వంటి ఆధ్యాత్మిక వేత్తలైన స్త్రీలుండేవారు.

# చందమామ చిక్కేదెవరికి?

## మానవసహిత ప్రాజెక్టులకు శ్రీకారం చుడుతున్న చైనా అమెరికాకు పోటీగా పరిశోధనలు ఒక్కసారిగా పెరిగిన అంతరిక్ష పరిశోధనల పోటీ



దశాబ్దాల తర్వాత జాబిల్లిపై అమెరికా దృష్టిసారించిన మరుక్షణమే చైనా సైతం తన అంతరిక్ష పరిశోధనలకు చందమామను కేంద్రస్థానంగా మార్చుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం ప్రత్యేకంగా రాకెట్లు, వ్యోమనౌకలు, ల్యాండర్‌లతో రంగంలోకి దిగేందుకు సమాయత్తమవుతోంది. 2028కల్లా చంద్రునిపై 'ఆర్టిమిస్ ప్రోగ్రామ్'ద్వారా మానవసహిత ప్రయోగాలను పునరుద్ధరించాలని అమెరికా ప్రణాళికలు రచించింది. ప్రతిరంగంలో అమెరికాతో పోల్చుకుని ఆ దిశగా పావులు కదిపే చైనా ఇప్పుడు శాస్త్ర పరిశోధనలు, అంతరిక్ష వనరులు, దేశ ప్రయోజనాలే పరమావధిగా ముందడుగు వేస్తోంది. దీంతో ఒక్కసారిగా చంద్రుని కేంద్రంగా అంతర్జాతీయ అంతరిక్ష పరిశోధనల పోటీకి తెరలేచింది.

### చైనా ఎలా సంసిద్ధమవుతోంది?

మానవసహిత ప్రయాణాలు సాధ్యమయ్యేలా అత్యంత శక్తివంతమైన లాంగ్ మార్చ్--10 రాకెట్‌ను చైనా అభివృద్ధి చేస్తోంది. దీనికి సంబంధించిన తక్కువ కాలానికి ఇంజిన్‌ను పూర్తి లేదా పాక్షిక సామర్థ్యంతో మండించడం(క్రిటికల్ స్టాటిక్ ఫైర్), ప్రయోగశాలలో రాకెట్ సామర్థ్యాన్ని పరీక్షించడం(లో ఆటి?టట్యూట్ డెమోన్?రస్టేషన్ టెస్ట్)లను విజయవంతంగా పూర్తిచేసింది. వ్యోమగాములను మోసుకెళ్లే పునర్ వినియోగ క్యాపరీ?స్యల్ 'ది మెంగ్‌జోయూ'ను చైనా పరీక్షిస్తోంది. ఈ క్యాప్సుల్‌తో డైనమిక్ ప్రెషర్ విధానంలో వ్యోమగాములు తప్పించుకునే టెస్ట్‌ను విజయవంతంగా పరీక్షించింది. ప్రయోగవేదిక నుంచి వ్యోమనౌక గాల్లోకి లేచేటప్పుడు హఠాత్తుగా అగ్నిప్రమాదం లాంటివి జరిగితే వ్యోమగాములు తప్పించుకునే మ్యాక్స్ క్యూ అబోర్ట్ టెస్ట్‌నూ విజయవంతంగా పరీక్షించింది. చైనా వ్యోమగాములు(టైకోనాట్స్)ను చందమామ ఉపరితలం మీదకు తీసుకెళ్లే తిరిగి కక్ష్యలోకి తీసుకొచ్చే 'ది లాన్యే లూనార్'ల్యాండర్‌నూ చైనా పరీక్షిస్తోంది. లాన్యే అంటే చందమామను హత్తుకోవడం. ఈ పదాన్ని మావో జెడాంగ్ తన కవితలో తొలిసారిగా ఉపయోగించారు. సిమ్యులేషన్ సమయంలో ఈ ల్యాండర్.. ల్యాండింగ్, టేకాఫ్‌లను అత్యంత ఖచ్చితత్వంతో పూర్తిచేసిందని చైనా ఇటీవలే ప్రకటించింది. చందమామపైకి లాంగ్ మార్చ్--10 రాకెట్ పలు మార్లు ప్రయోగాలకు అనువుగా ప్రయోగవేదికలను విస్తరిస్తున్నారు. లాంచ్‌ప్యాడ్లు, ట్రాకింగ్ స్టేషన్లు, అనుబంధ భవనాలను నిర్మిస్తున్నారు. దీంతో హైనాన్‌లోని వెన్‌చాంగ్ స్పేస్‌క్రాఫ్ట్ లాంచ్‌సైట్‌లో నిర్మాణపనులు వేగవంతమయ్యాయి. వ్యోమగా ములతో కూడిన డీప్--స్పేస్ ఆపరేషన్ల కోసం ఇతర కీలక వసతులను అందుబాటులోకి తెస్తున్నారు.

### చందమామ మీదకు వెళ్లేది ఎప్పుడు?

మరో నాలుగేళ్లలో తొలి వ్యోమగాముల బృందాన్ని చందమామ మీద దింపాలని చైనా లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఇందుకు సంబంధించిన పనులన్నీ షెడ్యూల్ ప్రకారం చకచకా జరుగుతున్నాయని 'ది చైనా మ్యాన్డ్ స్పేస్ ఏజెన్సీ'ప్రకటించింది. "ప్రయోగ పరీక్షలు అన్నీ విజయవంతమవుతూ, మౌలికసదుపాయాల కల్పన పూర్తవుతూ లక్ష్యాన్ని చేరువచేస్తున్నాయి. అంతరిక్ష చరిత్రలో సరికొత్త మైలురాయిని త్వరలో చేరుకోబోతున్నాం"అని స్పేస్ ఏజెన్సీ పేర్కొంది.

### ఈ ఏడాది బిజీబిజీ..

2026లో బిజీ షెడ్యూల్‌తో చైనా దూసుకుపోతోంది. సొంతంగా నిర్మించుకున్న అంతరిక్ష కేంద్రం 'తియాన్‌గాంగ్ స్పేస్ స్టేషన్'కు రెండు సార్లు వ్యోమగాములను పంపనుంది. సరకులను పంపేందుకు ఒక ప్రయోగం చేయనుంది. ఒక టైకోనాట్‌ను ఒక పూర్తి ఏడాదికాలం అక్కడే ఉంచనుంది. తద్వారా సుదీర్ఘకాలంపాటు అంతరిక్షంలో ఉంటే ఎలాంటి అనారోగ్య పరిస్థితులను ఎదుర్కోవాల్సి రావొచ్చు? అనే అంశంపై అధ్యయనంచేయనుంది. కొత్త మాడ్యూళ్లను తీసుకెళ్లేందుకు హాంకాంగ్, మకావూ నుంచి ఇద్దరు టైకోనాట్స్‌ను అంతరిక్ష కేంద్రానికి పంపనుంది. పాకిస్తాన్ వంటి అంతర్జాతీయ భాగస్వామ్య దేశాల వ్యోమగాములకు చైనా స్పేస్‌స్టేషన్ స్వాగతం పలకనుంది.

### నాసా మిషన్‌లో వచి?చన మార్పులేంటి?

2027లో దిగువ కక్ష్యలో తొలుత ఒక వ్యోమనౌకను ప్రయోగించనుంది. వాణిజ్య ల్ల?యడర్లతో అనుసంధానం కోసం రిహార్సల్ చేయనుంది. ఈ కమర్షియల్ ల్యాండర్లను స్పేస్‌ఎక్స్, బ్లూ ఆరిజిన్ సంస్థలు రూపొందిస్తున్నాయి. మరో రెండు నెలల్లో ఆర్టిమిస్--2 ప్రాజెక్ట్‌ను అమెరికా చేపట్టనుంది. వ్యోమగాములతో బయల్దేరే వ్యోమనౌక చంద్రుని సమీప కక్ష్యలోకి వెళ్లి అక్కడి నుంచి జాబిలి సమాచారాన్ని సేకరిస్తుంది. చంద్రుని స్వల్ప గురుత్వాకర్షణ శక్తినే వడిసెలా వాడుకుని తిరిగి భూమి దిశలో పయనించనుంది. 2027లో ఆర్టిమిస్--3 ఆ తర్వాత 2028లో ఆర్టిమిస్--4ను అమలుచేయనుంది.

### మళ్లీ చందమామపై దృష్టి ఎందుకు సారించారు?

చంద్రుని దక్షిణ ధృవంలోని బిలాల్లో ఘనరూప నీరు ఉందని తాజా పరిశోధనలు బలంగా చెబుతున్నాయి. ఈ నీటిని ఉపయోగించుకుని అక్కడ వ్యోమగాముల కోసం స్థిరనివాసాలు ఏర్పాటుచేయాలని అమెరికా భావిస్తోంది. అక్కడి నుంచి అంతరిక్ష ప్రయోగాలు చేయాలని ఆశిస్తోంది. అరుణ గ్రహంపై యాత్రకు జాబిలిని మజిలీగా మార్చుకోవాలని భావిస్తున్నారు. హీలియం--3 అనే అరుదైన ఐసోటోప్ చందమామపై సమృద్ధిగా ఉందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. వ్యోమగాములు అక్కడ స్థిరపడ్డాక ఈ ఐసోటోప్‌తో కేంద్రక సంలీన చర్య ద్వారా నిరంతరాయంగా కరెంట్‌ను ఉత్పత్తిచేసి విద్యుత్ అవసరాలను తీర్చుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

# మైక్రోసాఫ్ట్, ఆపిల్‌కు చెక్‌పెట్టేందుకు.. ఆండ్రాయిడ్ ఓఎస్‌తో పీసీని తీసుకురానున్న గూగుల్..!




ప్రస్తుతం అందరికీ కంప్యూటర్లు అనగానే గుర్తుకు వచ్చేది మైక్రోసాఫ్ట్ ఆపరేటింగ్ సిస్టమ్. స్మార్ట్ ఫోన్ అనగానే గుర్తుకు వచ్చేది ఆండ్రాయిడ్ ఓఎస్. మీరు ఆండ్రాయిడ్ ప్రియులైతే మీకో గుడ్‌న్యూస్. త్వరలో ఆండ్రాయిడ్ ఆపరేటింగ్ సిస్టమ్‌తో నడిచే కంప్యూటర్లు రాబోతున్నాయి. ప్రముఖ టెక్ దిగ్గజం గూగుల్ ఆండ్రాయిడ్ పీసీని అభివృద్ధి చేస్తున్నట్లు ప్రకటించింది. అంటే ఇకపై మొబైల్ తరహా ఓఎస్ కంప్యూటర్, ల్యాప్‌టాప్‌ల్లో తీసుకురాబోతుందన్నమాట. వాస్తవానికి ప్రస్తుతం కంప్యూటర్ల ఓఎస్ విషయంలో మైక్రోసాఫ్ట్‌తో పాటు ఆపిల్ మ్యాక్ ఓఎస్ హవా కొనసాగుతున్నది. గూగుల్ క్రోమ్ ఓఎస్ పేరుతో ఆపరేటింగ్ సిస్టమ్‌ను తీసుకువచ్చేందుకు ప్రయత్నించినా పెద్దగా ఆకట్టుకోలేకపోయింది. తాజాగా ఈ రెండు దిగ్గజ సంస్థలకు పోటీ ఇచ్చేందుకు మరోసారి పీసీ ఓఎస్‌పై దృష్టి పెట్టి ఆండ్రాయిడ్ ఓఎస్‌పై పని చేస్తోంది. ఆండ్రాయిడ్, క్రోమ్ ఓఎస్‌లను విలీనం చేయనున్నది. ఈ విషయాన్ని హవాయిలో జరిగిన స్నాప్‌డ్రాగన్ సమ్మిట్‌లో గూగుల్ ప్రతినిధి ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ రెండింటిని విలీనం చేయనున్నారని గతంలోనూ రూమర్స్ వినిపించాయి. క్వాల్కామ్ సీఈవో క్రిస్టియానో అమోన్‌తో సంభాషణల సందర్భంగా గూగుల్ ప్లాట్‌ఫారమ్, డివైజెస్ చీఫ్ రిక్ ఓస్టర్‌లో ఈ విషయాన్ని ధ్రువీకరించారు. గతంలో తాము పీసీలు, స్మార్ట్‌ఫోన్ల కోసం పూర్తిగా వేర్వేరు వ్యవస్థలను తీసుకువచ్చాయని.. కానీ, రెండింటినీ విలీనం చేసేందుకు ఓ ప్రాజెక్ట్‌ను ప్రారంభించామన్నారు. తమ పీసీ, డెస్క్‌టాప్ కంప్యూటింగ్ సిస్టమ్‌లకు సాధారణమైన సాంకేతిక పునాదిని నిర్మిస్తున్నామని ఓస్టర్‌లో పేర్కొన్నారు. ఇది కొత్త దశ ఏఐని మరింత మెరుగుపరుస్తుందని ఓస్టర్‌లో తెలిపారు. ఏఐ జెమిని మోడల్, గూగుల్ అసిస్టెంట్, పీసీ స్పేస్‌లో మొత్తం డెవలపర్ కమ్యూనిటీని ఉపయోగించుకునే మరొక మార్గమని.. ప్రతి కంప్యూటింగ్ వర్గంలోని ప్రజలకు ఆండ్రాయిడ్ సేవలు అందించగల మరో మార్గమని తాను భావిస్తున్నాన్నారు. క్వాల్కామ్ సీఈవో క్రిస్టియాలో గూగుల్ ప్రాజెక్టును ప్రశంసిస్తూ అద్భుతమని పేర్కొన్నారు. తాను దాన్ని చూశానని.. మొబైల్, పీసీలను విలీనం చేయాలనే కలను నెరవేరుస్తుందన్నారు. గూగుల్ గతంలో క్రోమ్‌ఓఎస్, ఆండ్రాయిడ్‌లను ఒకే ప్లాట్‌ఫామ్‌లోకి విలీనం చేయాలని కోరుకుంటున్నట్లుగా గతంలో ప్రకటించింది. ఈ కొత్త ఆండ్రాయిడ్ పీసీ ప్రాజెక్ట్ ఆ దిశలో ప్రధాన అడుగు కావొచ్చని టెక్ నిపుణులు పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా.. క్వాల్కమ్ మరో కీలక ప్రకటన చేసింది. త్వరలో కొత్త స్నాప్‌డ్రాగన్ 8 ఎలైట్ జెన్ 5 చిప్‌సెట్‌ను తీసుకువస్తున్నట్లు ప్రకటించింది. ఈ చిప్‌సెట్ వచ్చే ఏడాది అనేక హై-ఎండ్ ఆండ్రాయిడ్ ఫోన్లలో రానున్నది. షియోమి తన షియోమి 17 సిరీస్‌లో ఈ చిప్‌సెట్‌ను ఉపయోగించనున్నట్లు ధ్రువీకరించింది. వన్ ప్లస్ 15, ఐక్యూ 15, రియల్ మీ 8 ప్రోమవంటి ఇతర డివైజ్‌లు సైతం ఇదే ప్రాసెస్‌తో వచ్చే అవకాశం ఉంది.




# భారతదేశంలోనే కాదు.. ఈ దేశాల్లోనూ వినాయకుడికి ఆలయాలు ఉన్నయ్..!

భారతదేశంలోని అతిపెద్ద పండుగలలో వినాయక చవితి ఒకటి. విజ్ఞానం, విజయం, అదృష్టానికి వినాయకుడు ఆదిదైవం. పనిలో అడ్డంకులను తొలగించి శ్రేయస్సు అందించే దేవుడిగా గణపతిని పూజిస్తారు. ప్రతి సంవత్సరం వినాయక చవితి పండుగను దేశ ప్రజలు ఎంతో వైభవంగా, ఉత్సాహంతో, భక్తితో జరుపుకుంటారు. కుల మతం భేదం లేకుండా హిందూవులతో పాటు ముస్లింలు కూడా కలిసిఉండి ఈ పండుగను జరుపుకుంటారు. వినాయక చవితి రోజున దేశంలోని ప్రముఖ గణేష్ ఆలయాలు అంగరంగ వైభవంగా అలంకరించబడతాయి. ఉదాహరణకి ముంబయిలోని సిద్ధివినాయక దేవాలయం, మహారాష్ట్రలోని అష్టవినాయక దేవాలయం, కేరళలోని మయూర్ మహాగణపతి దేవాలయం, గణేష్ టోక్ టెంపుల్ గంగ్‌టక్, తమిళనాడులోని పిళ్లయార్ టెంపుల్, ఆంధ్రప్రదేశ్‌లోని కాణిపాకం గణపయ్య, త్రినేత్ర గణేష్ రణతంబోర్ వంటి ఆలయాలు ప్రసిద్ధి పొందాయి. మన దేశంలోనే కాకుండా ప్రపంచంలో కూడా వినాయకుడిని దేవుడిగా పూజిస్తారు.

## పిళ్లయార్ టెంపుల్, శ్రీలంక

తమిళంలో వినాయకుడిని పిళ్లయార్ అంటారు. శ్రీలంకలో అరియాలై సిద్ధివినాయకర్ దేవాలయం, కటరగామ దేవాలయం ముఖ్యమైనవి. శ్రీలంక భక్తులతో పాటు భారతదేశం నుంచి కూడా భక్తులు ఇక్కడికి వస్తారు.

## సూర్యవినాయక దేవాలయం, నేపాల్

నేపాల్, భారతదేశానికి పక్కనే ఉన్న దేశం. అత్యధిక హిందువులు నివసించే దేశంలో భక్తపూర్ జిల్లా, ఖాట్మండు సరిహద్దులో సూర్యవినాయక దేవాలయం ఉంది. ఇది ఖాట్మండులోయిలోని నాలుగు ప్రసిద్ధ గణేశ దేవాలయాలలో ఒకటి. జలవినాయక గణేష దేవాలయం కూడా ఇక్కడ ప్రాచుర్యం పొందింది.

## సితి వినాయగర్ టెంపుల్, మలేషియా

మలేషియాలోని సెలంగోర్‌లోని పెటాలింగ్ సమీపంలో ఈ ఆలయం ఉంది. పీజే పిళ్లైయార్ దేవాలయం అని కూడా పిలుస్తారు. ముఖ్యంగా తమిళ ప్రజలు ఎక్కువగా పూజలకు వస్తారు.

## గణేశ దేవాలయం, థాయిలాండ్

ఇక్కడ గణేశుడి విగ్రహాలు చాలానే ఉన్నాయి. హువాయ్ క్వాంగ్ స్క్వేర్‌లోని గణేశ దేవాలయం ప్రముఖమైంది.. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన గణేశ విగ్రహం కూడా ఇక్కడ ఉంది. ప్రతి సంవత్సరం లక్షలాది భక్తులు ఈ విగ్రహాన్ని దర్శించేందుకు వస్తారు.



## సెల్వవినాయకర్, నెదర్లాండ్స్

డెన్ హెల్డర్‌లో ఉన్న శ్రీ వరతరాజ సెల్వవినాయకర్ ఆలయం యూరోప్‌లో ప్రసిద్ధి చెందింది. 1991లో శ్రీలంక నుంచి వచ్చిన తమిళులు దీన్ని నిర్మించారు. హిందూయిజం ప్రపంచవ్యాప్తంగా వ్యాప్తి చెందేందుకు ఈ ఆలయం సేవలందిస్తోంది.

## బ్రహ్మ వినాయకుడు, మయన్మార్

హిందూ విశ్వాసం ప్రకారం వినాయకుడు మొదటి పూజలందుకునే దేవుడు. కానీ, మయన్మార్‌లో గణేషుడిని బ్రహ్మదేవుడిగా భావిస్తారు. ఈ దేశంలో గణేష్ చతుర్థి వేడుకలు ఘనంగా నిర్వహిస్తారు.

## ఇండోనేషియాలో ఆలయాలు..






ఇండోనేషియా ముస్లిం దేశం. ముస్లిం దేశమైనప్పటికీ గణపతిని ఇక్కడ గౌరవిస్తారు. బాలి దీవిలో అనేక గణపతి ఆలయాలు ఉన్నాయి. ప్రతి విద్యాసంస్థ, నిర్మాణ సంస్థల్లో వినాయక విగ్రహాలు ఉంటాయి. ఇండోనేషియా కరెన్సీ నోటుపై కూడా గణపతి బొమ్మ ఉంది. ఇక్కడ గణేష్ ఉత్సవాలు ఘనంగా జరుపుతారు.

## మహావల్లభ వినాయక దేవాలయం, అమెరికా


అమెరికా దేశం న్యూయార్క్ నగరంలో వినాయక ఆలయం ఉంది. మహావల్లభ వినాయక దేవాలయాన్ని నిర్మించారు. ఈ ఆలయాన్ని ఫ్లషింగ్ టెంపుల్‌గా పిలుస్తుంటారు. ఈ దేశంలోనూ అనేక ప్రదేశాల్లో దేవాలయాలు సైతం ఉన్నాయి.

# గంటకు 2.21లక్షల కిలోమీటర్ల వేగంతో అట్లాస్ తోకచుక్క ప్రయాణం.. నాసా ఏం చెప్పిందంటే..?



సౌరకుటుంబం ఆవల నుంచి వేగంగా దూసుకువస్తున్న '3ఐ/అట్లాస్' అనే తోకచుక్కతో భూమికి ఎలాంటి ప్రమాదం లేదని నాసా స్పష్టం చేసింది. సెకనుకు 61 కిలోమీటర్ల (అంటే గంటకు సుమారు 2.21 లక్షల కిలోమీటర్ల వేగం) అసాధారణ వేగంతో ఈ తోక చుక్క ప్రయాణిస్తుంది. ప్రస్తుతం ఈ తోకచుక్క కదలికలను నిరంతరం గమనిస్తున్నామని.. దాంతో భూమికి ఎలాంటి ప్రమాదం ఉండబోదని పేర్కొంది. మన సౌర వ్యవస్థకు చెందని ఖగోళ వస్తువులను గుర్తించడం ఇది మూడోసారి. గతంలో 2017లో 'ఔమువాముVA', 2019లో '2ఐ/బోరిసోవ్'ని శాస్త్రవేత్తలు గుర్తించారు. తాజాగా అట్లాస్ తోకచుక్క సౌరకుటుంబం ఆవల నుంచి వస్తున్న మూడో అతిథిగా పేరుకుంటున్నారు. దాని పేరులో 'ఐ' అక్షరం 'ఇంటర్‌స్టెల్లార్'ని సూచిస్తున్నది. ఈ తోకచుక్కను తొలిసారిగా ఈ ఏడాది జులై 1న చిలీలోని రియో హర్టాడోలో ఉన్న అట్లాస్ టెలిస్కోప్ ద్వారా శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ తోకచుక్క సూర్యుడికి దగ్గరయ్యే కొద్దీ దీని వేగం మరింత పెరుగుతుంది నాసా పేర్కొంది. అక్టోబర్ 30 నాటికి ఇది సూర్యుడికి అత్యంత సమీపంగా.. అంటే సుమారు 21 కోట్ల కిలోమీటర్ల దూరానికి చేరుకుంటుందని అంచనా వేస్తున్నారు. ఇది అంగారక గ్రహ కక్ష్యకు కొద్దిగా లోపలి భాగంలో ఉంటుంది. భూమికి, ఈ తోకచుక్కకు మధ్య దూరం చాలా ఎక్కువగా ఉంటుందని నాసా క్లారిటీ ఇచ్చింది. ఈ తోకచుక్క భూమికి అత్యంత దగ్గరగా వచ్చినప్పుడు కూడా దాని దూరం సుమారు 27 కోట్ల కిలోమీటర్లు ఉంటుందని.. కాబట్టి భూమికి దీనివల్ల ఎలాంటి ముప్పు లేదని తెలిపింది. హబుల్, జేమ్స్ వెబ్ వంటి శక్తిమంతమైన టెలిస్కోపుల ద్వారా దీని గమనాన్ని నిశితంగా పర్యవేక్షిస్తున్నారు. అక్టోబర్ చివరిలో సూర్యుడి దగ్గర నుంచి ప్రయాణించి, మార్చి 2026 నాటికి బృహస్పతిని దాటి తిరిగి మన సౌర వ్యవస్థ నుంచి శాశ్వతంగా దూరంగా వెళ్లిపోతుందని శాస్త్రవేత్తలు అంచనా వేశారు.


# లివర్ క్యాన్సర్ ఎందుకు వస్తుంది..? ఇది ఉంటే కనిపించే లక్షణాలు.. తీసుకోవాల్సిన ఆహారాలు..!



ప్రపంచ వ్యాప్తంగా ఏటా అధిక శాతం మందిని కబలిస్తున్న ప్రధాన వ్యాధుల్లో క్యాన్సర్ ఒకటి. ఇది శరీరంలో అనేక భాగాలకు వస్తుంది. అలాగే లివర్‌కూ వ్యాప్తి చెందుతుంది. లివర్ క్యాన్సర్ అనేది ఒక తీవ్రమైన, ప్రాణాంతక వ్యాధి. ఈ వ్యాధి వచ్చిన వారిలో లివర్ కణాలు డ్యామేజ్ అవుతాయి. దీంతో పలు తీవ్రమైన లక్షణాలు కనిపిస్తాయి. ఈ లక్షణాలను గమనిస్తే లివర్ క్యాన్సర్ ఉన్నట్లు ముందుగానే గుర్తించవచ్చు. దీంతో చికిత్స తీసుకుని లివర్ ఆరోగ్యాన్ని రక్షించుకోవచ్చు. దీని వల్ల ప్రాణాంతకం కాకుండా సురక్షితంగా ఉండవచ్చు. లివర్ క్యాన్సర్ ఉన్నవారిలో శరీరం పలు లక్షణాలను, సంకేతాలను తెలియజేస్తుంది.

## లివర్ క్యాన్సర్ లక్షణాలు..

లివర్ క్యాన్సర్ ప్రారంభంలో ఉన్నా కొందరిలో పలు లక్షణాల కనిపిస్తాయి. ఎలాంటి కారణం లేకుండానే ఉన్నట్లుండి సడెన్‌గా బరువు తగ్గిపోతుంటారు. ఆకలి ఉండదు. కాస్త తిన్నా కూడా కడుపు నిండిన భావన కలుగుతుంది. ఆహారం సహించదు. కడుపులో నొప్పిగా ఉంటుంది. వికారంగా ఉంటుంది. వాంతికి వచ్చినట్లు అనిపిస్తుంది. పచ్చ కామెర్లు వస్తాయి. అవి ఎన్ని రోజులు ఉన్నా కూడా తగ్గవు. పొట్ట మొత్తం ఉబ్బిపోయి కనిపిస్తుంది. చిన్న పనిచేసినా తీవ్రమైన అలసటగా అనిపిస్తుంది. నీరసంగా ఉంటారు. మూత్రం ముదురు రంగులో వస్తుంది. చిన్నపాటి దెబ్బ తగిలినా సులభంగా రక్తస్రావం అవుతుంది. చర్మం బాగా కందిపోయినట్లు అవుతుంది. ఇవన్నీ లివర్ క్యాన్సర్ వచ్చిందని తెలిపే లక్షణాలు.



## లివర్ క్యాన్సర్‌కు కారణాలు..

లివర్ క్యాన్సర్ వచ్చేందుకు అనేక కారణాలు ఉంటాయి. లివర్ సిర్రోసిస్ అనే సమస్య దీర్ఘకాలంగా ఉన్నవారికి, హెపటైటిస్ ఇన్‌ఫెక్షన్లు ఉన్నా, మద్యం విపరీతంగా సేవిస్తున్నా, నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ అనే సమస్య ఉన్నవారిలో, టైప్ 2 డయాబెటిస్ లేదా మెటబాలిక్ సిండ్రోమ్ అనే సమస్య ఉన్నవారిలో, ఫంగస్ ఇన్ఫెక్షన్లు దీర్ఘకాలంగా ఉంటే, స్థూలకాయం ఉన్నవారిలో, పొగ తాగేవారికి లివర్ క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. అలాగే లివర్ క్యాన్సర్ అనేది జన్యు సంబంధ సమస్యలు లేదా వంశ పారంపర్య కారణాల వల్ల కూడా వచ్చే అవకాశాలు ఉంటాయి.

## తీసుకోవాల్సిన ఆహారాలు..

లివర్ క్యాన్సర్ ఉన్నట్లు నిర్ధారణ అయితే కచ్చితంగా చికిత్స తీసుకోవాలి. వ్యాధి ప్రారంభ దశలో ఉంటే లక్షణాలను ముందుగానే గుర్తిస్తే చికిత్స తీసుకుని ప్రాణాంతకం కాకుండా సురక్షితంగా ఉండవచ్చు. అయితే లివర్ క్యాన్సర్ వ్యాధి బారిన పడిన వారు లేదా వ్యాధి రావొద్దని కోరుకునే వారు, లివర్ సమస్యలు ఉన్నవారు ఆహారంలో మార్పులు చేసుకుంటే మంచిది. దీంతో వ్యాధి మరింత ముదరకుండా ఉంటుంది. వ్యాధి రాకుండా కూడా అడ్డుకోవచ్చు. కాఫీని రోజువారి ఆహారంలో భాగం చేసుకుంటే లివర్‌కు ఎంతో మేలు చేస్తుంది. లివర్ కణాలు డ్యామేజ్ అవకుండా కాఫీ రక్షిస్తుంది. కాఫీలో ఉండే సమ్మేళనాలు లివర్‌ను రక్షిస్తాయి. లివర్‌లో కొవ్వు చేరకుండా చూస్తాయి. లివర్ వాపులను తగ్గిస్తాయి. ఓట్‌మీల్ ను తీసుకోవడం వల్ల ఫైబర్ సమృద్ధిగా లభిస్తుంది. ఇది లివర్‌లోని కొవ్వును కరిగించి లివర్‌ను ఆరోగ్యంగా ఉంచుతుంది. అలాగే గ్రీన్ టీని కూడా రోజూ తాగవచ్చు. వెల్లుల్లిని ఆహారంలో భాగం చేసుకుంటున్నా మేలు జరుగుతుంది. బెర్రీలు, ద్రాక్ష, చేపలు, ఆకుకూరలు, బీట్ రూట్, పప్పు దినుసులు, తృణ ధాన్యాలను రోజూ తింటుంటే లివర్‌ను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు. లివర్ క్యాన్సర్ నుంచి రక్షణ లభిస్తుంది.

# దూసుకెళ్తున్న అరట్టై.. నిజంగా ఇది వాట్సాప్ కిల్లర్ అవుతుందా!

ఇప్పుడు మెసేజ్‌లు చేయాలన్నా.. ఫొటోలు, వీడియోలు షేర్ చేయాలన్నా అందరూ వాడుతున్న యాప్ వాట్సాప్. మెట్రో సిటీల్లోని కార్పొరేట్ బిజినెస్‌ల నుంచి పల్లెటూళ్లలో పొలం పనులు చేసుకునే రైతన్నల దాకా వాట్సాప్‌నే వాడుతున్నారు. కానీ ఇప్పుడు ఈ వాట్సాప్‌నకు పోటీగా ఒక యాప్ విపరీతంగా క్రేజ్ తెచ్చుకుంటుంది. అదే 'అరట్టై యాప్'. కొద్దిరోజులుగా దీనికి యూత్‌లో విపరీతమైన క్రేజ్ వస్తోంది. అది ఎలా ఉందంటే.. రోజుకు 3వేల సైన్‌అప్స్ నుంచి ఒక్కసారిగా 3.5 లక్షలకు చేరింది. అంటే ఈ మెసేజింగ్ యాప్ ఇప్పుడు వంద రెట్ల వృద్ధి సాధించింది. అందుకే దీన్ని చాలామంది వాట్సాప్ కిల్లర్‌గా పిలుస్తున్నారు. మరీ యాప్‌నకు ఒక్కసారిగా ఎందుకింత క్రేజ్ వచ్చింది? ఈ యాప్ స్పెషాలిటీ ఏంటి ఇప్పుడు తెలుసుకుందాం..




## అసలు అరట్టై అంటే ఏంటి?

తిమిళంలో అరట్టై అంటే మాట్లాడుకోవడం అని అర్థం. వ్యక్తిగత మెసేజ్‌లతో పాటు గ్రూప్‌చాట్, ఆడియో, వీడియో కాల్స్ షేర్ చేసుకోవడం కోసం ఈ యాప్‌ను తీసుకొచ్చారు. జోహో కార్పొరేషన్ ఈ యాప్‌ను రూపొందించింది. మేక్ ఇన్ ఇండియాలో భాగంగా పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానం ఉపయోగించుకుని ఈ యాప్‌ను తయారుచేశారు.

## ఒక్కసారిగా ఎందుకు క్రేజ్ వచ్చింది?


నిజానికి ఈ యాప్ 2021లోనే విడుదలైంది. కానీ రీసెంట్‌గా ఈ యాప్‌నకు విపరీతమైన క్రేజ్ వచ్చింది. దీనికి స్వదేశీ పరిజ్ఞానాన్ని ప్రోత్సహించాలని కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పిలుపునివ్వడం ఒక కారణంగా చెప్పొచ్చు. స్వదేశీ డిజిటల్ సొల్యూషన్స్‌ను వాడాలని ఆయన పిలుపునిచ్చిన తర్వాత క్రేజ్ వచ్చిన యాప్‌ల్లో అరట్టైనే నంబర్‌వన్ పొజిషన్‌లోకి వచ్చింది. ఈ యాప్ సోషల్‌మీడియాలోనూ తెగ వైరల్‌గా మారింది. దీంతో కేవలం మూడు రోజుల్లోనే ఈ యాప్‌లో సైన్‌అప్ అయ్యే యూజర్ల సంఖ్యలో 100 శాతం వృద్ధి వచ్చింది. అంతకుముందు రోజుకు 3వేల సైన్‌అప్‌లు ఉండగా.. ఆ తర్వాత 3.5లక్షలకు చేరింది. ఈ విషయాన్ని అరట్టై యాప్ కో ఫౌండర్ శ్రీధర్ వెంబు స్వయంగా తన ట్విట్టర్(ఎక్స్) ఖాతాలో వెల్లడించారు. ఈ గ్రోత్ మరో 100 రెట్లు పెరిగినా సరే సరిపోయేలా సర్వర్లను ఎక్స్‌పాండ్ చేస్తున్నామని తెలిపారు.

## ఈ యాప్ ఫీచర్స్ ఏంటి?

వాట్సాప్ యాప్‌తో పోలిస్తే అరట్టైలో కొత్త ఫీచర్లు ఏమీ లేవు. కాకపోతే యూజర్లకు కావాల్సిన ప్రధాన ఫీచర్లు అయినా టెక్స్ట్, మీడియా ఫైల్ షేరింగ్ ఆప్షన్స్ ఉన్నాయి. అలాగే ఎండ్ టు ఎండ్ ఎన్‌క్రిప్షన్‌తో ఆడియో, వీడియో కాల్స్ చేసుకునే సదుపాయం కలదు. స్టోరీస్ కూడా పోస్టు చేసుకోవచ్చు. ఒకేసారి ఒకటి కంటే ఎక్కువ డివైజ్‌లలో దీన్ని లాగిన్ చేసుకోవచ్చు. డెస్క్‌టాప్ యాప్స్, ఆండ్రాయిడ్ టీవీ ఇంటిగ్రేషన్ కలదు. ఇక యాప్ క్రియేటర్స్‌కు, బిజినెస్ కంపెనీలకు మంచి ఉపయోగకరమనే చెప్పొచ్చు. తమ ఛానళ్ల ద్వారా అప్‌డేట్స్ షేర్ చేసుకునే అవకాశం ఈ యాప్‌లో కల్పించారు. ఈ యాప్‌కు మొగ్గ చూపడానికి మరో కారణం ప్రైవసీ. ఇందులో యూజర్ డేటాను మానిటైజ్ చేయబోమని జోహో కంపెనీ చెప్పడం యూజర్లను తెగ ఆకట్టుకుంటుంది.

## వాట్సాప్‌నకు ప్రత్యామ్నాయం అవుతుందా?

అరట్టై యాప్‌నకు వస్తున్న క్రేజ్ చూసి చాలామంది దీన్ని వాట్సాప్ కిల్లర్‌గా పిలుస్తున్నారు. కానీ 500 మిలియన్‌లకు పైగా యూజర్లు ఉన్న వాట్సాప్‌నకు అరట్టై ఛాలెంజ్ ఇవ్వడం అంత సులువైన విషయం కాదని టెక్ నిపుణులు చెబుతున్నారు. రీసెంట్‌గా ఈ యాప్‌నకు పెరుగుతున్న యూజర్లతో సర్వర్లు మెయింటైన్ చేయడమే ఈ జోహో కంపెనీకి కష్టంగా మారింది. దీనివల్ల ఓటీపీలు ఆలస్యంగా రావడం, కాంటాక్ట్‌లు సింకింగ్ కాకపోవడం, కాల్ ఫెయిల్యూర్ వంటి సమస్యలు ఎదురయ్యాయి. దీన్ని జోహో కూడా అంగీకరించింది. ఆ సమస్యలను రెండు రోజుల్లో పరిష్కరిస్తామని తెలిపింది. ఇక అరట్టై యాప్‌ను కొత్త ఫీచర్లతో నవంబర్‌లో మళ్లీ రిలీజ్ చేయాలని అనుకుంది. కానీ ఇప్పుడొచ్చిన బూమ్‌తో సర్వర్లను బలోపేతం చేయడంపైనే కంపెనీ దృష్టిసారించింది. ఈ సమస్యలు అన్నింటినీ పరిష్కరించి, ఎప్పటికప్పుడు అప్‌డేట్లు, కొత్త ఫీచర్లు చేర్చుకుంటూ వెళ్తే కచ్చితంగా వాట్సాప్‌నకు ప్రత్యామ్నాయంగా మారే అవకాశం ఉందని టెక్ నిపుణులు చెబుతున్నారు.






నేటి శుభోదయ
తెలుగు దినపత్రిక
సోమవారం - 25 -మే - 2026

# ఫైబర్ అధికంగా లభించే ధాన్యాలు ఇవే.. వీటిని తీసుకుంటే ఎంతో మేలు..



ఆహారంలో ఉండే ఫైబర్ (ఱఱమ్ఖతీఎ ఖీఱఎతీవ) శరీరానికి ఎంతో అవసరమైన పోషక పదార్థం. పండ్లు, కూరగాయలు, సంపూర్ణ ధాన్యాలు, పప్పుధాన్యాల్లో ఇది సమృద్ధిగా లభిస్తుంది. జీర్ణక్రియ మెరుగుపరచడం, వ్యర్థాల తొలగింపు, రక్తంలో చక్కెర స్థాయిల నియంత్రణ, కొలెస్ట్రాల్ తగ్గించడం, ఎక్కువసేపు తృప్తిగా ఉంచడం వంటి అనేక ప్రయోజనాలు ఫైబర్ వల్ల లభిస్తాయి. అయితే ఫైబర్ ను చాలా మంది తక్కువగా అంచనా వేస్తారని నిపుణులు చెబుతున్నారు. ధాన్యాలను ఫైబర్ పరిమాణం ఆధారంగా ర్యాంక్ చేస్తూ సరైన ఆహార ఎంపికలు చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఫైబర్ పరంగా ధాన్యాలు ఏయే స్థానాల్లో ఉన్నాయో ఇప్పుడు తెలుసుకుందాం.

## బల్గర్, స్టీల్-కట్ ఓట్స్, పర్ల్ బార్లీ..

ఫైబర్ ఎక్కువగా ఉన్న ఆహారాల్లో మొదటి స్థానంలో బల్గర్ ఉంది. ఇది అధిక ఫైబర్ కలిగిన సంపూర్ణ ధాన్యం. జీర్ణక్రియకు సహాయపడటంతో పాటు, జీర్ణ వ్యవస్థలో మంచి బ్యాక్టీరియాను పెంచుతుంది. తక్కువ క్యాలరీలతో ఎక్కువసేపు తృప్తిగా ఉంచి బరువు నియంత్రణకు దోహదపడుతుంది. సాధారణంగా ఉడికించి తింటారు, అయితే వేయించడం, బేక్ చేయడం లేదా రోస్ట్ చేయడం కూడా చేస్తారు. రెండో స్థానంలో స్టీల్-కట్ ఓట్స్ ఉన్నాయి. వీటిని ఐరిష్ ఓట్స్ అని కూడా అంటారు. ఇవి ఫైబర్, స్టార్చ్ అధికంగా ఉండటంతో బరువు తగ్గేందుకు అనుకూలం. వీటిని వండడానికి 15-20 నిమిషాలు పడుతుంది. పాయసం వంటి వంటకాలకు ఎక్కువగా ఉపయోగిస్తారు. అలాగే మూడో స్థానంలో పర్ల్ బార్లీ ఉంది. ఇది బార్లీ గింజలపై ఉన్న బయటి పొరను తొలగించిన రూపం. సూపులు, స్ట్యూలు, రిసొట్టో వంటి వంటల్లో దీన్ని ఉపయోగిస్తారు. దీని టెక్చర్ మృదువుగా ఉండటంతోపాటు ద్రవాలను గట్టిపరిచే గుణం ఉంది.

## క్వినోవా, వైల్డ్ రైస్, బ్రౌన్ రైస్..

తర్వాత స్థానంలో క్వినోవా ఉంది. ఇది గ్లూటెన్ లేని ప్సూడో-సిరియల్. చాలా ధాన్యాలతో పోలిస్తే దాదాపు రెట్టింపు ఫైబర్ కలిగి ఉంటుంది. జీర్ణక్రియకు మేలు చేయడంతోపాటు, పూర్తి ప్రోటీన్‌గా పనిచేసి ఆకలి నియంత్రణ, రక్త చక్కెర నియంత్రణలో సహాయపడుతుంది. ఆ తరువాత స్థానంలో వైల్డ్ రైస్ ఉంది. ఇది వాస్తవానికి ఒక గడ్డి విత్తనం. సాధారణ తెల్ల బియ్యంతో పోలిస్తే అధిక ఫైబర్, ప్రోటీన్ కలిగి ఉండటంతో పోషకంగా మెరుగైన ఎంపికగా పరిగణిస్తారు. బ్రౌన్ రైస్ కూడా మంచి ఫైబర్ ఉన్న సంపూర్ణ ధాన్యం. ఇది బరువు నియంత్రణ, గుండె ఆరోగ్యం, రక్త చక్కెర నియంత్రణకు సహాయపడుతుంది. పొట్ట చుట్టూ కొవ్వు పేరుకుపోవడం తగ్గించడంలో కూడా ఇది ఉపయోగపడుతుంది. అలాగే పారా బాయిల్డ్ రైస్ అనేది ప్రాసెసింగ్‌కు ముందు గింజను కొంతవరకు మరిగించడం ద్వారా తయారు చేసే బియ్యం. ఈ ప్రక్రియ వల్ల దాని పోషక విలువలు కొంత మెరుగవుతాయి.

## వైట్ రైస్..

ఇక అన్నింటికంటే చివరగా వైట్ రైస్ ఉంది. జాస్మిన్, బాస్మతి వంటి తెల్ల బియ్యాలు ఫైబర్ పరంగా తక్కువగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఫైబర్ తీసుకునే పరిమాణాన్ని ఒక్కసారిగా పెంచకుండా క్రమంగా పెంచాలని నిపుణులు సూచిస్తున్నారు. ప్రతి వారం సుమారు 5 గ్రాముల చొప్పున పెంచడం, తగినంత నీరు తాగడం, భోజనం తరువాత తేలికపాటి శారీరక కదలికలు చేయడం అవసరమని చెప్పారు. ఫైబర్ కేవలం జీర్ణక్రియకే కాదు, మొత్తం మెటబాలిజం ఆరోగ్యానికి మద్దతు ఇస్తుందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

# కోవిడ్ నుంచి కోలుకున్న వారిలో పెరుగుతున్న లంగ్ క్యాన్సర్ కేసులు.. అప్రమత్తంగా ఉండాలని నిపుణుల సూచన..



కోవిడ్-19 దీర్ఘకాలిక ప్రభావాల గురించి ఇప్పటికే అనేక అధ్యయనాలు వెలుగులోకి వచ్చాయి. తీవ్ర అలసట, బ్రెయిన్ ఫాగ్, శ్వాసకోశ సమస్యలు, గుండె సంబంధిత ఇబ్బందులు వంటి సమస్యలు దీని తరువాత కనిపిస్తున్నాయి. తాజాగా జరిగిన ఒక అధ్యయనం ప్రకారం, తీవ్రమైన కోవిడ్-19 లేదా ఇన్ఫ్లుయెంజా వంటి వైరల్ ఇన్ఫెక్షన్లు భవిష్యత్తులో ఊపిరితిత్తుల క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ పరిశోధనను యూనివర్సిటీ ఆఫ్ వర్జీనియా హెల్త్ సిస్టమ్ శాస్త్రవేత్తలు నిర్వహించి, సెల్ అనే జర్నల్‌లో ప్రచురించారు. ఈ అధ్యయనంలో భాగంగా శాస్త్రవేత్తలు ఒక ముఖ్యమైన విషయాన్ని గుర్తించారు. తీవ్రమైన వైరల్ ఇన్ఫెక్షన్లు శరీరంలోని ఇమ్యూన్ కణాలను రీప్రోగ్రామ్ చేస్తాయి. దీని వల్ల ఊపిరితిత్తుల్లో దీర్ఘకాలిక వాపు ఏర్పడి, ట్యూమర్ పెరుగుదలకు అనుకూల వాతావరణం ఏర్పడుతుంది. ఈ పరిస్థితి సంవత్సరాల పాటు కొనసాగవచ్చని పరిశోధకులు వెల్లడించారు.

## ఊపిరితిత్తుల్లో వాపు..

కోవిడ్ లేదా ఫ్లూ తీవ్రంగా వచ్చిన వారికి తరువాత కాలంలో ఊపిరితిత్తుల్లో వాపు కొనసాగుతుందని నిపుణులు చెబుతున్నారు. ఈ పరిస్థితి భవిష్యత్తులో క్యాన్సర్ వచ్చేందుకు దారి తీస్తుందని పేర్కొన్నారు. అయితే టీకాలు తీసుకోవడం వల్ల ఈ ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించవచ్చని నిపుణులు స్పష్టం చేశారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (ఔనూ) ప్రకారం ఊపిరితిత్తుల క్యాన్సర్ ప్రపంచవ్యాప్తంగా క్యాన్సర్ మరణాల్లో అగ్రస్థానంలో ఉంది. పురుషులు, మహిళలు ఇద్దరిలోనూ ఇది అధిక మరణాలకు కారణమవుతోంది. ఎక్కువ సందర్భాల్లో ఈ వ్యాధి ఆలస్య దశల్లో గుర్తించబడడటం వల్ల చికిత్స అవకాశాలు పరిమితం అవుతున్నాయి. అయితే ప్రమాదంలో ఉన్న వ్యక్తులను ముందుగానే స్క్రీనింగ్ చేయడం ద్వారా జీవనావకాశాలను మెరుగుపరచవచ్చని ఔనూ సూచిస్తోంది. ఈ అధ్యయనంలో భాగంగా చేసిన ప్రయోగాల్లో తీవ్రమైన ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్ల నుంచి కోలుకున్న జంతువుల్లో క్యాన్సర్ కేసులు గణనీయంగా పెరిగినట్లు కనిపించింది. అలాగే మనుషులపై సేకరించిన డేటాలో కూడా ఆసుపత్రిలో చికిత్స పొందిన కోవిడ్ రోగుల్లో ఊపిరితిత్తుల క్యాన్సర్ నిర్ధారణ 1.24 రెట్లు ఎక్కువగా ఉన్నట్లు తేలింది. అయితే స్వల్ప ఇన్ఫెక్షన్లు ఈ ప్రమాదాన్ని పెంచలేదని పరిశోధకులు వెల్లడించారు.

## మారుతున్న ఊపిరితిత్తుల కణజాలం..

మరో కీలక అంశంగా తీవ్రమైన వైరల్ న్యుమోనియా ఊపిరితిత్తుల కణజాలాన్ని మారుస్తుందని శాస్త్రవేత్తలు గుర్తించారు. ఇది ప్రో-ట్యూమర్ వాతావరణాన్ని సృష్టించి ట్యూమర్ పెరుగుదలను వేగవంతం చేస్తుంది. ఈ మార్పులు నెలలు లేదా సంవత్సరాల పాటు కొనసాగవచ్చని అధ్యయనం సూచిస్తోంది. ఇప్పటి వరకు పొగ తాగడం వంటి కారణాలు మాత్రమే ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు ప్రమాదంగా భావించారు. అయితే ఈ తాజా ఫలితాల ప్రకారం తీవ్రమైన శ్వాసకోశ వైరల్ ఇన్ఫెక్షన్లను కూడా అదే విధంగా పరిగణించాల్సిన అవసరం ఉందని నిపుణులు వెల్లడించారు. భవిష్యత్తులో ఇలాంటి రోగులకు సిటి స్కాన్ల ద్వారా క్రమం తప్పకుండా పర్యవేక్షణ అవసరం కావచ్చని నిపుణులు సూచించారు.

## టీకాలతో తగ్గుతున్న ప్రమాదం..

జీవశాస్త్ర పరంగా పరిశీలిస్తే తీవ్రమైన ఇన్ఫెక్షన్ల తర్వాత న్యూట్రోఫిల్స్, మాక్రోఫేజ్‌లు వంటి ఇమ్యూన్ కణాలు అసాధారణ స్థితిలోకి మారుతున్నాయి. ఇవి క్యాన్సర్‌ను నిరోధించే శక్తిని తగ్గించి వాపును పెంచుతాయి. అలాగే ఊపిరితిత్తుల కణజాలం కూడా మార్పులకు లోనై, మ్యూటేషన్లకు అనుకూల పరిస్థితులు ఏర్పడతాయి. ఇదిలా ఉంటే టీకాలు ఈ ప్రమాదాన్ని తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని అధ్యయనం వెల్లడించింది. ముందుగా వ్యాక్సిన్ తీసుకున్నవారిలో తీవ్రమైన ఇన్ఫెక్షన్లు తగ్గడంతోపాటు ఊపిరితిత్తుల్లో జరిగే హానికర మార్పులు కూడా తగ్గినట్లు గుర్తించారు. తీవ్రమైన కోవిడ్-19 లేదా ఇతర వైరల్ న్యుమోనియా నుంచి కోలుకున్నవారు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. ముఖ్యంగా పొగ తాగే అలవాటు ఉన్నవారు లేదా ఇతర ప్రమాద కారకాలు ఉన్నవారు వైద్యుల పర్యవేక్షణలో క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవడం అవసరం. టీకాలు తీసుకోవడం ద్వారా కేవలం తక్షణ రక్షణ మాత్రమే కాకుండా, దీర్ఘకాలిక ఆరోగ్య ప్రమాదాలను కూడా తగ్గించుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

# జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచే పానీయాలు ఇవి.. ఎలా తయారు చేయాలంటే..?



ఆహార జీర్ణక్రియలో కీలక పాత్ర పోషించే జీర్ణాశయం లేదా గ్యాస్ట్రోఇంటెస్టినల్ (+×) ట్రాక్ట్ ప్రధానంగా ఆహారాన్ని జీర్ణం చేయడం, పోషకాలను శోషించడం, వ్యర్థాలను బయటకు పంపించడం వంటి పనులు నిర్వహిస్తుంది. అయితే దీని పాత్ర కేవలం జీర్ణక్రియకు మాత్రమే పరిమితం కాదు. నిపుణుల అభిప్రాయం ప్రకారం జీర్ణ వ్యవస్థ ఆరోగ్యం రోగనిరోధక శక్తి, మెటబాలిజం, మానసిక ఆరోగ్యంపై కూడా గణనీయమైన ప్రభావం చూపిస్తుంది. జీర్ణ వ్యవస్థలో లక్షల కోట్ల సూక్ష్మజీవులు నివసిస్తాయి, వీటిని కలిపి గట్ మైక్రోబియోమ్ అని పిలుస్తారు. వీటినే మంచి బ్యాక్టీరియా అని కూడా అంటారు. ఈ సూక్ష్మజీవులు ఆహారాన్ని విచ్ఛిన్నం చేయడంలో సహాయపడటమే కాకుండా, శరీరానికి రక్షణ వ్యవస్థగా కూడా పనిచేస్తాయి. అందుకే జీర్ణ వ్యవస్థ ఆరోగ్యం దెబ్బ తింటే, వ్యక్తి మొత్తం ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపిస్తుంది.

## జీర్ణక్రియ వల్లనే రావు..

అయితే పోషకాహార నిపుణులు తెలిపిన ప్రకారం అనేక జీర్ణ వ్యవస్థ సమస్యలు కేవలం జీర్ణక్రియ కారణంగానే రావాల్సిన అవసరం లేదు. చాలా జీర్ణ వ్యవస్థ లక్షణాలు కేవలం తప్పు జీర్ణక్రియ వల్ల మాత్రమే రావు అని నిపుణులు చెబుతున్నారు. హైడ్రేషన్, మ్యూకోసల్ రక్షణ, కొన్ని ఫైటోకెమికల్స్ వంటి అంశాలు కూడా కీలక పాత్ర పోషిస్తాయి. ఈ అంశాలు ఆంత్రం గోడ సమగ్రతను, జీర్ణ వ్యవస్థ పనితీరును మెరుగుపరచడంలో సహాయపడతాయి. ఆంత్రం గోడను బలపరచడం, జీర్ణ వ్యవస్థ పనితీరును మెరుగుపరచడం కోసం ఆ వ్యవస్థకు మద్దతు ఇచ్చే గుణాలు కలిగిన పదార్థాలతో తయారయ్యే రెండు ఫంక్షనల్ డ్రింక్స్ రెసిపీలు ఇలా ఉన్నాయి.

## కలబంద, కొబ్బరి నీళ్ల పానీయం..

మొదటి పానీయం విషయానికి వస్తే.. అలో-కోకోనట్ గట్ సూతింగ్ డ్రింక్ గా దీన్ని చెప్పవచ్చు. దీనికి 200 మిల్లీలీటర్ల కొబ్బరి నీరు, 2 టేబుల్ స్పూన్ల తాజా అలోవెరా జెల్, 5-6 తాజా పుదీనా ఆకులు తీసుకోవాలి. ఈ పదార్థాలను 10 నుంచి 15 సెకన్ల పాటు బ్లెండ్ చేసి తాజాగా ఉన్నప్పుడే తాగాలి. అలొవెరాలో ఉండే ఆసెమానన్ వంటి పాలిశాకరైడ్లు ఆంత్రం మ్యూకోసల్ సమగ్రతను కాపాడడంలో సహాయపడతాయి. అలాగే దానిలో యాంటీ-ఇన్ఫ్లమేటరీ లక్షణాలు ఉంటాయి. అదనంగా కొబ్బరి నీరు ఎలక్ట్రోలైట్స్, తగిన హైడ్రేషన్‌ను అందిస్తాయి. ఇవి సాధారణ గ్యాస్ట్రోఇంటెస్టినల్ పనితీరుకు ముఖ్యం. మరోవైపు పుదీనా ఆకుల్లో ఉండే మెంథాల్ గ్యాస్ట్రోఇంటెస్టినల్ స్మూత్ మజిల్స్‌ను సడలించడంలో సహాయపడుతుంది.

## అతి మధురం, సోంపు గింజల టీ..

రెండవ పానీయంగా లికోరైస్-ఫెన్నెల్ గట్ సపోర్ట్ టీ ని చెప్పవచ్చు. దీనికి ఒక కప్పు నీరు, పావు టీ స్పూన్ లికోరైస్ రూట్ పొడి (అతి మధురం), అర టీ స్పూన్ సోంపు గింజలు, అర టీ స్పూన్ తురిమిన అల్లం తీసుకోవాలి. ఈ పదార్థాలను 5 నుంచి 7 నిమిషాల పాటు మరిగించి వడకట్టి గోరువెచ్చగా తాగాలి. లికోరైస్ రూట్‌లో గ్లైసిర్రిజిన్, ఫ్లేవనాయిడ్లు ఉండి ఇవి గ్యాస్ట్రిక్, ఆంత్రం మ్యూకోసల్ రక్షణకు సహాయపడతాయి. అదనంగా సోంపు గింజల్లో ఉండే అనెథోల్ ఆంత్రం కండరాల సంకోచాలను తగ్గించి గ్యాస్ ఏర్పడటాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. అలాగే,అల్లంలో ఉండే జింజరాల్స్ గ్యాస్ట్రిక్ మొటిలిటీని మెరుగుపరచడంలో, జీర్ణక్రియను సౌకర్యవంతంగా మార్చడంలో సహాయపడతాయి. ఈ రెండు పానీయాలను సులభంగా తయారు చేసుకోవచ్చు. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి ఈ పానీయాలు ఎంతో మేలు చేస్తాయని వైద్య నిపుణులు చెబుతున్నారు

# మొలకలను మీరు ఎలా తింటున్నారు..? నేరుగా తినకూడదు, ఎందుకంటే..?

మొలకలు (స్ప్రౌట్స్) ఆరోగ్యకరమైన ఆహారంగా చాలా కాలంగా మంచి పేరు సంపాదించుకున్నాయి. సలాడ్లు, చాట్స్, బ్రేక్‌ఫాస్ట్ బౌల్స్‌లో వీటిని ఎక్కువగా ఉపయోగిస్తారు. ఎక్కువగా ముడిగా తింటేనే ఆరోగ్యానికి మంచిదని చాలా మంది భావిస్తారు. బరువు తగ్గేందుకు, క్లీన్ ఈటింగ్ డైట్‌లో కూడా స్ప్రౌట్స్‌ను విస్తృతంగా సూచిస్తారు. అయితే ఆహారం ఎంత ముఖ్యమో దాన్ని ఎలా తీసుకుంటామన్నది కూడా అంతే ముఖ్యమని నిపుణులు చెబుతున్నారు. స్ప్రౌట్స్ పోషకాలను కలిగి ఉన్నప్పటికీ, ప్రతిరోజూ ముడిగా తినడం మంచిది కాకపోవచ్చునని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ముడి మొలకలు తినడంలో ఒక ముఖ్యమైన సమస్య బ్యాక్టీరియా ప్రమాదం. మొలకలు వేడి, తేమ ఉన్న వాతావరణంలో పెరుగుతాయి. ఇదే పరిస్థితులు ఈ.కోలి, సాల్మొనెల్లా వంటి హానికర బ్యాక్టీరియా పెరగడానికి అనుకూలంగా ఉంటాయి.భారతీయ వంటకాలు

## ప్రోటీన్‌కు ప్రధాన వనరు కాదు..

మొలకలు తయారీ సమయంలో కలుషితం అయితే ఈ బ్యాక్టీరియా వేగంగా పెరిగే అవకాశం ఉంటుంది. కేవలం నీటితో కడగడం వల్ల ఇవి పూర్తిగా తొలగిపోవని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అందుకే మొలకలను తేలికగా ఆవిరి పట్టించడం లేదా వేయించడం ద్వారా తినడం సురక్షితమైన మార్గంగా భావిస్తున్నారు. స్ప్రౌట్స్‌ను ప్రోటీన్ అధికంగా ఉండే ఆహారంగా చాలా మంది భావిస్తారు. అయితే ఇది పూర్తిగా నిజం కాదని కూడా నిపుణులు చెబుతున్నారు. 100 గ్రాముల స్ప్రౌట్స్‌లో కేవలం 3-4 గ్రాముల ప్రోటీన్ మాత్రమే ఉంటుంది. ఇది ఇతర ప్రోటీన్ వనరులతో పోలిస్తే తక్కువ. అందువల్ల స్ప్రౌట్స్‌ను ప్రధాన ప్రోటీన్ వనరుగా కాకుండా, ఉపాహారంగా మాత్రమే తీసుకోవడం మంచిది. సరైన ప్రోటీన్ కోసం పప్పులు, పనీర్, గుడ్లు, టోఫు, శనగలు వంటి ఆహారాలను తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఆరోగ్యకరమైన ఆహారం

## సున్నితమైన జీర్ణ వ్యవస్థ ఉంటే..

అంతేకాకుండా ముడి మొలకలు జీర్ణక్రియపై కూడా ప్రభావం చూపవచ్చు. వీటిలో అధికంగా ఫైబర్, ఫెర్మెంటబుల్ కార్బోహైడ్రేట్లు ఉండటం వల్ల కొందరికి జీర్ణ సమస్యలు రావచ్చు. ముఖ్యంగా సున్నితమైన జీర్ణ వ్యవస్థ ఉన్నవారికి లేదా ×దీూ వంటి సమస్యలు ఉన్నవారికి ఉబ్బరం, గ్యాస్, కడుపు నొప్పి వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. కనుక మొలకలను తేలికగా వండి తీసుకోవడం వల్ల సులభంగా జీర్ణమవుతాయి.

## ఎలా తినాలి..?

మొలకలను నిల్వ చేయడం కూడా చాలా ముఖ్యమైన విషయం.



ఫ్రిజ్‌లో ఉంచడం వల్ల బ్యాక్టీరియా పెరుగుదల కొంత వరకు తగ్గుతుంది, కానీ పూర్తిగా ఆగదు. అందుకే మొలకలను ఫ్రిజ్‌లో ఉంచి 24 నుంచి 48 గంటల్లోపే ఉపయోగించడం మంచిది. ఎక్కువ రోజుల పాటు నిల్వ ఉంచితే అవి చెడిపోయే ప్రమాదం ఉంటుంది. స్ప్రౌట్స్ పోషకాలు ఉన్న ఆహారం అయినప్పటికీ, వాటిని ఎలా తింటామన్నది చాలా ముఖ్యం. ముడిగా కాకుండా తేలికగా వండి తినడం, సరైన విధంగా నిల్వ చేయడం ద్వారా వాటి ప్రయోజనాలను సురక్షితంగా పొందవచ్చని పోషకాహార నిపుణులు తెలియజేస్తున్నారు.

# ప్రోటీన్లను అధికంగా తీసుకుంటే కిడ్నీలకు నష్టమే.. ఏం జరుగుతుందంటే..?



ప్రోటీన్ శరీర నిర్మాణానికి అత్యంత అవసరమైన పోషక పదార్థం. ఇది కండరాల పెరుగుదల, కణజాలాల పునరుద్ధరణ, అలాగే శరీరంలోని అనేక కీలక విధులను సక్రమంగా నిర్వహించడంలో ముఖ్య పాత్ర పోషిస్తుంది. ఇటీవలి కాలంలో బరువు తగ్గడం, కండరాలను పెంచుకోవడం లేదా ఫిట్‌నెస్ లక్ష్యాల కోసం హై-ప్రోటీన్ డైట్‌లు విస్తృతంగా ప్రాచుర్యం పొందాయి. అయితే, అవసరానికి మించి ప్రోటీన్‌ను దీర్ఘకాలం తీసుకోవడం వల్ల కిడ్నీలపై ఒత్తిడిని పెంచే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కిడ్నీలు రక్తాన్ని శుద్ధి చేసి వ్యర్థాలను బయటకు పంపే ముఖ్య అవయవాలు. శరీరం ప్రోటీన్‌ను విభజించే సమయంలో నైట్రోజన్, యూరియా, క్రియాటినిన్ వంటి వ్యర్థ పదార్థాలు ఉత్పత్తి అవుతాయి. ఈ పదార్థాలను తొలగించేందుకు కిడ్నీలు ఎక్కువగా పనిచేయాల్సి వస్తుంది. ప్రోటీన్ తీసుకునే పరిమాణం పెరిగితే కిడ్నీలపై పడే పని కూడా పెరుగుతుంది. ఆరోగ్యవంతమైన కిడ్నీలు కొంతవరకు దీనిని తట్టుకోగలిగినా, దీర్ఘకాలంలో అధిక ప్రోటీన్ వినియోగం కిడ్నీ నష్టం కలిగించే అవకాశం ఉంది.

## దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధి వచ్చే అవకాశం..

ఇప్పటికే కిడ్నీ సంబంధిత సమస్యలు ఉన్నవారికి హై-ప్రోటీన్ ఆహారం మరింత ప్రమాదకరం. ఎక్కువ ప్రోటీన్ తీసుకోవడం వల్ల కిడ్నీలు శుద్ధి చేయాల్సిన వ్యర్థాలు పెరుగుతాయి. ఇది కిడ్నీ పనితీరును మరింత దెబ్బతీసే అవకాశం ఉంటుంది. అందుకే దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధి (జఖఐ) ఉన్నవారికి వైద్యులు సాధారణంగా మితమైన ప్రోటీన్ తీసుకోవాలని సూచిస్తారు. ప్రస్తుతం ప్రోటీన్ పౌడర్లు, సప్లిమెంట్ల వాడకం పెరిగింది. ముఖ్యంగా బాడీ బిల్డింగ్ చేసే వారు వీటిని అధికంగా తీసుకునే సందర్భాలు కనిపిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రోటీన్ అధికంగా తీసుకోవడం వల్ల కిడ్నీ పనితీరు తగ్గిపోవడం, మూత్రంలో ప్రోటీన్ వెలువడటం (ప్రోటీన్యూరియా) వంటి సమస్యలు తలెత్తవచ్చు. అదనంగా డీహైడ్రేషన్, కిడ్నీ రాళ్లు, ఎలక్ట్రోలైట్ అసమతుల్యత వంటి సమస్యలు కూడా వచ్చే ప్రమాదం ఉంది.

## వైద్యుల సలహా అవసరం..


కనుక హై-ప్రోటీన్ డైట్ విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా కిడ్నీ వ్యాధిగ్రస్తులు, మధుమేహం లేదా అధిక రక్తపోటు ఉన్నవారు, వృద్ధులు, అలాగే ప్రోటీన్ సప్లిమెంట్లు వాడేవారు తప్పనిసరిగా వైద్యుల సలహా తీసుకోవాలి. ప్రోటీన్ శరీరానికి అవసరమైనప్పటికీ, దాన్ని సమతుల్యంగా తీసుకోవడం అత్యంత ముఖ్యం. వ్యక్తి బరువు, జీవనశైలి, శారీరక శ్రమను బట్టి రోజువారీ ప్రోటీన్ అవసరం మారుతుంది. కూరగాయలు, పండ్లు, ధాన్యాలు, మంచి కొవ్వులు వంటి ఇతర పోషకాలతో కూడిన సమతుల ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. కిడ్నీ ఆరోగ్యాన్ని కాపాడేందుకు పరీక్షలు చేయించుకోవడం కూడా అవసరం. ముఖ్యంగా క్రియాటినిన్, వ+ఖీ=, మూత్ర పరీక్షలు చేయించుకోవడం ద్వారా కిడ్నీ పనితీరును అంచనా వేయవచ్చు. హై-ప్రోటీన్ డైట్ తీసుకునే వారు ఈ పరీక్షలను తప్పనిసరిగా చేయించుకోవడం మంచిది. మొత్తానికి ప్రోటీన్ అవసరం ఉన్నప్పటికీ అధికంగా తీసుకోవడం కిడ్నీలకు హానికరం కావచ్చని వైద్యులు సూచిస్తున్నారు.

# మెదడుకు అసలైన విశ్రాంతి ఇవ్వడం అంటే ఏంటి.. ఏం చేయాలి..?

ఇప్పటి వేగవంతమైన జీవనశైలిలో చాలామంది మానసికంగా అలసిపోయాం అని చెబుతుంటారు. అయితే ఈ అనుభూతి నిజమైన అలసట కాకపోవచ్చు. ఎక్కువ సందర్భాల్లో అది జ్ఞానాత్మక ఒత్తిడి (కాగ్నిటివ్ ఓవర్లోడ్) అయి ఉండవచ్చు. ఉదయం లేవగానే మెదడు సమాచారం ప్రాసెస్ చేయడం ప్రారంభిస్తుంది. నోటిఫికేషన్లు, మెసేజ్‌లు, సంభాషణలు, పనుల గడువులు, చుట్టూ ఉండే శబ్దం, డిజిటల్ కంటెంట్ వంటివన్నీ దృష్టిని ఆకర్షిస్తాయి. శారీరక అలసటలా ఇది స్పష్టంగా కనిపించదు. మెదడు ఇప్పటికే తీసుకున్న సమాచారాన్ని ప్రాసెస్ చేయకముందే మరిన్ని ఇన్‌పుట్‌లను స్వీకరిస్తూనే ఉంటుంది. ఈ నిరంతర ఉద్దీపన ప్రభావం కాలక్రమేణా బయటపడుతుంది. దృష్టి లోపించడం, నిర్ణయాలు తీసుకోవడంలో ఆలస్యం, చిరాకు, సృజనాత్మకత తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. చాలా మంది దీనిని మెంటల్ డ్రెయిన్ గా భావించినా, అసలు కారణం మెదడుపై అధిక సమాచారం భారం పడటమే.

## నిరంతరం పనిచేయదు..

మనిషి మెదడు నిరంతరం పని చేయడానికి రూపొందించబడలేదు. శరీర కండరాలకు విశ్రాంతి అవసరమైనట్లే, మెదడుకూ విరామం అవసరం. ఈ విరామాలు సమాచారాన్ని సరిచేయడానికి, భావోద్వేగాలను నియంత్రించడానికి, ఆలోచనలను క్రమబద్ధం చేయడానికి సహాయపడతాయి. అయితే చాలామంది



సోషల్ మీడియా స్క్రోలింగ్ లేదా టీవీ చూడడాన్ని విశ్రాంతిగా భావిస్తారు. కానీ ఇవి కూడా మెదడును ఉద్దీపన చేస్తాయి. చిత్రాలు, శబ్దాలు, సమాచారం వంటివి మెదడును పనిచేయించే కారణంగా, ఇది నిజమైన విశ్రాంతి కాదని నిపుణులు చెబుతున్నారు.

## ఏం చేయాలి..

మెదడుకు నిజమైన విశ్రాంతి ఇవ్వాలంటే ఉద్దేశపూర్వకంగా నిశ్శబ్ద సమయాన్ని కేటాయించాలి. నిశ్శబ్దంగా కూర్చోవడం, శ్వాసపై దృష్టి పెట్టడం, ధ్యానం చేయడం, ప్రకృతిలో గడపడం, లేదా ఎలాంటి అంతరాయం లేకుండా ఆలోచనలను స్వేచ్ఛగా ప్రవహించనివ్వడం వంటి చర్యలు మెదడును రీసెట్ చేయడంలో సహాయపడతాయి. అదేవిధంగా నాణ్యమైన నిద్ర కూడా మానసిక శక్తిని పునరుద్ధరించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. మెదడుకు సరైన విశ్రాంతి లేకుండా నిరంతరం పని చేయిస్తే శరీరం స్ట్రెస్ హార్మోన్లను విడుదల చేస్తూనే ఉంటుంది. దీని వల్ల నర వ్యవస్థ ఎప్పుడూ అప్రమత్త స్థితిలో ఉంటుంది. ఈ ఒత్తిడి తక్కువగా అనిపించినా, దీర్ఘకాలంలో మానసిక, శారీరక ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో చిరాకు, మతిమరుపు, భావోద్వేగ అలసట వంటి సమస్యలు పెరుగుతాయి. మరోవైపు సమయానుకూలంగా విరామాలు తీసుకుంటే దృష్టి పెరుగుతుంది, భావోద్వేగ స్థిరత్వం మెరుగుపడుతుంది, సవాళ్లను సమర్థంగా ఎదుర్కోగల సామర్థ్యం పెరుగుతుంది.

## అలా చేయడం సోమరితనం కాదు..

ఎప్పుడూ బిజీగా ఉండడాన్ని గొప్పగా భావించే సమాజంలో కొంతసేపు ఆగడం చాలా మందికి అసౌకర్యంగా అనిపిస్తుంది. విశ్రాంతి తీసుకుంటే పనితీరు తగ్గుతుందని భావిస్తారు. కానీ నిజానికి ఇది తప్పు అభిప్రాయమని నిపుణులు చెబుతున్నారు. లోతైన విశ్రాంతి సోమరితనం కాదు, అది మెదడుకు అవసరమైన మద్దతు. శారీరక శ్రమ తర్వాత కండరాలు ఎలా పునరుద్ధరించబడతాయో, అలాగే మెదడుకూ విశ్రాంతి అవసరం. సరైన విశ్రాంతి తీసుకున్నప్పుడు, మనుషులు మరింత ఉత్సాహంతో, స్పష్టమైన ఆలోచనలతో, మెరుగైన పనితీరుతో తిరిగి పనిలోకి ప్రవేశిస్తారని నిపుణులు సూచిస్తున్నారు.

## నిజంగా రాముడే దిగొచ్చాడా అనుకున్నా!



బాలీవుడ్ లో అత్యంత భారీ బడ్జెట్‌తో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతోన్న చిత్రం -రామాయణ్-. నితేష్ తివారీ దర్శకత్వంలో రూపొందుతున్న పౌరాణిక గాథపై అంచనాలు ఆకాశాన్నంటుతున్నాయి. ముఖ్యంగా సినిమాలో శ్రీరాముడిగా రణబీర్ కపూర్ నటిస్తుండటంతో ఆయన పాత్ర ఎలా ఉండబోతుందా అని ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలో సెట్‌లో రణబీర్‌ను రాముడి గెటప్‌లో చూసిన నటి సురభి దాస్ చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. - అత్యంత క్రూరమైన మృణాల్‌ని చూపిస్తాడట! సినిమాలో కీలక పాత్ర పోషిస్తున్న సురభి దాస్ షూటింగ్ సెట్‌లో రణబీర్ కపూర్‌ను చూసిన మొదటి క్షణాన్ని గుర్తు చేసుకున్నారు. రణబీర్ రాముడి గెటప్‌లో నడుచుకుంటూ వస్తుంటే ఒక్క క్షణం తాను తన కళ్ళను తానే నమ్మలేకపోయానని వెల్లడించారు. -నిజంగా ఆ శ్రీరాముడే సాక్షాత్తు భూమి మీదకు దిగి వచ్చాడా అన్నంత గొప్పగా రణబీర్ ఆహార్యం ఉందని మనసులో అనుకున్నాను. ఆయన కళ్ళలో ప్రశాంతత, గంభీరమైన రూపం చూసి తాను మంత్రముగ్ధురాలినయ్యానని పేర్కొన్నారు. - ఆలస్యమవుతున్న సర్దార్ 2 రిలీజ్ లేట్.. అసలు కారణం ఏమిటి? రణబీర్ కపూర్ ఈ పాత్ర కోసం ఎంతగానో శ్రమిస్తున్నారు. కేవలం బాహ్యరూపం మాత్రమే కాకుండా? శ్రీరాముడి వ్యక్తిత్వాన్ని ఆకళింపు చేసుకోవడానికి మాంసాహారాన్ని మానేసి, మద్యానికి దూరంగా ఉంటూ కఠినమైన నియమాలు పాటిస్తున్నారు. ఈ క్రమశిక్షణే ఆయన ముఖంలో ప్రత్యేకమైన తేజస్సును తీసుకువచ్చిందని, అది సెట్‌లోని అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోందని సురభి వ్యాఖ్యానించారు. నటుడిగా రణబీర్ తనను తాను మలుచుకున్న తీరు అద్భుతమని ఆమె కొనియాడారు. - టెక్ గురూ సంచలనం: టాలీవుడ్ నిర్మాతలు భయపడుతున్నారు! దర్శకుడు నితేష్ తివారీ ఈ చిత్రంలోని ప్రతి పాత్రను, ప్రతి సన్నివేశాన్ని అత్యంత సహజంగా, భక్తిభావం ఉట్టిపడేలా తీర్చిదిద్దుతున్నారు. విజువల్ ఎఫెక్ట్స్ , సెట్స్ పరంగా ఎక్కడా రాజీ పడకుండా అంతర్జాతీయ ప్రమాణాలతో రామాయణ్ రూపొందుతోంది. ఇప్పటికే సోషల్ మీడియాలో లీక్ అయిన కొన్ని ఫోటోలు రణబీర్ లుక్‌పై పాజిటివ్ వైబ్స్‌ను క్రియేట్ చేయగా తాజాగా సురభి దాస్ చెప్పిన విషయాలు అభిమానుల్లో ఉత్కంఠను మరింత పెంచాయి. శ్రీరాముడిగా రణబీర్ కపూర్, సీతగా సాయి పల్లవి నటిస్తోన్న ఈ సినిమా భారతీయ సినీ చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోతుందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. - ఇష్టమైన ఫ్లాట్ ను పైలెట్ కు అద్దెకు ఇచ్చిన హీరో! ఒక నటుడు తన పాత్రలో ఎంతగా లీనమైతే సెట్‌లోని తోటి నటీనటులు కూడా అంతటి ఆశ్చర్యానికి లోనవుతారో చెప్పడానికి సురభి దాస్ మాటలే నిదర్శనం. అలాగే సినిమాలో రణబీర్ కపూర్ - సాయి పల్లవిల మధ్య కెమిస్ట్రీ కూడా అద్భుతంగా పండనుందని సురభి దాస్ హింట్ ఇచ్చారు. వీరిద్దరూ ఆయా పాత్రల కోసం ప్రాణం పెట్టి నటిస్తున్నారని, సెట్‌లో వారి మధ్య జరిగే సంభాషణలు మరియు భావోద్వేగ సన్నివేశాలు ప్రేక్షకులను ఒక సరికొత్త లోకానికి తీసుకెళ్తాయని

## అత్యంత క్రూరమైన మృణాల్‌ని చూపిస్తాడంట!

**ప్రస్తుతం అనురాగ్ కశ్యప్ కేవలం దర్శకత్వానికే పరిమితం కాకుండా..**

**నటుడిగా కూడా దక్షిణాదిన బిజీగా మారుతున్నారు.**




టాలీవుడ్‌లో -సీతారామం-, -హాయ్ నాన్న- వంటి సినిమాలతో పద్ధతిగా.. సున్నితంగా కనిపించే పాత్రలకే పరిమితమైన మృణాల్ ఠాకూర్‌ను భవిష్యత్తులో అత్యంత క్రూరమైన- తీవ్రమైన పాత్రలో చూపించబోతున్నట్లు ప్రముఖ దర్శకుడు అనురాగ్ కశ్యప్ హింట్ ఇచ్చారు. మృణాల్ కోసం ఒక సరికొత్త.. అసాధారణమైన కథాంశం తన దగ్గర ఉందని ఈ నటిలోని నటనను మరో కోణంలో ఆవిష్కరించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని ఆయన పేర్కొన్నారు. ఈ వార్త సోషల్ మీడియాలో వైరల్ కావడంతో కొందరు నెటిజన్లు సరదాగా --మృణాల్ కెరీర్‌ను అనురాగ్ మార్చేయబోతున్నారు-- అంటూ కామెంట్స్ చేస్తున్నారు.- రెండేళ్ల వరకూ కెప్టెన్ కుర్చీకి దూరంగా!ప్రస్తుతం అనురాగ్ కశ్యప్ కేవలం దర్శకత్వానికే పరిమితం కాకుండా.. నటుడిగా కూడా దక్షిణాదిన బిజీగా మారుతున్నారు. ఇటీవల విడుదలైన -డెకాయిట్- చిత్రంలో అతడి రియలిస్టిక్ నటనకు విమర్శకుల నుంచి ప్రశంసలు దక్కుతున్నాయి. దక్షిణాదిన ఆయన పోషించిన నెగటివ్ షేడ్స్ ఉన్న పాత్రలు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. తెలుగులో కూడా ఆయనకు క్రేజ్ పెరుగుతుండటంతో టాలీవుడ్‌లో మరిన్ని క్రేజీ ప్రాజెక్టుల్లో ఆయన భాగం కాబోతున్నారని సమాచారం. ముఖ్యంగా గ్యాంగ్‌స్టర్ డ్రామాల్లో అతడి విలక్షణమైన బాడీ లాంగ్వేజ్‌కు దర్శకులు ప్రాధాన్యతనిస్తున్నారు. - నిజంగా రాముడే దిగొచ్చాడా అనుకున్నా! దక్షిణాదిన తమిళ చిత్ర పరిశ్రమలో కూడా అనురాగ్ కశ్యప్ తనదైన ముద్ర వేస్తున్నారు. ఇప్పటికే విజయ్ సేతుపతి -మహారాజా- వంటి చిత్రాల్లో విలన్‌గా మెప్పించిన ఆయన మరికొన్ని భారీ తమిళ సినిమాల్లో కీలక పాత్రలకు సంతకం చేశారు. అలాగే మలయాళ చిత్రాల్లోనూ ఆయన ప్రవేశం ఉంటుందని టాక్ వినిపిస్తోంది. ఒకవైపు బాలీవుడ్‌లో కల్ట్ సినిమాలకు కేరాఫ్ అడ్రస్‌గా ఉంటూనే మరోవైపు సౌత్ సినిమాల్లో నటుడిగా తన రెండో ఇన్నింగ్స్‌ను అద్భుతంగా కొనసాగిస్తున్నారు. - ఆలస్యమవుతున్న సర్దార్ 2 రిలీజ్ లేట్.. అసలు కారణం ఏమిటి? ఇక మృణాల్ ఠాకూర్ కెరీర్ విషయానికి వస్తే... ఈ ట్యాలెంటెడ్ బ్యూటీ ప్రస్తుతం పలు ఆసక్తికరమైన ప్రాజెక్టులతో బిజీగా ఉంది. తెలుగులో నాని, విజయ్ దేవరకొండ వంటి హీరోలతో నటించిన తర్వాత ఇప్పుడు బాలీవుడ్ - సౌత్ మధ్య బ్యాలెన్స్ చేస్తోంది. ఇటీవల దేవగన్ సరసన నటించిన -సన్ ఆఫ్ సర్దార్ 2- కూడా విడుదలైంది. కొన్ని తమిళ ప్రాజెక్టులు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా.. నటనకు ప్రాధాన్యత ఉన్న వైవిధ్యమైన పాత్రలను మృణాల్ ఎంచుకుంటోంది. - టెక్ గురూ సంచలనం: టాలీవుడ్ నిర్మాతలు భయపడుతున్నారు! మృణాల్ ఠాకూర్ ప్రస్తుతం తన కెరీర్‌లో అత్యంత బిజీ దశలో ఉంది, ఆమె చేతిలో వైవిధ్యమైన హిందీ ప్రాజెక్టులు ఉన్నాయి. వరుణ్ ధావన్ సరసన డేవిడ్ ధావన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న -హై జవానీ తో ఇష్క్ హోనా హై- ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉండగా.. ఇందులో సరికొత్త గ్లామరస్ రోల్‌లో కనిపించబోతోంది. అలాగే ఎంతో కాలంగా నిరీక్షిస్తున్న సస్పెన్స్ థ్రిల్లర్ -పూజా మేరీ జాన్- ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులను జరుపుకుంటోంది. ఇందులో మృణాల్ టైటిల్ పాత్రను పోషిస్తోంది. వీటితో పాటు 2027లో విడుదలకు సిద్ధమవుతున్న -రాకా- అనే భారీ ప్రాజెక్టులో బన్నీతో కలిసి నటిస్తోంది. ఈ భారీ చిత్రాలు మృణాల్ ను గ్లామ్ బిజ్ లో మరింత సుస్థిరమైన స్థానంలో నిలబెడతాయని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. అంతేకాదు... అనురాగ్ కశ్యప్ వంటి దర్శకుడు మృణాల్‌ను -బ్రూటల్-గా చూపిస్తానంటే తన కెరీర్‌లో అదొక మేలిమలుపు కావడం ఖాయం. ఒక క్లాసిక్ బ్యూటీగా పేరు తెచ్చుకున్న మృణాల్..అనురాగ్ ప్రపంచంలో క్రూరమైన పాత్రలో ఎలా ఒదిగిపోతుందో చూడాలని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ కాంబినేషన్ సెట్స్ పైకి వెళ్తే వినోద రంగంలో అది మరో సంచలనమే అవుతుంది.

### ఫ్రాన్స్ యానిమేషన్ ఫెస్టివల్‌లో

## యానిమేషన్ బాహుబలి


**భారతీయ చిత్ర పరిశ్రమకు దక్కిన గుర్తింపు అన్న రాజమౌళి**




రాజమౌళి సృష్టించిన 'బాహుబలి' మరో ఘనతను సొంతం చేసుకుంది. ఆయన రూపొందించిన 'బాహుబలి' ఫ్రాంచైజీ నుంచి వస్తున్న సరికొత్త యానిమేషన్ చిత్రం 'బాహుబలి: ద ఎటర్నల్ వార్' . 2027లో ఇది ప్రేక్షకుల ముందుకురానుంది. తాజాగా ఈ చిత్రం ఒక అరుదైన మైలురాయిని చేరుకుంది. ఫ్రాన్స్‌లో జరగనున్న ప్రతిష్ఠాత్మక ఎన్నెసి యానిమేషన్ ఫెస్టివల్ 2026 లోని 'వర్క్ ఇన్ ప్రోగ్రెస్' విభాగంలో ప్రదర్శనకు అధికారికంగా ఎంపికైంది. దీనిపై రాజమౌళి ఆనందం వ్యక్తంచేశారు. యానిమేషన్ అనేది హద్దులు లేని అద్భుతమైన ప్రపంచమనే విషయాన్ని నేను ఎప్పుడూ నమ్ముతానని ఈ సందర్భంగా అన్నారు. ఇది మన భారతీయ సినిమాకి దక్కిన ఒక అరుదైన గౌరవంగా భావిస్తున్నా. ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన యానిమేషన్ వేదికపై ఈ సినిమాను ప్రదర్శించే అవకాశం రావడం మాకెంతో ఆనందంగా ఉంది. దీనికోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాం అని రాజమౌళి పోస్ట్ పెట్టారు. యానిమేషన్ రంగంలో ఈ ఫెస్టివల్‌ను 'యానిమేషన్ ప్రపంచపు కేన్స్ ఫెస్టివల్'గా పరిగణిస్తారు. భారతీయ యానిమేషన్ సత్తాను ప్రపంచ వేదికపై చాటిచెప్పేందుకు ఇదొక గొప్ప అవకాశంగా సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. అమరేంద్ర బాహుబలి మరణం తర్వాత జరిగే పరిణామాల నేపథ్యంలో దీన్ని రూపొందిస్తున్నారు. దాదాపు రూ.120 కోట్ల భారీ బడ్జెట్‌తో 'ఆర్కా మీడియా వర్క్స్' ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది.

## సంక్రాంతికి సీనియర్ హీరోల మధ్య వార్!

### మరోవైపు నందమూరి బాలకృష్ణ - గోపీచంద్ మలినేని కాంబినేషన్ కూడా సంక్రాంతి రేసులోకి వచ్చేందుకు సిద్ధమవుతోంది.



2027 సంక్రాంతి సీజన్ రిలీజ్ డేట్లపై అప్పుడే కర్చీఫ్ వేయడం మొదలైంది. సినిమా ప్రారంభానికి ముందే సంక్రాంతి రిలీజ్ అంటూ పోస్టర్లు వేసి మరీ డేట్లు లాక్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సీనియర్ హీరోలు కూడా ఎక్కడా తగ్గడం లేదనిపిస్తోంది. ఒకరికొకరు పోటీగా బరిలోకి దిగడానికి రెడీ అవుతున్నట్లు తెలుస్తోంది. మరోసారి సీనియర్ స్టార్ హీరోలు చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేష్, నాగార్జున దశాబ్దాల తర్వాత ఒకేసారి బాక్సాఫీస్ బరిలో దిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ నలుగురు దిగ్గజాలు తమ ప్రాజెక్టులతో పొంగల్ బెర్తులు ఖరారు చేసుకునే పనిలో ఉన్నారు. ఓసారి ఆ వివరాల్లోకి వెళ్తే.. - నిజంగా రాముడే దిగొచ్చాడా అనుకున్నా! వెంకటేష్ - అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఇద్దరి కలయికలో హ్యాట్రిక్ చిత్రంమిది. ఎఫ్ 2, ఎఫ్ 3 వంటి విజయాల తర్వాత వస్తోన్న చిత్రమిది. ఇందులో కల్యాణ్ రామ్ కూడా ఓ హీరోగా నటిస్తుండటంతో మల్టీస్టారర్ గా మారింది.

ఇప్పటికే ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. ఇప్పటికే జనవరి 15ని విడుదల తేదీగా ప్రకటించారు. ఆరకంగా సంక్రాంతి రేసులో తాము ముందే ఉన్నామని సంకేతాలు ఇచ్చారు. ఫ్యామిలీ ఆడియన్స్‌ను టార్గెట్ చేస్తూ అనిల్ రావిపూడి మార్కు వినోదంతో ఈ చిత్రం రాబోతుండటం వెంకటేష్‌కు పెద్ద ప్లస్ పాయింట్ కానుంది. - అత్యంత క్రూరమైన మృణాల్‌ని చూపిస్తాడట! మెగాస్టార్ చిరంజీవి కూడా వాల్తేరు వీరయ్య సెంటిమెంట్‌ను రిపీట్ చేసేందుకు సిద్ధమయ్యారు. బాబి దర్శకత్వంలో చిరంజీవి నటిస్తోన్న కొత్త సినిమాను సంక్రాంతి కానుకగానే ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని నిర్మాతలు పట్టుదలతో ఉన్నారు. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన సినిమా సంక్రాంతి విజేతగా నిలవడంతో, ఈసారి కూడా అదే మ్యాజిక్ రిపీట్ అవుతుందని మెగా ఫ్యాన్స్ ఆశిస్తున్నారు.

మాస్ ఎలిమెంట్లతో కూడిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ప్రకంపనలు సృష్టించడం ఖాయం చెప్పొచ్చు. - ఆలస్యమవుతున్న సర్దార్ 2 రిలీజ్ లేట్.. అసలు కారణం ఏమిటి మరోవైపు నందమూరి బాలకృష్ణ - గోపీచంద్ మలినేని కాంబినేషన్ కూడా సంక్రాంతి రేసులోకి వచ్చేందుకు సిద్ధమవుతోంది. వీరిద్దరి గత చిత్రం వీరసింహారెడ్డి సంక్రాంతికి విడుదలై బాలయ్య కెరీర్‌లో మైలురాయిగా నిలిచింది. దీంతో మరోసారి అదే మాస్ కాంబో రిపీట్ అవుతుండటంతో థియేటర్ల వద్ద పోటీ రసవత్తరంగా మారనుంది. బాలయ్య మార్కు డైలాగులు, గోపీచంద్ టేకింగ్ ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణ కానున్నాయి. స

అలాగే కింగ్ నాగార్జున కూడా సరైన కథతో రేసులో నిలుస్తున్నారు. 101వ చిత్రాన్ని సంక్రాంతి కానుకగా రిలీజ్ చేసే ప్లాన్ లో ఉన్నారు. ఇలా ఈ సంక్రాంతి బాక్సాఫీస్ వద్ద నలుగురు సీనియర్ల మధ్య క్లాష్ ఆఫ్ ది టైటాన్స్ తప్పదనిపిస్తుంది ఒకే సీజన్‌లో నలుగురు సీనియర్ హీరోలు రావడం వల్ల బాక్సాఫీస్ వద్ద వసూళ్లు బాగానే ఉంటాయి. కానీ థియేటర్ల సర్దుబాటు అనేది పెద్ద సవాలుగా మారుతుంది.

అభిమానుల మధ్య సోషల్ మీడియా వేదికగా జరిగే పోటీ మరోస్థాయిలో ఉంటుంది. అభిమానుల మధ్య వైరాలకు ఇలాంటి పోటా పోటీ రిలీజ్ లు కల్పిస్తుంటాయి.

## వారణాసి కోసం దేవర సెట్స్ ?




సూపర్‌స్టార్ మహేష్ బాబు మరియు దర్శక ధీరుడు రాజమౌళి కాంబినేషన్‌లో రాబోతున్న 'వారణాసి' సినిమాపై రోజురోజుకు అంచనాలు పెరుగుతున్నాయి. ఈ సినిమాకు సంబంధించి ఒక ఆసక్తికరమైన అప్‌డేట్ ఫిలిం నగర్ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. తాజా సమాచారం ప్రకారం వారణాసి టీమ్ ప్రస్తుతం జూనియర్ ఎన్టీఆర్ 'దేవర' సినిమా కోసం వాడిన టెక్నికల్ బ్యాక్‌డ్రాప్‌ను ప్రత్యేకంగా అండర్ వాటర్/వాటర్ సెట్స్ వినియోగించబోతున్నట్లు తెలుస్తుంది. 'దేవర' సినిమాలోని సముద్రపు సన్నివేశాల కోసం హైదరాబాద్‌లోని శంషాబాద్ వద్ద భారీ వాటర్ ట్యాంక్ సెట్‌ను, బ్లూ మ్యాట్ టెక్నాలజీతో రూపొందించారు. ఇప్పుడు అదే సెట్‌ను 'వారణాసి'లో గంగా నది నేపథ్యంలో వచ్చే కీలక సన్నివేశాల కోసం రీ-డిజైన్ చేసి వాడుతున్నట్లు తెలుస్తోంది. నిజానికి ఈ షెడ్యూల్ విదేశాల్లో జరగాల్సి ఉంది. కానీ ప్రస్తుతం మధ్యప్రాచ్యంలో నెలకొన్న ఉద్రిక్తతల వల్ల అంతర్జాతీయ ప్రయాణాలు రిస్క్ అని భావించిన రాజమౌళి, తెలివిగా ప్లాన్ మార్చి హైదరాబాద్‌లోనే షూటింగ్ కొనసాగిస్తున్నారు. ఈ సెట్‌లో మహేష్ బాబుపై భారీ రివర్ ఛేజ్ మరియు కొన్ని హై-టెక్ యాక్షన్ సీక్వెన్స్‌లను చిత్రీకరిస్తున్నట్లు సమాచారం. 'దేవర'లో వాడిన అడ్వాన్స్‌డ్ సినిమాటోగ్రఫీ టెక్నిక్స్ మరియు వాటర్ షూట్ ఎక్స్‌పర్టీస్‌ను ఈ షెడ్యూల్ కోసం ఉపయోగిస్తున్నట్లు సమాచారం.










## టాక్సిక్' గ్యాంగ్‌స్టర్ మూవీ కాదు

**నటుడు యశ్ ఆసక్తికర విషయం వెల్లడి**

**భిన్న నేపథ్యాలున్న కథలతో పలకరించేందుకు సిద్ధమయ్యారు నటుడు యశ్. ప్రస్తుతం నితీశ్ తివారీ**




దర్శకత్వంలో రానున్న 'రామాయణ'లోనటిస్తున్నారు. దీనితో పాటు.. గీతూ మోహన్ దాస్ డైరెక్షన్‌లో 'టాక్సిక్' చేస్తున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఈ రెండు సినిమాల గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. 'టాక్సిక్' టీజర్ చూసి అందరూ ఇది గ్యాంగ్‌స్టర్ సినిమా అనుకుంటున్నారని కానీ, ఇది అలాంటి చిత్రం కాదని స్పష్టం చేశారు. జూన్ 4న విడుదల కానున్న 'టాక్సిక్' గురించి యశ్ మాట్లాడుతూ.. 'టాక్సిక్' గ్యాంగ్‌స్టర్ సినిమా కాదు. ఎంతో ప్రతిష్టాత్మకంగా రూపొందుతోంది. భిన్నమైన ప్రపంచం.. కొత్త కథాంశంతో రానుంది. ఆకట్టుకునే విజువల్స్ ఉన్నాయి. మొదటిసారి ఒక సినిమాను ఇంగ్లిష్‌లో కూడా తెరకెక్కిస్తున్నారు. టీమ్ అంతా ఎంతో ఉత్సాహంగా పని చేస్తోంది. నా అభిమానులు నా నుంచి ఏం ఆశిస్తున్నారో నాకు తెలుసు. అందుకే ప్రతి చిన్న విషయంలోనూ జాగ్రత్తలు తీసుకుంటున్నాం. కచ్చితంగా ఇది మిమ్మల్ని అలరిస్తుంది. దర్శకురాలు గీతూ మోహన్ దాస్‌తో పనిచేయడం చాలా గొప్ప అనుభవం. సినిమాపై స్పష్టమైన విజన్‌తో ఉన్నారు. యాక్షన్ మాత్రమే కాకుండా, బలమైన భావోద్వేగాలు కూడా ఈ సినిమాలో ఉంటాయని చెప్పారు. ఇక 'రామాయణ' మొదటి భాగం గురించి యశ్ పంచుకున్నారు. 'రణ్‌బీర్ అద్భుతమైన నటుడు. సినిమా విషయంలో మా ఇద్దరి విజన్, ఆలోచనలు ఒకేలా ఉన్నాయి. అది ఈ ప్రాజెక్ట్‌కి చాలా కలిసొచ్చింది. రామాయణ పార్ట్ 1లో మా ఇద్దరి కాంబినేషన్‌లో సీన్స్ లేవు' అని తెలిపారు. రణ్‌బీర్ రాముడిగా కనిపించనున్న ఈ 'రామాయణ'లో యశ్ రావణుడిగా నటిస్తున్నారు. దీపావళికి ఈ చిత్రం విడుదల కానుంది.




NETI SHUBHODAYA Publisher, Editor and Owned by GONGURA SRINIVASA RAO, D No : 41-29/6-76, RANIGARI THOTA, KRISHNALANKA,VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520013. PRGI Reg No -"APTEL/26/A1193 .. Cell No - 9696571571 ..... Printed At SUNDAY PRINTING PRESS,"D No : 1-17-18, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006 .